www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 180

బుధవారం | 15-10-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.10.34 తదుపరి దశమి, నక్షత్రం: పుష్యమి మ.12.00 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.1.10-2.49, దుర్ముహూర్తం: ఉ.11.37-12.24, అమృతఘడియలు: శేషం ఉ. 7.10, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.49

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆ ఇద్దరు జడ్జీలు వెనక్కి!

జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ డి.రమేశ్ తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ


కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుభేందు కూడా..

కొలీజియం సిఫారసుకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం

కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ

11


జస్టిస్ డి.రమేశ్ | జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ | జస్టిస్ సుభేందు సమంత





హలో ఏపీ.. ఓకే గూగుల్!

విశాఖలో గూగుల్ ఏఐ హబ్ పెట్టుబడుల తొలి ప్రతిపాదన... రూ.87,520 కోట్లు! మంగళవారం దీని విలువ 1.36 లక్షల కోట్లకు పెరిగింది! ఏపీకి వచ్చిన అతి భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మితిమీరిన సుంకాలతో భారత్‌పై గుడ్లురుముతున్న సమయంలోనే... అదే దేశానికి చెందిన 'గూగుల్' భారత్‌లో అతి భారీ పెట్టుబడిపై ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. ఇది ప్రపంచ దేశాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

ఏపీ, గూగుల్ మధ్య కీలక ఒప్పందం

విశాఖలో గూగుల్ అతి భారీ ఏఐ హబ్

రూ. 1.36 లక్షల కోట్లకు పెరిగిన పెట్టుబడి




వికసిత్ భారత్ దిశగా!

గూగుల్ ఏఐ హబ్‌తో దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఊతం: మోదీ

భారత్‌లో ఆధునిక సాంకేతికత, ఏఐ ఆవిష్కరణలు వేగవంతం: పిచాయ్

హబ్ ప్రణాళికలపై మోదీతో ఫోన్‌లో మాట్లాడిన గూగుల్ సీఈవో

అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్ ఇదే

రాంబిల్లి, తర్లువాడ, అడవివరంలో మూడు ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఓకే

సుమారు 2 లక్షల మంది ఐటీ నిపుణులకు ఇక్కడే కొలువులు

12 దేశాలకు విశాఖ కేంద్రంగా గూగుల్ సేవలు

విశాఖలో ఐటీ వికాసానికి వీలుగా 'ఎకో సిస్టమ్'

తరలి వచ్చేందుకు మరిన్ని సంస్థల ఆసక్తి


(న్యూఢిల్లీ/అమరావతి - ఆంధ్రజ్యోతి)

గూగుల్ 'హలో ఏపీ' అని పలకరించింది.

ఏపీ 'ఓకే గూగుల్' అని ప్రతిస్పందించింది.

పెట్టుబడులపరంగా రాష్ట్ర చరిత్రలోనే... ఇంకా చెప్పాలంటే భారత దేశంలోనే సరికొత్త అధ్యాయం మొదలైంది. భారత్‌లో గూగుల్ అతిపెద్ద పెట్టుబడికి ఏపీలోని విశాఖ కేంద్రంగా మారుతోంది. అమెరికా వెలుపల అతిపెద్ద ఏఐ డేటా హబ్‌ను విశాఖలో ఏర్పాటు చేయనున్నట్టు అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలోని తాజ్ మాన్‌సింగ్ హోటల్‌లో జరిగిన 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో

మిగతా 13వ పేజీలో...


విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు ఒప్పందం అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గూగుల్ నెట్‌వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో కలిసి సెల్ఫీ దిగుతున్న కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఆవిష్కరణలు, అవకాశాలకు కొత్త శకం

గూగుల్ రాక డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా సరికొత్త అధ్యాయం.. ఏఐని ప్రతి ఇంటికీ చేరువ చేస్తాం

అప్పుడు మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకొచ్చా

ఇప్పుడు గూగుల్ విశాఖ వస్తుండడం గర్వకారణం

ప్రాజెక్టు కోసం లోకేశ్ ఎంతో కష్టపడ్డాడు: సీఎం

మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు

గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత

ఆయనతోపాటు మరో 60 మంది.. 54 ఆయుధాలు అప్పగింత

నక్సలైట్ ఉద్యమంలో మల్లోజులది 45 ఏళ్ల ప్రస్థానం

పార్టీ సిద్ధాంతకర్తగా, బాహ్య ప్రపంచంతో సంధానకర్తగా పేరు

ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మారిన వైఖరి

సాయుధ పోరు వదిలేద్దామని మల్లోజుల ప్రతిపాదన, లేఖ

వదిలేది లేదని ప్రకటించిన పార్టీ

కొంతకాలంగా మల్లోజుల లొంగుబాటుపై ఊహాగానాలు

ఆయన మీద రూ.6 కోట్ల రివార్డు, 100కు పైగా కేసులు


మల్లోజుల వేణుగోపాల్ (ఫైల్)

పెద్దపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా వామపక్షవాదులు, ప్రజాసంఘాల శ్రేణులు ఊహిస్తున్నట్లుగానే.. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు పోలీసులకు లొంగిపోయారు. నాలుగున్నర దశాబ్దాల ఉద్యమ, అజ్ఞాత జీవితం వీడి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట 60 మంది మావోయిస్టులతో కలిసి ఆయన లొంగిపోయారు. వీరిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులు, పలు డివిజనల్ కమిటీలకు చెందిన పది మంది సభ్యులు కూడా ఉన్నారు. మొత్తం 54 ఆయుధాలతో సహా వీరు లొంగిపోయారని, ఆ ఆయుధాల్లో ఏడు ఏకే 47లు, తొమ్మిది ఇన్సాస్ రైఫిళ్లు ఉన్నాయని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మావోయిస్టులు వారంతటవారే లొంగిపోయేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. మహారాష్ట్రలోని హోడ్రి అనే గ్రామం వద్ద నుంచి వారిని పోలీసు వాహనాల్లో గడ్చిరోలి పోలీసు ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చామని వెల్లడించారు. అక్కడ ఆయుధాలను అప్పగించి వారు లొంగిపోయారన్నారు. కాగా, మల్లోజుల వేణుగోపాల్‌రావు మీద రూ.6 కోట్ల రివార్డు ఉంది. వందకు పైగా కేసులు నమోదై ఉన్నాయి.

అత్యంత కీలక నేతల్లో ఒకరు

70 ఏళ్ల వయసున్న వేణుగోపాల్‌రావు అలియాస్ భూపతి, సోనును మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన నేతల్లో ఒకరిగా భావిస్తారు. ఆ పార్టీ సిద్ధాంతకర్తగా ఆయనకు పేరుంది. ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని పార్టీకీ బాహ్య ప్రపంచానికీ మధ్య ఆయన అనుసంధానకర్తగా కూడా వ్యవహరించినట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఈ ఏడాది మే నెలలో మావోయిస్టు పార్టీ

మిగతా 2వ పేజీలో...

లొంగుబాట్ల వెనుక పోలీసు నిఘా వర్గాల సుదీర్ఘ కసరత్తు



సరస్వతి పవర్ కేసులో జగన్‌కు ఎదురుదెబ్బ!

ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలపై చెన్నై అప్పిలేట్ ట్రైబ్యునల్ స్టే

వాదనలు పూర్తయ్యే వరకు షేర్ హోల్డర్ హక్కులు వినియోగించుకోవద్దు

ఇరుపక్షాలకు స్పష్టంచేసిన ఎన్‌సీఎల్‌ఏటీ ధర్మాసనం

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ హోల్డర్లుగా మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, తల్లి వైఎస్ విజయమ్మను పునరుద్ధరిస్తూ హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన ఆదేశాలపై చెన్నైలోని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌ఏటీ) స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌సీఎల్‌టీ గతంలో ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ దాఖలుచేసిన పిటిషన్‌పై చెన్నై అప్పిలేట్ ట్రైబ్యునల్ మంగళవారం విచారణ జరిపింది. స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు.. ఈ కేసులో వాదనలు పూర్తయ్యే వరకు ఇరుపక్షాలూ షేర్ హోల్డర్ హక్కులు వినియోగించుకోవద్దని

మిగతా 14వ పేజీలో...

జోగి-జనార్దన్ మధ్య లిక్కర్ లింకే!

మద్యమే కలిపింది ఇద్దరినీ



అద్దేపల్లిది కిరాణా వ్యాపారం

జోగిది కల్లు, సారా బిజినెస్

రమేశ్ మద్యం వ్యాపారానికి అద్దేపల్లి కుటుంబం సాయం

లాభాలు చూశాక వ్యాపారంలోకి

జోగి రాజకీయాల్లోకి వచ్చాక మద్యం వ్యాపారాలన్నీ అద్దేపల్లికే

తాజాగా వాట్సాప్ చాట్ బయటికి..



విజయవాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసు సూత్రధారి అద్దేపల్లి జనార్దన్‌రావు, వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ మధ్య సన్నిహిత సంబంధాలు వెలుగులోకి వచ్చాయి. జనార్దన్‌రావుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని జోగి బుకాయించినా.. వాస్తవాలు ఇప్పుడు బట్టబయలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో ఒకే వీధిలో ఎదురెదురుగా నివాసం ఉన్న వీరి కుటుంబాల మధ్య మద్యం వ్యాపారం విడదీయలేని బంధాన్ని పెనవేసింది. కల్లుగీత నుంచి మంత్రి వరకు ఎదిగిన జోగి రమేశ్

మిగతా 14వ పేజీలో...



జోగి-జనార్దన్ మధ్య చాటింగ్

జోగి 'అన్న'.. ఆ దోస్తీ మిన్న!

- ఇద్దరి మధ్య వాట్సాప్ చాట్

జోగి రమేశ్‌తో జనార్దన్‌రావుకు చాలా సాన్నిహిత్యమే ఉందన్న విషయం వారి వాట్సాప్ చాటింగ్ ద్వారా వెలుగు చూసింది. జోగిని 'అన్నా' అని సంబోధించడమే దీనికి ఉదాహరణ. జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే తాము నకిలీ మద్యం తయారు చేసినట్టు జనార్దన్‌రావు ఇప్పటికే వీడియోలు విడుదల చేశారు. తాజాగా వీరిద్దరికీ మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్ బయటికి వచ్చింది. 'కాల్ మీ.' అని జోగి రమేశ్.. జనార్దన్‌రావుకు మెసేజ్ చేయగా, దానికి ఆయన 'ఓకే.' అని సమాధానం ఇచ్చారు. తర్వాత 'కమ్ టు మై హోం.' అని జోగి నుంచి సందేశం వచ్చింది. అంతేకాదు.. 'వెన్ ఆర్ యూ గోయింగ్ ఆఫ్రికా. కాల్ మీ, ఫేస్‌టైమ్' అని మెసేజ్ చేశారు. దీని ప్రకారం జనార్దన్‌రావు ఆయన ఇంటికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ దిశగానే ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాటింగ్ జరిగిన తేదీని బట్టి జోగి రమేశ్ ఇంటి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం పోలీసులు సేకరిస్తున్నారు.



స్లీపర్ బస్సులో మంటలు

20 మంది ఆహుతి

2

రాజస్థాన్‌లో దారుణం

షార్ట్ సర్క్యూటే కారణమని సందేహాలు

బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ కష్టాలు

కస్టమర్ల సహనాన్ని పరీక్షిస్తున్న సీటీఎస్

దేశవ్యాప్తంగా నిలిచిపోయిన రూ.లక్షల కోట్ల లావాదేవీలు

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాకపోవటమే కారణమంటున్న బ్యాంకులు

హరియాణాలో మరో పోలీసు ఆత్మహత్య

ఐపీఎస్ పూరన్ కేసులో కొత్త మలుపు


వెంకటపాలెం వద్ద సీడ్‌యాక్సిస్ రోడ్డు, వెస్ట్ బైపాస్ క్రాస్ అయ్యే చోట అధికారుల నిర్లక్ష్యానికి ఆనవాళ్లుగా కనిపిస్తున్న విద్యుత్ టవర్ల పునాదులు

నిర్లక్ష్యపు పునాదులు!

రూ.30 కోట్లు నేలపాలు.. సీఆర్డీయే పరిధిలోని విద్యుత్ లైన్ల మార్పుతో నష్టం

400 కేవీ లైన్ మార్పునకు 2018లో ప్రారంభమైన పనులు

12

అలైన్‌మెంట్‌లో భారీగా తప్పులు.. ఆలస్యంగా గుర్తించిన అధికారులు

2024లో మళ్లీ టెండర్లకు పిలుపు.. పునాదుల దశలో వృథా అయిన 15 టవర్లు

మిథున్‌రెడ్డి ఇళ్లలో సిట్ సోదాలు

హైదరాబాద్, తిరుపతిలోని పీఎల్ఆర్ కార్యాలయాల్లో తనిఖీలు

మిథున్ తల్లి, పీఎల్ఆర్ డైరెక్టర్లను తిరుపతిలో ప్రశ్నించిన సిట్

లిక్కర్ స్కామ్‌లో ఆ సంస్థకు నిధుల బదిలీపై విచారణ

14

నాడు పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఎండీగా మిథున్ తల్లి స్వర్ణలత



రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయకుంటే

మీరే విచారణ చేపడతారా?

రాష్ట్రం హక్కును లాగేసుకుంటారా?

మరి సమాఖ్యవాదం మాటేమిటి?

తమిళనాడు లిక్కర్ లైసెన్సుల కేసులో ఈడీని నిలదీసిన సుప్రీంకోర్టు

2

దర్యాప్తుపై స్టే పొడిగింపు

2030 నాటికి కిలో బంగారం విలువతో
రోల్స్‌రాయిస్ కారు!

» 2040లో ప్రైవేట్ విమానమే కొనొచ్చు

» ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా



న్యూఢిల్లీ, అక్టోబరు 14: పెరగడమే తప్ప తగ్గడమే తెలియదన్నట్టుగా రోజురోజుకూ బంగారం ధర పెరిగిపోతున్న నేపథ్యంలో.. ప్రముఖ వ్యాపారవేత్త, సియెట్ టైర్స్ సహా 15కు పైగా సంస్థలున్న ఆర్పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా 'ఎక్స్'లో ఒక ఆసక్తికర పోస్టు పెట్టారు. 1980ల నుంచి ఇప్పటిదాకా.. కిలో పసిడి ధర ఎంత ఉందో.. అప్పటికి ఆ సొమ్ముతో ఏ కారు కొనొచ్చో సరదాగా వివరించారు.

సంవత్సరం	బంగారం పరిమాణం	ఏ కారు కొనొచ్చంటే..
1990	కిలో	మారుతి 800
2000	కిలో	ఎస్టీమ్
2005	కిలో	ఇన్నోవా
2010	కిలో	ఫార్చ్యూనర్
2019	కిలో	బీఎండబ్ల్యూ

పాఠం: కిలో బంగారాన్ని దాచిపెట్టుకోండి. 2030లో దాని విలువ రోల్స్ రాయిస్ కారు, 2040లో ప్రైవేట్ జెట్ కొనొచ్చు.. అని హర్ష్ గోయెంకా తన 'ఎక్స్' అకౌంట్‌లో పేర్కొన్నారు. కాగా.. ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ చాలా మంది రిప్లైలు ఇవ్వగా.. ఒక వ్యక్తి మాత్రం అందరికీ భిన్నంగా ఆలోచించారు. 2000 సంవత్సరంలో కేజీ బంగారం ధర రూ.4.4 లక్షలని. ఈరోజు కిలో పుత్తడి విలువ రూ.1.18 కోట్ల దాకా ఉందని గుర్తు చేశారు. అదే 2000 సంవత్సరంలో రూ.4.4 లక్షలతో సియెట్ కంపెనీ షేర్లు కొని ఉంటే వాటి విలువ ఇప్పుడు రూ.4.5 కోట్ల దాకా ఉండేదన్నారు.

హరియాణాలో మరో పోలీసు ఆత్మహత్య

» ఐపీఎస్ పూరన్ కేసులో కొత్త మలుపు

» ఆయనపైనే ఆరోపణలు చేసి ఆత్మహత్యకు పాల్పడ్డ సందీప్ కుమార్


సందీప్, పూరన్

న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబరు 14: హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య కేసుపై విచారణ జరుగుతున్న తరుణంలో పెద్ద మలుపు చోటుచేసుకుంది. రాష్ట్రంలో మరో పోలీసు అధికారి మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. సందీప్ కుమార్ అనే ఏఎస్ఐ రోహ్‌తక్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన తన సూసైడ్ నోట్‌లో పూరన్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేశారు. సందీప్ కుమార్ రోహ్‌తక్ సైబర్ విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయన పూరన్‌పై నమోదైన ఓ అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్నారు. 'నిజాలు' వెలుగులోకి రావడం కోసం ప్రాణత్యాగం చేస్తున్నట్లు తన మూడు పేజీల సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. సందీప్ ఆత్మహత్యకు ముందు ఆరు నిమిషాల వీడియోను కూడా రికార్డు చేశారు. పూరన్ కుమార్ ఒక అవినీతి పోలీసు అధికారి అని, ఆయన అవినీతి బయటకు వస్తుందనే భయంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కులవివక్ష అంశాన్ని ఉపయోగించి.. వ్యవస్థను హైజాక్ చేశారని ఆరోపించారు. పూరన్ గన్‌మెన్ ఒక లిక్కర్ కాంట్రాక్టర్ నుంచి రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడని, లంచం ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఐపీఎస్ అధికారి కుల రంగు పూసేందుకు యత్నించారని, చివరకు ఆత్మహత్య చేసుకున్నారని ఏఎస్ఐ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం చండీగఢ్‌లో పూరన్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఏసీ బస్సులో మంటలు.. రాజస్థాన్‌లో 20 మంది మృతి

జైపూర్, అక్టోబరు 14: రాజస్థాన్‌లో మంగళవారం ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ప్రయాణిస్తున్న ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించడంతో కనీసం 20 మంది మరణించినట్టు పోలీసులు తెలిపారు. చాలా మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. షార్ట్ సర్క్యూటే ఇందుకు కారణమని భావిస్తున్నారు. జైసల్మేర్-జోధ్‌పూర్ జాతీయ రహదారిపై మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో థయ్యాత్ గ్రామం వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ఆకస్మికంగా మంటలు చెలరేగి బస్సు అంతటా వ్యాపించడంతో ప్రయాణికులకు తప్పించుకునే అవకాశమే లేకుండా పోయింది. కొందరయితే నడుస్తున్న బస్సు నుంచి కిందకు దూకి ప్రాణాలను రక్షించుకునే ప్రయత్నాలు చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

రోడ్లపై గుంతలు.. పక్కన చెత్త!

» బెంగళూరు రోడ్ల దుస్థితిపై కిరణ్ మజుందార్‌షా పోస్టు

» ప్రతిపక్షాలు విమర్శలు తప్ప సూచనలివ్వవు కదా!

» ఆంధ్ర ఐటీ మంత్రి గద్దలా చూస్తున్నారు: మంత్రి ప్రియాంక ఖర్గే

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో రోడ్లు, పారిశుధ్య సమస్య మరోమారు తెరపైకి వచ్చింది. బెంగళూరులోని తన బయోకాన్ ఆఫీసుకు వచ్చిన ఓ విదేశీ సందర్శకుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్‌షా ఎక్స్‌లో మంగళవారం పెట్టిన పోస్టు పెట్టారు. 'రోడ్లు ఎందుకు ఇంత అధ్వానంగా ఉన్నాయి? ఎటు చూసినా గుంతలు. రోడ్ల పక్కన చెత్త కనిపిస్తోంది. ప్రభుత్వం పెట్టుబడులకు మద్దతు ఇవ్వదా? నేను ఇప్పుడే చైనా నుంచి వచ్చాను. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు కూడా ఇండియా ఎందుకు సరైన దిశలో పోతున్నట్లు కనిపించడంలేదు?' అని ఆ పారిశ్రామికవేత్త తనవద్ద ప్రస్తావించారని ఆమె పేర్కొంటూ.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లకు ట్యాగ్ చేశారు. ఈ పోస్టు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. కిరణ్‌మంజుదార్‌షా పోస్టుపై భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కిరణ్ మజుందార్ బెంగళూరుకు బయోటెక్నాలజీ ద్వారా ఎంతో సేవ చేశారని, బెంగళూరు కూడా ఆమెకు అన్నీ సమకూర్చిందన్నారు. వర్షాల కారణంగా రాష్ట్రంలో నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు దెబ్బతిన్నాయని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. కిరణ్ మజుందార్‌షా ట్వీట్‌పై ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే స్పందించారు. 'నెలన్నరగా నిరంతరంగా ఊహించనంతగా వర్షం కురుస్తోంది. రోజూ ఎంత మేరకు గుంతలు పూడ్చామనే సమాచారాన్ని బెంగళూరు నగర కమిషనర్ ఇస్తున్నారు. రోడ్లపై చెత్త వేసేవారు ఆకాశం నుంచి రారు కదా? ప్రజలకు బాధ్యత ఉండాలి. పొరుగు రాష్ట్రాల వారు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడం సహజమే కదా?' అని వ్యాఖ్యానించారు. ఆంధ్ర ఐటీ మంత్రి గద్దలా కాసుకుని చూస్తున్నారని, ఎవరెవరు ఎక్కడికి వస్తారని గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కర్రెగుట్టల్లో ఆయుధాల డంప్

» గుర్తించి స్వాధీనం చేసుకున్న జవాన్లు

చింతూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు చెందిన భారీ ఆయుధ డంప్‌ను ఛత్తీస్‌గఢ్‌లో జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీసుస్టేషను పరిధి తాండ్వాల గ్రామ అడవుల్లో 206 కోబ్రా సీఆర్‌పీఎఫ్ 229, 153, 196 బెటాలియన్లకు చెందిన జవాన్లు మంగళవారం కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టులు భద్రపర్చిన ఆయుధ డంప్ కంటపడడంతో వెలికి తీశారు. వీటిలో 51 బీజీఎస్ షెల్స్, 100 బండిల్సు హెచ్‌టీ అల్యూమినియం వైర్, ఐఈడీ ప్రెషర్ బాంబులు ఐదు, 50 స్టీలు రాడ్సు, భారీ విద్యుత్ వైర్, ఇనుప షీట్సు, ఇనుప ప్లేట్సు, భారీ పేలుడు సామగ్రి ఉన్నాయి. కర్రెగుట్టల కింద ఉన్న ఈ ప్రాంతం ఇటీవలి వరకు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో 21 రోజుల పాటు కర్రెగుట్టల్ని బలగాలు జల్లెడ పట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందడం, 35 తుపాకులు, 450 ఐఈడీ బాంబులను సైతం స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. మావోయిస్టుల కోటగా ఉన్న కర్రెగుట్టలపై పోలీస్‌బేస్ క్యాంపు ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీంతో కర్రెగుట్టలలో రోజుల తరబడి కూంబింగ్‌లు జరుగుతున్నాయి.

మల్లోజుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణించిన తర్వాత.. పార్టీకి తదుపరి సారథ్యం వహించే నేతల్లో వేణుగోపాల్‌రావు పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అయితే, ఆ బాధ్యతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి అప్పగించారని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన నియమితులయ్యారని వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, కగార్‌లో భాగంగా వరుసగా ఎన్‌కౌంటర్లు జరగటం, మావోయిస్టు పార్టీ అత్యంత సీనియర్ నేతలను, సెంట్రల్ కమిటీ సభ్యులను కోల్పోవటం జరుగుతూ వచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని తుదముట్టిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెబుతున్నట్లుగానే ఈ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, మావోయిస్టు పార్టీలో అంతరంగిక చర్చ ప్రారంభమైనట్లు సమాచారం. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనస్రవంతిలో కలిసి, ప్రజా సమస్యలపై బహిరంగ ఉద్యమాలు నిర్మించాలని తద్వారా మావోయిస్టు పార్టీని రక్షించుకుందామని వేణుగోపాల్ ప్రతిపాదించగా.. దానిని ఇతర నేతలు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ నుంచి అనూహ్యంగా విడుదలైన ఒక బహిరంగలేఖ పెను సంచలనం సృష్టించింది. సాయుధపోరును తాత్కాలికంగా వదిలిపెట్టి శాంతిమార్గంలోకి వస్తామని, ప్రభుత్వంతో చర్చలు జరపటానికి సిద్ధమంటూ ఆయన మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ హోదాలో, తన ఫొటో ముద్రించి ఉన్న లేఖను విడుదల చేశారు. ఈ లేఖకు ప్రతిగా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్.. సాయుధ పోరాటాన్ని వీడేది లేదంటూ ఓ లేఖ విడుదల చేశారు. ఆ తర్వాత కూడా వేణుగోపాల్ తన ప్రతిపాదనను సమర్థిస్తూ మరో లేఖ విడుదల చేశారు. దీంతో ఆయన లొంగిపోవడం ఖాయమని అంతా భావించారు. వారం రోజుల క్రితమే ఆయన హైదరాబాద్ పోలీసులకు లొంగిపోయారనే వార్తలు కూడా వెలువడ్డాయి. తాజాగా, ఆయన మహారాష్ట్రలో పోలీసుల ఎదుట లొంగిపోయినప్పటికీ, అందుకు సంబంధించిన ఫొటోలను మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. కాగా, వేణుగోపాల్‌రావుకు మావోయిస్టు పార్టీలో కొన్ని కమిటీలు మద్దతు తెలపటం, భారీ సంఖ్యలో లొంగిపోవటం వంటి పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా, వేణుగోపాల్‌రావు ప్రోద్బలంతోనే తెలంగాణలోని భద్రాది-కొత్తగూడెం, ములుగు ప్రాంతాల్లో పలువురు మావోయిస్టులు లొంగిపోయినట్లుగా పోలీసు వర్గాలు తెలిపాయి.


పెద్దపల్లి పట్టణంలోని వేణుగోపాల్ రావు కుటుంబ సభ్యుల ఇల్లు



ఆనందంగా ఉంది

తమ బాబాయి అడవులను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందని మల్లోజుల వేణుగోపాల్ రావు పెద్దన్న ఆంజనేయులు కుమారుడు దిలీప్ శర్మ తెలిపారు. ఆయన ఎలా ఉంటారో ఇప్పటి వరకు చూడలేదని తెలిపారు. ఉద్యమంలోకి వెళ్లిపోయిన కొడుకులను ఒక్కసారైనా చూడాలన్న కోరిక నెరవేరకుండానే నానమ్మ మధురమ్మ మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని దిలీప్ శర్మ పేర్కొన్నారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81, 141 బెటాలియన్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతతో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో బీజాపూర్ జిల్లాకు చెందిన మిలీషియా కమాండర్ పద్దం లక్మా, సీఎన్ఎం కమాండర్ దొడ్డి బుద్రు, పార్టీ సభ్యులు లేఖం బండి, మడవి కోసా, మిలీషియా మెంబర్ మడవి లక్మా, సుక్మా జిల్లాకు చెందిన పార్టీ సభ్యుడు కుంజం పాపారావు ఉన్నారు.

కోటన్న స్ఫూర్తిగా అడవి బాట

పెద్దపల్లి పట్టణానికి చెందిన మధురమ్మ, వెంకటయ్య దంపతులకు మల్లోజుల మూడో సంతానం. ఆయన రెండో అన్న మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ 1975లో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పని చేశారు. 2011 నవంబరు 11న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మరణించారు. సోదరుడు కిషన్‌జీ స్ఫూర్తితోనే వేణుగోపాల్‌రావు సైతం 1980 ప్రాంతంలో నక్సల్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 2010 ఏప్రిల్‌లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతికి కారణమైన ఘటనలో వేణుగోపాల్ కీలకపాత్ర పోషించారని చెబుతారు. అదే ఏడాది కేంద్ర కమిటీ సభ్యుడు చెరుకూరి రాజ్‌కుమార్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన అనంతరం కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా నియమితుడయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా వేణుగోపాల్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అభయ్ పేరిట లేఖలు విడుదల చేసేవారు. ఉద్యమంలో వేణుగోపాల్‌కు సహచరిగా ఉన్న గడ్చిరోలి జిల్లాకు చెందిన సిడాం విమలచంద్ర అలియాస్ తారక అలియాస్ వత్సల ఈ ఏడాది జనవరి 1న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట లొంగిపోయారు.

రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేయకుంటే
మీరే వెళ్లి విచారణ చేపడతారా?

» రాష్ట్రం హక్కును లాగేసుకుంటారా.. ఈడీని నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 14: తమిళనాడులో మద్యం షాపు లైసెన్సుల స్కాంలో తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టీఎన్ఎస్ఎంఏసీ) పాత్రపై దర్యాప్తు చేపట్టిన ఈడీకి సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. ఒక నేరాన్ని రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదని మీరు అనుమానిస్తే.. మీరే వెళ్లి సొంతగా విచారణ చేపడతారా? ఇలాగైతే సమాఖ్యవాదం ఏముంటుంది? దర్యాప్తు హక్కు రాష్ట్ర ప్రభుత్వానిది. దానిని మీరే లాగేసుకోవడం లేదా' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఈడీని మంగళవారం నిలదీశారు. మద్యం షాపుల లైసెన్సుల స్కాంలో టీఏఎస్ఎంఏసీ అవకతవకలకు పాల్పడిందంటూ.. ఈడీ విచారణ చేపట్టింది. కార్పొరేషన్‌కు చెందిన పది కార్యాలయాల్లో ఈ ఏడాది మొదట్లో సోదాలు చేపట్టింది. లెక్కకు రాని రూ.వెయ్యి కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. దీనిని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. తమిళనాడు తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) స్పందిస్తూ.. రాష్ట్రప్రభుత్వం 47 కేసులు పెట్టినా.. అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోందని.. అందుచేత ఈడీ దర్యాప్తు చేయొచ్చని అన్నారు. చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని.. అలాగైతే సమాఖ్యవాదం పరిస్థితేంటని అడిగారు. చట్ట ఉల్లంఘన జరిగిందని దర్యాప్తు సందర్భంగా ఈడీ కనిపెడితే.. దానిని రాష్ట్రప్రభుత్వ దర్యాప్తు సంస్థతో పంచుకోవాలని పీఎంఎల్ఏ సెక్షన్ 66(2) చెబుతోందని గుర్తుచేశారు. అనంతరం టీఏఎస్ఎంఏసీపై ఈడీ దర్యాప్తు, సోదాలు, వస్తువుల స్వాధీనంపై గతంలో విధించిన స్టే ఉత్తర్వులను ధర్మాసనం పొడిగించింది.

లోకం తీరు



లొంగుబాట్ల వెనుక
సుదీర్ఘ కసరత్తు

హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్, ఇతర కీలక నేతలు, బలగాలతో కలసి లొంగిపోవడం, భారీ సంఖ్యలో ఆయుధాలనూ అప్పగించడం వెనుక పోలీసు, నిఘా వర్గాలు సుదీర్ఘ కసరత్తు చేసినట్టు సమాచారం. కేంద్రంతో పాటు తెలంగాణ, ఏపీకి చెందిన నిఘావర్గాలు కొన్నాళ్లుగా ఇందుకోసం ఈ లొంగుబాట్ల కోసం రంగం సిద్ధం చేస్తూ వస్తున్నట్టు తెలిసింది. ఈ ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ సహా 27 మంది మావోయిస్టులు మృతిచెందిన తర్వాతి పరిణామాలు కీలకంగా మారాయని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఆ సమయంలో పార్టీలో పార్టీలో తీవ్ర అంతర్మథనం జరిగినట్టు తెలిసింది. ఈ దశలోనే లొంగుబాట్ల దిశగా నిఘా వర్గాలు మావోయిస్టులపై మరింత ఒత్తిడి పెంచాయి. అదే సమయంలో ఆగస్టు 15న రాసినట్టు ఉన్న మల్లోజుల వేణుగోపాల్ లేఖ గత నెలలో విడుదల కావడం, పార్టీ వైఫల్యాలను ఆయన అంగీకరించడం, ఉద్యమాన్ని కొనసాగించలేని పరిస్థితులను ప్రస్తావించడం ద్వారా ఆయన లొంగుబాటు సిద్ధమయ్యారనే సంకేతాలు అందాయి. మిగతా క్యాడర్‌నైనా బతికించుకోవాలనే లక్ష్యంతో మల్లోజుల ఒపికగా అడుగులు వేశారని.. లొంగుబాట్లను ప్రోత్సహించే విధంగా, లొంగిపోయిన వారికి ప్రాణహానీ ఉండదనే సంకేతాలు క్యాడర్‌లోకి వెళ్లేలా ప్రకటనలు చేశారని నిఘావర్గాలు చెబుతున్నాయి. తొలుత ఆయన తెలంగాణలో లొంగిపోవచ్చని ప్రచారం జరిగినా.. కేంద్ర నిఘా వర్గాల సూచనల మేరకే మహారాష్ట్రలో లొంగిపోయినట్టు సమాచారం. కీలక నేతలు సహా 60 మంది మావోయిస్టులు ఒకేసారి లొంగిపోవడం, ఏకే 47లు, ఇన్సాస్ రైఫిళ్లు సహా 54 కీలక ఆయుధాలను అప్పగించడం వ్యూహంలో భాగమేనని తెలిసింది.

సోషల్ మీడియా ప్రకటనలకూ ముందస్తు అనుమతి తప్పనిసరి

» నామినేషన్ పత్రాలు వేసేటప్పుడే అధికారిక 'ఖాతాల' వివరాలనూ ఇవ్వాలి

» ఈసీ ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తాము జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్ట్రానిక్, వెబ్, సోషల్ మీడియాల్లో జారీ చేసే అన్ని ప్రకటనలకూ ఈ నిబంధన వర్తిస్తుందని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. బిహార్, జమ్మూ కశ్మీర్, ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించే క్రమంలో ఈసీ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలు(ఎంసీఎంసీ) రాష్ట్ర, జిల్లా స్థాయిలోనూ ఏర్పాటు అవుతాయని పేర్కొంది. పార్టీలు, అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్, ఇంటర్నెట్ వేదికగా జారీ చేసే అన్ని ప్రకటనలకూ పై కమిటీల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. అలాగే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజుల తరువాత సమర్పించే లెక్కల్లో కూడా ప్రకటనల నిమిత్తం వివిధ సంస్థలకు చేసిన చెల్లింపులనూ చెప్పాల్సిందేనని పేర్కొంది. నామినేషన్లు వేసేటప్పుడే ఆయా పార్టీలు, అభ్యర్థుల అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను, వెబ్ ప్లాట్ ఫాం వివరాలనూ ఇవ్వవలసిందేనని వివరించింది. ఈసీకి సమర్పించే లెక్కల్లో కంటెంట్ క్రియేషన్ కోసం చేసిన ఖర్చును కూడా జత చేయాలంది. ఎంసీఎంసీ వివిధ మీడియాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుందని, పెయిడ్ న్యూస్ అని అనుమానం వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటుందని ఈసీ స్పష్టం చేసింది.

బిహార్లో తండ్రీకొడుకుల పోరు!

అభ్యర్థులకు లాలూ టికెట్లు.. వెనక్కి తీసేసుకున్న తేజస్వి.. ఆర్‌జేడీ నేతల్లో కలకలం



పట్నా/న్యూఢిల్లీ, అక్టోబరు 14: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీ ఆర్‌జేడీలో ముసలం పుట్టినట్లు సంకేతాలు వెలువడ్డాయి. పార్టీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ టికెట్లు పంపిణీ చేయగా.. ఆయన చిన్న కుమారుడు, పార్టీ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ వాటిని వెనక్కి తీసుకోవడం ఆర్‌జేడీ నేతలను విస్మయపరుస్తోంది. తండ్రీకొడుకుల నడుమ ఆధిపత్య పోరు బహిర్గతం కావడం ఆ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. విపక్షాల మహాగఠ్‌బంధన్(మహాకూటమి) కూడా షాకైంది. పాలక ఎన్‌డీఏ పక్షాలు పొత్తు ఖరారుచేసుకుని అభ్యర్థుల జాబితాలు కూడా విడుదల చేస్తుండగా.. విపక్షాల నడుమ ఇంకా సీట్ల సర్దుబాటు కాలేదు. ఐఆర్‌సీటీసీ స్కాం కేసులో ఢిల్లీ కోర్టులో హాజరైన లాలూ, ఆయన భార్య రాబ్రీదేవి సోమవారం సాయంత్రం పట్నాలోని తమ నివాసానికి చేరుకున్నారు. తర్వాత టికెట్ ఆశావహులకు పార్టీ నాయకత్వం నుంచి ఫోన్లు వెళ్లాయి. వారంతా లాలూ నివాసంలోకి వెళ్లి ఆనందంతో బీఫారాలు తీసుకుని బయటకు వచ్చారు. వీరిలో ఇటీవల సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూ నుంచి ఆర్‌జేడీలోకి వచ్చిన సీనియర్ ఎమ్మెల్యేలు సునీల్‌సింగ్ (పర్బత్తా), నరేంద్రకుమార్‌సింగ్ అలియాస్ బోగో (మతిహానీ), ఆర్‌జేడీ సిటింగ్ సభ్యులు భాయ్ వీరేంద్ర, చంద్రశేఖర్ యాదవ్, ఇజ్రాయిల్ మన్సేరీ కూడా ఉన్నారు. తేజస్వి సైతం ఢిల్లీ కోర్టులో హాజరై కొద్ది గంటల తర్వాత పట్నా చేరుకున్నారు. తనకు తెలియకుండా తండ్రి టికెట్లు పంపిణీ చేయడంపై మనస్తాపానికి గురయ్యారు. అదీగాక మిత్రులతో సీట్ల లెక్క తేలకుండా టికెట్ల పంపిణీ సబబు కాదని.. భాగస్వామ్య పక్షాలు సీరియస్‌గా తీసుకోవచ్చని తండ్రికి నచ్చజెప్పారు. రాత్రి పొద్దుపోయాక.. టికెట్లు దక్కిన నేతలందరికీ మళ్లీ ఫోన్లు చేసి పిలిపించారు. 'సాంకేతిక కారణాలతో' వారందరి నుంచి తేజస్వి బీఫారాలు వెనక్కి తీసుకున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కూడా..

గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా లాలూ ఏకపక్షంగా వ్యవహరించారు. 40 సీట్లకు గాను 23 చోట్ల ఆర్‌జేడీ అభ్యర్థులను నిలిపారు. గెలిచే సీట్లు కాకుండా ఓడిపోయేవి ఇచ్చారని మిత్రపక్షాలు ఇప్పటికీ లాలూను ఆక్షేపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన అలాగే వ్యవహరించడంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి తేజస్విపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. 243 స్థానాల అసెంబ్లీలో కాంగ్రెస్ 70-75 సీట్లు అడుగుతోంది. వీఐపీ 50 సీట్లతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తోంది. సీపీఐ, సీపీఎం 24 స్థానాల చొప్పున అడుగుతున్నాయి. ఆర్‌జేడీ కనీసం 134 సీట్లలో పోటీచేస్తానని పట్టుబడుతోంది.

71 మందితో బీజేపీ తొలి జాబితా

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు 71 మందితో బీజేపీ తన తొలి జాబితాను మంగళవారం ప్రకటించింది. ఇందులో పలు విశేషాలు చోటు చేసుకున్నాయి. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన స్పీకర్ నంద కిశోర్ యాదవ్‌కు సీటు ఇవ్వకపోగా.. పదేళ్లుగా ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉన్న డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరికి సీటు ఇచ్చారు. శాసన మండలి సభ్యుడు, ఆరోగ్యం, న్యాయ శాఖ మంత్రి మంగళ్ పాండేను కూడా బరిలో దించడం విశేషం. ఈ ముగ్గురూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసినవారే. స్పీకర్ సీటు పట్నా సాహిబ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ కుమార్ గుప్తాను నిలబెట్టారు. కాగా మాజీ కేంద్రమంత్రి రామ్ కృపాల్ యాదవ్‌కు దానాపూర్ సీటును కేటాయించడం పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. లఖిసరాయ్ నుంచి మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించిన డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు మళ్లీ అదే సీటు దక్కింది. ప్రస్తుత మంత్రులు ఆరుగురికి సీట్లు దక్కాయి. 10 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వలేదు. 9 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ప్రముఖ జానపద, భక్తి గీతాల గాయని మైథిలి ఠాకూర్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఆమెకు దర్భంగా ప్రాంతంలోని అలీ నగర్ సీటును కేటాయించే అవకాశం ఉంది.

బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్స్ కష్టాలు



» కస్టమర్ల సహనాన్ని పరీక్షిస్తున్న సీటీఎస్

» దేశవ్యాప్తంగా నిలిచిపోయిన రూ.లక్షల కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ: కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక పోయిందంటారు. చెక్కుల సత్వర క్లియరెన్స్ కోసం ఈ నెల 4 నుంచి ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన చెక్ ట్రంకేషన్ సిస్టమ్(సీటీఎస్) పనితీరు ఇలానే ఉంది. నిన్న మొన్నటి వరకు బ్యాంకుల్లో చెక్ డిపాజిట్ చేస్తే రెండు రోజుల్లో క్లియరై ఖాతాదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యేది. సీటీఎస్ విధానంతో అదే రోజు చెక్కులు క్లియరై.. డబ్బులు ఖాతాదారుల ఖాతాల్లో జమ అవుతాయని ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో ఖాతాదారులు తెగ సంబర పడిపోయారు. తీరా ఆచరణకు వచ్చేసరికి ఈ కొత్త విధానం అటు బ్యాంకర్లకు, ఇటు ఖాతాదారులకు చుక్కలు చూపిస్తోంది. సీటీఎస్ విధానం అమల్లోకి వచ్చి దాదాపు 10 రోజులు అవుతోంది. చెక్కుల క్లియరెన్స్ కాకపోవటంతో దేశవ్యాప్తంగా రూ.వేల కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. చెక్కులు జారీ చేసిన వారి ఖాతాల నుంచి నిధులు డెబిట్ అయినా.. చెక్కులు తీసుకున్న మా ఖాతాల్లో మాత్రం జమ కావడం లేదని ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని బ్యాంకింగ్ ఖాతాదారులకూ ఈ తిప్పలు తప్పడం లేదు. బ్యాంకులు మాత్రం సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కాకపోవటంతో చెక్కుల క్లియరెన్స్ ఆలస్యమవుతోందని ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు పంపించి చేతులు దులుపుకుంటున్నాయి.

ఇదీ కొత్త విధానం

ఈ నెల 4 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానంలో సాధారణ పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిపాజిట్ అయిన చెక్కులను బ్యాంకులు వెంటనే స్కాన్ చేసి క్లియర్ చేయాలి. పేయింగ్ బ్యాంకులు కూడా చెల్లింపుల విషయాన్ని సాయంత్రం 7 గంటల కల్లా ధ్రువీకరించాలి. పేయింగ్ బ్యాంకు నుంచి ఎలాంటి స్పందన లేకపోతే దాన్ని ఆటోమేటిక్ ఆమోదంగా భావిస్తారు. సీటీఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత చాలా కేసుల్లో ఐదారు రోజులైనా చెక్కులు క్లియర్ కావడం లేదని ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు.

సమస్యలున్నాయ్: ఎన్‌పీసీఐ

సీటీఎస్‌ను అమలు చేస్తున్న ఎన్‌పీసీఐ కూడా ఈ కొత్త విధానంతో చెక్కుల క్లియరెన్స్‌లో సమస్యలు నిజమేనని అంగీకరించింది. అయితే సోమవారం నుంచి ఈ సమస్య చాలా వరకు పరిష్కారమైనట్టు తెలిపింది. అక్టోబరు 4 నుంచి ఇప్పటి వరకు రూ.8,49,557 కోట్ల విలువైన 1.49 కోట్ల చెక్కులను క్లియర్ చేసినట్టు వెల్లడించింది.

సాంకేతిక సమస్యలతోనే..

ఆయా బ్యాంకుల సాఫ్ట్‌వేర్, సీటీఎస్ వ్యవస్థతో సరిగా అనుసంధానం కాకపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. దీంతో చెక్ రీడబిలిటీ, పంచింగ్, కొన్ని కోడ్స్ అంకెలును సీటీఎస్ వ్యవస్థ సరిగా చదవలేక పోతోంది. దీంతో ఆ చెక్కులపై ఉన్న వివరాలను ఒకటికి రెండుసార్లు ఫిజికల్‌గా చదివి మళ్లీ ప్రాసెస్ చేయాల్సి వస్తోంది. చెక్కుల క్లియరెన్స్ ఆలస్యం కావడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఈ సమస్యలతో కొన్ని వ్యాపార సంస్థలు ఖాతాదారుల నుంచి తమకు రావలసిన బకాయిలను నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా రాబట్టుకుంటున్నాయి.

పూర్తి శిక్షణ లేకపోవడం

కొత్త విధానంలో చెక్కుల క్లియరెన్స్‌కు సంబంధించి బ్యాంకులు తమ సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో ఖాతాదారులు డిపాజిట్ చేసిన చెక్కులను బ్యాంకింగ్ సిబ్బంది చక్కగా స్కాన్ చేసి, డిజిటల్ ఇమేజీని అదే రోజు సెంట్రల్ ఆపరేషన్స్ టీమ్‌కు పంపించలేక పోతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఇన్‌స్టాంట్ చెక్ క్లియరెన్స్ కోసం ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన సీటీఎస్ విధానం ఖాతాదారులకు చుక్కలు చూపిస్తోంది.



ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రత్నాకర్

ఉపరాష్ట్రపతికి ఆహ్వానం

పుట్టపర్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మంగళవారం అధికారింగా ఆహ్వానించారు.

తెలుగు తేజం అరుదైన ఘనత

- ప్రపంచంలోని 14 ఎత్తైన శిఖరాల్లో తొమ్మిది అధిరోహించిన తొలి భారతీయుడుగా కర్నూలు వాసి తమ్మినేని భరత్ రికార్డు
- దశాబ్ద కాలంగా ఆరు ఖండాల్లోని పర్వతారోహకులకు మార్గదర్శకుడు
- ప్రపంచంలోనే తొలిసారిగా ఎవరెస్ట్ అధిరోహించిన అంధ మహిళ విజయం వెనుకా మనోడే

కర్నూలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన పర్వతారోహకుడు 36 ఏళ్ల తమ్మినేని భరత్ అరుదైన ఘనతను సాధించాడు. ప్రపంచలోని 14 ఎత్తైన పర్వత శిఖరాల్లో తొమ్మిందింటిని విజయవంతంగా అధిరోహించిన తొలి భారతీయుడిగా నిలిచాడు. మౌంట్ చో ఓయూ... చైనాలో ఉన్న ఈ పర్వత శిఖరం ప్రపంచంలో ఎత్తైన వాటిలో ఆరవది. ఇది సముద్ర మట్టానికి 8,188 మీటర్ల ఎత్తులో ఉంది. భారత కాలమాన ప్రకారం మంగళవారం 8.55 గంటలకు తెలుగు తేజం... భరత్ ఆ శిఖరాన్ని అధిరోహించాడు. దీంతో ఆయన తొమ్మిది శిఖరాగ్రాలను అధిరోహించినట్లయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ తాజా విజయానికి ముందు... తమ్మినేని 2017, మేలో ఎవరెస్ట్, సెప్టెంబరు 2018లో మౌంట్ మనస్లు, 2019 మేలో మౌంట్ లోట్సే, మార్చి 2022లో మౌంట్ అన్నపూర్ణ, అదే ఏడాది ఏప్రిల్‌లో మౌంట్ కాంచనగంగ, మే 2023లో మౌంట్ మకాలు, అక్టోబరు 2024లో మౌంట్ శిశాపంగ్మ, 2025 ఏప్రిల్‌లో మౌంట్ ధౌలగిరిలను అధిరోహించారు. ఇవన్నీ సముద్రమట్టానికి 8,000 మీటర్లను మించి ఉన్న శిఖరాలే. మిగిలిన ఐదు శిఖరాగ్రాలు... మౌంట్ కే2, నంగా పర్బాత్, గషెర్‌బ్రమ్ 1, 2, బ్రాడ్ పీక్... పాకిస్తాన్‌లో ఉన్నాయి. ప్రస్తుతానికి ఇవి భారతీయ పర్వతారోహకులకు అందుబాటులో లేవు.



పర్వతారోహకుడు, తెలుగు తేజం భరత్ తమ్మినేని

ఎందరికో స్ఫూర్తి నిస్తూ...

తమ్మినేని మిత్రుడు, అతని పర్వతారోహణ ప్రయాణాన్ని సునిశితంగా గమనిస్తూ వచ్చిన దీపాంజన్ దాస్ మాట్లాడుతూ, 'గత దశాబ్ద కాలంగా ఆరు ఖండాల్లోని పర్వతారోహక బృందాలకు భరత్ మార్గదర్శకుడిగా, కొత్త తరం భారతీయ పర్వతారోహకులకు స్ఫూర్తిగా నిలిచాడు. అతని నేతృత్వంలో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అంధ మహిళ చోన్జిన్ అంగ్మో 2025లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. ప్రపంచంలోనే ఇది సాధించిన మొదటి అంధ మహిళగా ఆమె నిలిచారు. అలాగే 16 ఏళ్ల అత్యంత పిన్న వయస్సులో ఏడు శిఖరాలను అధిరోహించిన యువకుడిగా విశ్వనాథ్ కార్తికేయ రికార్డు సాధన వెనుక భరత్ ఉన్నారు' అని తెలిపారు.

ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు: భరత్

బేస్ క్యాంపునకు వచ్చిన తరువాత భరత్ మాట్లాడుతూ, 'మౌంట్ చో ఓయూని అధిరోహించడానికి సెప్టెంబరు 30న బేస్ క్యాంపునకు చేరుకున్నాం. అయితే అత్యంత ప్రతికూల వాతావరణం ఉండడంతో మేం ముందుకు కదలలేకపోయాం. అక్టోబరు 12న శిఖరాగ్రానికి వీలైనంత వేగంగా కదలాలని నిర్ణయించుకున్నాం. చైనా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6.55 గంటలకు శిఖరాగ్రానికి చేరుకున్నా' అని తెలిపారు. బేస్ క్యాంపు నుంచి తన సందేశాన్ని రికార్డు చేసి భరత్ పంపారు. 'ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు. భారతీయ సాహస క్రీడల సామర్థ్యానికి ఇది ప్రతీక. ఈ విజయాన్ని దేశంలోని కొత్త తరం సాహసక్రీడల ఔత్సాహికులకు అంకితమిస్తున్నా. పర్వతాలు గౌరవాన్ని, పట్టుదలను, సహనాన్ని కోరుతున్నాయి. ఈ రోజు చో ఓయూ శిఖరాగ్రంపై నిలబడ్డ నేను నా ప్రయాణంపట్ల పూర్తి సంతృప్తితో ఉన్నాను. ఇది అత్యంత ఎత్తైన శిఖరాలను లక్ష్యం చేసుకోవలన్న స్ఫూర్తిని దేశంలోని కొత్తతరం పర్వతారోహకుల్లో నింపుతుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు.

భరత్ ఘనత దేశానికే గర్వకారణం

- తల్లి సుశీల, అక్కల భావోద్వేగం

భరత్ సాధించిన ఘనత దేశానికే గర్వకారణమని తల్లి సుశీల, అక్కలు రాజీ, బిందు సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ భరత్ సాధించిన విజయంపట్ల ఆనందోద్వేగాలతో స్పందించారు. కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలో ఉండే వ్యాపారి నాగరాజు, సుశీల దంపతులకు ముగ్గురు పిల్లలు. కర్నూలలో ప్రాథమిక విద్యను చదివిన భరత్ 6-10వ తరగతి వరకు గుంటూరులో ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్ కర్నూలులో పూర్తి చేశాడు. ఊటీలో బీటెక్ జెనిటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తండ్రి నాగరాజు మరణం తరువాత 2016లో కుటుంబం మొత్తం హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. చిన్నప్పటి నుంచి ఉన్న ఆసక్తితో 2012 నుంచి పర్వతారోహణలో శిక్షణ తీసుకుంటున్నాడు. అమ్మ సుశీల, అక్కల ప్రోత్సాహంతో అవిశ్రాంతంగా ముందుకు సాగుతున్నాడు భరత్ తమ్మినేని.

విజయవాడ మెట్రో టెండర్ల గడువు పెంపు

విజయవాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ మెట్రో రైల్ టెండర్ల గడువును ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్(ఏపీఎంఆర్‌సీ) మరోసారి పొడిగించింది. విజయవాడ మెట్రో రైల్ సివిల్ నిర్మాణాలకు ఏపీఎంఆర్‌సీ రూ.4,500 కోట్లతో బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు కారిడార్లకు టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. మంగళవారం టెండర్లను తెరవాల్సిన సమయంలో కాంట్రాక్టు సంస్థలు స్వల్ప గడువును కోరాయి. దీంతో మరో 10 రోజులు అంటే ఈనెల 24వ తేదీ వరకు పొడిగించారు. ప్రధాన ఇన్‌ఫ్రా కంపెనీల అభ్యర్థన మేరకు పొడిగించినట్టు ఏపీఎంఆర్‌సీ ఎండీ ఎస్‌పీ రామకృష్ణారెడ్డి మీడియాకు తెలిపారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

- మనువాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం
- ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



మరియం ధావలే

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ పాలనలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ఆరోపించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభల్లో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయని, బాధితులకంటే నిందితులకే కేంద్ర ప్రభుత్వ సహకారం ఎక్కువగా ఉంటోందని విమర్శించారు. హత్రాస్ కేసులో నిందితులందరూ ప్రస్తుతం బెయిల్‌పై విడుదలై ఉండటం దీనికి ఉదాహరణ అని తెలిపారు. మహిళలపై దాడుల కేసులలో కేవలం 27 శాతం నిందితులకు మాత్రమే శిక్షలు పడుతుండడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ సహకారంతోనే ఈ కేసులు అత్యధికంగా నిర్వీర్యమవుతున్నాయని ఆరోపించారు. మరోవైపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలను అంబాని, అదానీకి కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం కారణంగా రిజర్వేషన్లు అమలు కావడం లేదని, తద్వారా ఎక్కువగా నష్టపోతున్నది మహిళలేనని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ మనువాదాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందని, దీనివల్ల నష్టపోయేది మహిళలేనని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడానికి మనువాదం అంగీకరించదని, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐద్వా పోరాటాన్ని రూపొందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 13 గంటల పనివిధానాన్ని అమలు చేసేందుకు సిద్ధపడడం తగదని అన్నారు. ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ మాట్లాడుతూ కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ మూలంగా పలు ప్రాంతాల్లో బాధితులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠద్వార దర్శనాలు ఈసారి రెండురోజులే?

- టీటీడీ యోచన...ఆగమ సలహామండలి అభిప్రాయాల సేకరణ!

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వైకుంఠద్వార దర్శనాలను పూర్వపు విధానంలో రెండు రోజులు మాత్రమే నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. గతంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో మాత్రమే ఆలయంలోని వైకుంఠ ద్వారాలను తెరిచి దర్శనం కల్పించేవారు. అయితే భక్తుల రద్దీ ఆ రెండురోజుల్లో అధికంగా ఉండటంతో పాటు శ్రీరంగం ఆలయ తరహాలో పదిరోజుల పాటు వైకుంఠ ద్వారాలను తెరిచి ఉంచి దర్శనాలను చేయించాలని గత ప్రభుత్వంలో అధికారులు నిర్ణయించారు. అప్పట్లో దీనికి పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు కూడా అంగీకారాన్ని తెలుపుతూ లేఖలను కూడా సమర్పించారు. దీంతో 2020 నుంచి పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలను కల్పించే విధానాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఇది ఆగమ విరుద్ధమని, పైగా పదిరోజుల పాటు దర్శనాలు కొనసాగించడంతో ఆ టోకెన్ల కోసం భక్తులు ఒకేసారి ఎగబడుతున్న క్రమంలో తోపులాటలు, తొక్కిసలాటలు జరుగుతున్నాయని కొందరి నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తిరిగి రెండురోజుల వైకుంఠ ద్వార దర్శనాల అమలుపై ఆలోచనలు చేస్తున్నట్టు సమాచారం. దీనికోసం ఆగమపండితులు, అర్చకులు, శాస్త్ర నిపుణులతో ఇప్పటికే టీటీడీ అధికారులు చర్చించినట్టు తెలిసింది. టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఉన్నతాధికారులు, అర్చకబృందం, ఆగమపండితులతో ఈ విషయమై సమావేశమైనట్టు సమాచారం. త్వరలోనే వైకుంఠద్వార దర్శనాలపై ఓ నిర్ణయానికి రానున్నట్టు తెలుస్తోంది.

13 జిల్లాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు 13 జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ మార్కెటింగ్ శాఖ జాబితా విడుదల చేసింది. విజయనగరం జిల్లాలో రాజాం, పార్వతీపురం మన్యంలో సాలూరు, పాలకొండ (భామి ని), కాకినాడలో పిఠాపురం, ఏలూరులో చింతలపూడి (జంగారెడ్డిగూడెం), ఎన్‌టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు (గంపలగూడెం, ఏ కొండూరు), కంచికచర్ల, గుంటూరులో ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరు, పల్నాడులో మాచర్ల, పిడుగురాళ్ల, గురజాల (నడికుడి), క్రోసూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, నరసరావుపేట, బాపట్లలో పర్చూరు (పర్చూరు, మార్టూరు), ప్రకాశంలో మార్కాపురం, కడపలో ప్రొద్దుటూరు, అనంతపురంలో గుత్తి, తాడిపత్రి, నంద్యాలలో నంద్యాల, కర్నూలులో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు (పెంచికలపాడు), మంత్రాలయం ఏఎంసీలలో పత్తి కొనుగోళ్లను జరపనున్నట్టు ప్రకటించింది.

నటి సౌమ్య శెట్టిపై తెలంగాణ వాసి ఫిర్యాదు

- రూ.86 లక్షలు తీసుకుని మోసం చేశారని ఆరోపణ

విశాఖపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్నేహితురాలి ఇంట్లో బంగారం చోరీ చేసిన కేసులో జైలుకు వెళ్లొచ్చిన సినీ నటి సౌమ్యశెట్టిపై తెలంగాణవాసి ఒకరు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. స్నేహం పేరుతో తనకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఆమె రూ.86 లక్షలు తీసుకుని మోసం చేసినట్టు ఆరోపించారు. ఆ ఫిర్యాదు ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం అయ్యవారిపల్లెకు చెందిన కొండాపూర్ లక్ష్మీకాంత్‌రెడ్డి(34)కి పెందుర్తిలో నివాసం ఉంటున్న సౌమ్యశెట్టితో ఈ ఏడాది మార్చిలో వాట్సాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. మార్చి 29న లక్ష్మీకాంత్ విశాఖ వచ్చారు. ఇద్దరూ భీమిలి సమీపంలోని ఒక రిసార్టులో కలుసుకున్నారు. తర్వాత సాన్నిహిత్యం పెరగడంతో రూ.45 వేలు నగదు, ఆరు గ్రాముల బంగారం ఇచ్చారు. అలా బంగారం, నగదు, ఫ్లాట్ కొనుగోలు కోసం దశలవారీగా సుమారు రూ.86 లక్షలు వరకూ వెచ్చించారు. ఆ తర్వాత సౌమ్యశెట్టి దూరంపెట్టింది. దీనిపై తన స్నేహితుడి ద్వారా ఆమెను సంప్రదించేందుకు యత్నించినా తిరస్కరించిందని, ఆమె భర్త, తల్లి కూడా తనను మోసం చేయడంలో సహకరించారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చి స్పందించారు. ఫిర్యాదుదారుడి చెబుతున్నదాంట్లో వాస్తవమెంత అనేది విచారించాలని భీమిలి సీఐ తిరుమలరావును ఆదేశించారు.

యుద్ధ విన్యాసాలు చేస్తూ సైనికుడి మృతి

- గుంటూరు చేరిన పార్థివ దేహం
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



తేజ్ భరద్వాజ్

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని సైనిక స్థావరంలో యుద్ధ విన్యాసాలు చేస్తూ గుంటూరు నగరంలోని సంగడిగుంటకు చెందిన సైనికుడు తేజ్ భరద్వాజ్(40) మృతి చెందారు. యుద్ధ విన్యాసాల్లో భాగంగా భరద్వాజ్ సైనిక వాహనంలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడి కన్నుమూశారు. ఈ ఘటనతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. దేశసేవపై భరద్వాజ్ విద్యార్థి దశలోనే మక్కువ పెంచుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంతో కష్టపడి సైన్యంలో చేరాడని, అర్ధంతరంగా దూరమైపోతాడని ఊహించలేదని వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, భరద్వాజ్ పార్థివదేహం మంగళవారం సాయంత్రం రాజస్థాన్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరింది. అక్కడి నుంచి గుంటూరులోని ఆయన స్వగృహానికి తరలించారు. బుధవారం భరద్వాజ్ పార్థివ దేహాన్ని ప్రజలు, ప్రజాప్రతినిధులు సందర్శించిన అనంతరం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల తెలిపారు.

కురుపాం విద్యార్థినుల పచ్చకామెర్లకు

మరుగుదొడ్లే కారణం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

మహారాణిపేట (విశాఖపట్నం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడడానికి మరుగుదొడ్లు కారణమని తేలిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు వైద్యాధికారుల కమిటీ ప్రాథమిక నివేదిక ఇచ్చిందన్నారు. మంగళవారం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించారు. 146 మంది విదార్థినులకు పచ్చకామెర్లు సోకగా, వారిలో 65 మందికి కేజీహెచ్‌లో చికిత్స అందించామన్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మమతకు మరో పరీక్ష

పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్యవిద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఘటన అత్యంత బాధాకరమైనది. అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను, సహకరించిన మరో యువకుడిని పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. తన సోదరుడు ఒక వంతెనకింద దాక్కొని ఉన్నాడని ఐదో నిందితుడి సోదరి స్వయంగా పోలీసులకు సమాచారం ఇచ్చింది. చేసిన తప్పుకు అతడు శిక్ష అనుభవించాల్సిందేనని ఆమె అంటోంది. భయంతో వొణికిపోతున్న సోదరుడి అకృత్యాన్ని పసిగట్టడమే కాక, ప్రేమాభిమానాలకు లొంగిపోకుండా పోలీసులకు అప్పగించిన ఆమె నడవడికను ప్రశంసించవలసిందే. అయితే, అత్యంత సున్నితమైన ఈ ఘటనలో సైతం కించిత్తు బాధ్యతాయుతమైన ప్రవర్తన రాజకీయ నాయకుల్లో కనిపించకపోవడం విషాదం.

తృణమూల్ అధినేత మమతాబెనర్జీ ఏలుబడిలో ఉన్నంతకాలం రాష్ట్రానికి ఈ అకృత్యాలు, అఘాయిత్యాలనుంచి విముక్తిలేదని బీజేపీ నాయకులు విరుచుకుపడుతున్నారు. నిందితులు ఐదుగురూ తృణమూల్‌కు చెందినవారేననీ, మమత వారిని కాపాడుకొస్తున్నదని అమిత్ మాలవీయవంటివారు బరిలోకి దిగి బల్లగుద్దుతూంటే, అందుకు ఆధారాలేమీ లేవని మీడియా అంటోంది. అర్థరాత్రి పన్నెండున్నరకు కాలేజీ వదిలి మగస్నేహితుడితో బయట తిరగాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ మమత చేసిన వ్యాఖ్య అగ్నికి ఆజ్యం పోసింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో ఆమె అందెవేసిన చెయ్యి. ఆ తరువాత ఆమె తన మాటల్ని వక్రీకరించారంటూ ఏవో సవరణలూ వివరణలూ ఇచ్చినప్పటికీ, జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆమె వెనక్కుతగ్గినా, బీజేపీ భయానక దాడినుంచి తప్పించుకోవాలంటే ఈ వాదనే సరైనదని ఆమె పార్టీ సహచరులు ఇంకా విశ్వసిస్తున్నట్టు ఉంది.

కోల్‌కతా మహిళలకు క్షేమకరమైన నగరమని ఎన్సీఆర్బీ డేటా వరుసగా నాలుగోసారి ప్రశంసించినందుకు మమత వందిమాగధులంతా ఆమెను ఆకాశానికి ఎత్తేశారు. కానీ, ఈ ఏడాదిలోనే రెండు విద్యాసంస్థల్లోనూ, ఒక వైద్యసంస్థలోనూ జరిగిన అత్యాచారఘటనలు ప్రజలు మరిచిపోలేదు. గత ఏడాది ఆర్జీకార్ ఆస్పత్రిలో జరిగిన అమానుష కృత్యం యావత్‌దేశాన్నే కుదిపేసింది. సుదీర్ఘకాలం మమతను వెంటాడిన ఆ ఘటన తరువాత,

సరిగ్గా ఏడాదిలోనే మమతకు ఈ దుర్గాపూర్ నుంచి మరో విషమపరీక్ష ఎదురైంది. సదరు వైద్యవిద్యార్థిని ఒడిశాకు చెందినది కావడంతోపాటు, ఈ ఘటనలో నిందితుల మతం కూడా బీజేపీకి ఆయుధంగా ఉపకరిస్తున్నది. పశ్చిమబెంగాల్ ఔరంగజేబు పాలనలో ఉందని బాధితురాలి తండ్రి వ్యాఖ్యానించారు. బాధలో ఉన్న ఆ తండ్రి ఎవరిని ఎన్ని మాటలైనా అనవచ్చు, శాపాలూ పెట్టవచ్చు. కానీ, సహజంగా బీజేపీ నాయకులనుంచి వినవచ్చే ఈ తరహా మాటలు, అంతటి కష్టంలోనూ అతడినోట రావడం విచిత్రం. ఈ దారుణఘటన ఒడిశా ఆత్మగౌరవం మీద దాడి అంటున్నాడతను. కోటిన్నర రూపాయలు పెట్టి ఈ ప్రైవేటు కాలేజీలో సీటు కొనుక్కున్నా, తన కుమార్తెకు ఏ మాత్రం భద్రతలే కపోవడమేమిటని అతడు ప్రశ్నిస్తున్నాడు. ఒడిశా నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు, మహిళా కమిషన్ పెద్దలు బెంగాల్ వచ్చి కూర్చున్నారు. బాధితురాలికి ఒడిశా ముఖ్యమంత్రి టెలిఫోన్ చేసి ఓదారుస్తూ, పూర్తి భరోసా ఇచ్చారు. మిమ్ములను పరామర్శించడానికి వచ్చిన పశ్చిమబెంగాల్ గవర్నర్ సి.వి. ఆనందబోస్‌తో మీరంతా మీ బాధను సరిగా పంచుకున్నారా? మీ ఆవేదనను పూర్తిగా తెలియచేశారా? అని బాధితురాలి తల్లిని అడిగి మరీ తెలుసుకున్నారు. ఒడిశా బీజేపీ సర్కార్ సైతం మమతను వదిలిపెట్టదల్చుకోలేదని దీని అర్థం. బెంగాల్ బీజేపీతోనూ, ఢిల్లీలోని వారి అధినాయకులతోనూ పోరాడుతున్న మమతకు ఇప్పుడు పొరుగురాష్ట్రం కూడా కొత్తగా శత్రువైంది. నవీన్‌పట్నాయక్ ఉన్నంత కాలం బెంగాల్, ఒడిశాల మధ్య సఖ్యత ఉండేది. ఇప్పుడది అంతరించి, చిన్నచిన్న వివాదాలు, గిల్లికజ్జాలు మొదలైనాయి. ఇటీవల ఒడిశాలోని కటక్‌లో దుర్గాపూజ సందర్భంగా మతకల్లోలాలు రేగడంపై మమత తీవ్ర విమర్శలు చేశారు. కటక్ తగలబడుతోందని, బీజేపీ రాకతో ఒడిశాలో మతచిచ్చు మొదలైందని, వీళ్ళు ఎక్కడున్నా నాశనమేనంటూ ఆమె ఘాటుగా విరుచుకుపడ్డారు. దుర్గాపూర్ ఘటనతో అడ్డంగా దొరికిన మమతమీద ఒడిశానేతలు ప్రతీకారం తీర్చుకుంటున్నారు. బెంగాల్‌లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగబోతున్న తరుణంలో ఈ విషాదం చుట్టూ సాగుతున్న రాజకీయం ఇప్పట్లో చల్లారే సూచనలు లేవు.

పాకిస్థాన్‌కు ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో మోదీ సర్కార్ వ్యూహాత్మక స్నేహానికి భారతదేశ ప్రయోజనాలే తొలి, మలి, తుది లక్ష్యం. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం దోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనం.

ట్రంప్ బాధిత భారత్‌కు దౌత్యవిజయం

ఏ దేశ దౌత్య నీతి అయినా దాని సొంత ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. అన్ని దేశాలూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదుపుతూ దౌత్యంలో చదరంగం ఆడుతుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా తాలిబాన్లతో చిగురిస్తున్న భారత మైత్రి ఒక ఆసక్తికరమైన పరిణామం.

మతం పేర మానవతకు మచ్చగా, ధర్మం పేర అధర్మ క్రూరత్వానికి ప్రతీకగా ఉన్న అఫ్ఘానిస్తాన్ పాలకులు ఇస్లామిక్ ఉన్మాద తాలిబాన్లతో హిందూత్వ రాజకీయాలు కేంద్రబిందువుగా మనుగడ సాగించే భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెలిమి చేయడం అశేష భారతీయులకు సహజంగా ఆశ్చర్యం కలిగిస్తోంది. హిందువులు, సిక్కులను ఊచకోత కోసిన తాలిబాన్ల నాయకుడికి ఉత్తరప్రదేశ్‌లో యోగి అదిత్యనాథ్ ప్రభుత్వం పోలీసు కవాతుతో స్వాగతించింది. తెలుగువాడయిన దౌత్యవేత్త వి.వెంకటేశ్వరరావును కాబూల్‌లో దారుణంగా చంపిన ఉన్మాదుల నాయకుడికి న్యూఢిల్లీలో

గల్ఫ్ లేఖ

ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఒకటి సాదర స్వాగతం చెప్పడం సామాన్య జనానికి దిగ్భ్రాంతి కలిగించింది. అఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్లకు చేరువ కావడానికి భారతదేశం గత కొంత కాలంగా గల్ఫ్ దేశాల పాలకుల అండదండలతో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తూ లక్ష్యాన్ని సాధిస్తోంది. అఫ్ఘానిస్తాన్‌లోని మత ఛాందస తాలిబాన్ల ప్రభుత్వాన్ని రష్యా మినహా భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఏవీ గుర్తించలేదు, అయినా పాకిస్థాన్‌లో పెరిగి అక్కడి మదరసలో విద్యనభ్యసించి తాలిబాన్ల అగ్రనాయకత్వగణంలో ఒకడుగా ఎదిగిన అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అమీర్‌ఖాన్ ముత్తఖీని మోదీ సర్కారు ఎర్రతివాచీ పరిచి స్వాగతించడం శరవేగంగా మారుతోన్న దౌత్య సమీకరణాలకు సంకేతం.

పాకిస్థాన్ బలం, బలహీనత రెండూ అఫ్ఘానిస్తానే. అసలు తాలిబాన్లు అనేవారు పాక్ సైనిక దళాల నిఘా సంస్థ ఐఎస్ఐ ఉత్పాదిత ఒక క్రూర గెరిల్లాల గుంపు. అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ సేనలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలన్నీ కలిసికట్టుగా పాక్ సహకారంతో తాలిబాన్లను ప్రభవింపచేసి పెంపొందించారు. భారత మిత్రుడు అయిన నజీబుల్లాను 1992లో ముజాహిదీన్లు పదవీచ్యుతిడిని చేశారు. దేశం విడిచి పారిపోలేని నిస్సహాయత



స్థితిలో అతడు కాబూల్ నగరంలో ఐక్యరాజ్యసమితి శరణు జొచ్చాడు. 1996లో తాలిబాన్లు ఐరాస కార్యాలయం నుంచి నజీబ్‌ను అపహరించి కిరాతకంగా హతమార్చి మరీ అధికారాన్ని చేపట్టారు. తొలుత ముజాహిదీన్లతో గానీ, ఆ తరువాత తాలిబాన్లతో గానీ భారతదేశం ఏ విధమైన దౌత్య సంబంధాలు పెట్టుకోలేదు. భారత్ వైఖరి అప్పట్లో తీవ్ర విమర్శలకు గురయింది. ఆ తర్వాత నజీబుల్లా ప్రత్యర్థులు అయిన ముజాహిదీన్లు కొందరితో స్నేహం చేయడం భారత్‌కు అనివార్యమైంది. నజీబుల్లాను కూలద్రోసిన అహ్మద్ షా మసూద్ భారత్‌కు ఆప్తుడయ్యాడు. తాలిబాన్లకు వ్యతిరేకంగా పోరాడిన అహ్మద్ షా మసూద్‌కు భారత్ అన్ని విధాలుగా సహాయమందించింది.

తాలిబాన్ల మొదటి ప్రభుత్వ హయాం (1996–2001)లో అఫ్ఘానిస్తాన్‌లో పాకిస్థాన్‌కు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. ఆ తర్వాత అమెరికా, నాటో దేశాల చేతుల్లో కీలుబొమ్మలు అయిన పాలకులు 2021 వరకు అఫ్ఘానిస్తాన్‌ను పరిపాలించినా తాలిబాన్లను నిర్మూలించలేకపోయారు. అమెరికా నిష్క్రమణ అనంతరం 2021లో అఫ్ఘానిస్తాన్‌లో మళ్లీ అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబాన్లు ఈ సారి పాక్ పాలకుల కనుసన్నలలో కాకుండా స్వతంత్రంగా బాహ్య ప్రపంచం వైపు చూడడం మొదలుపెట్టారు. పాకిస్థాన్‌తో విబేధిస్తూ తమ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం ప్రారంభించారు. తమకు ఆలంబనగా ఖతర్‌ను ఎంచుకున్నారు. తరం మారడంతో ఆలోచన సరళి కూడా మారింది. గతంలో పాకిస్థాన్ చెప్పినట్లుగా తాలిబాన్ల అధినాయకుడు ముల్లా ఉమర్ నడువగా ఇప్పుడు అతని కుమారుడు, ప్రస్తుత రక్షణమంత్రి ముల్లా యాఖూబ్ అలా నడువాలనుకోవడం లేదు. ఖతర్‌లో భారత విదేశాంగ శాఖ అధికారులతో ముల్లా యాఖూబ్ సమావేశం కావడం ఆ తర్వాత దుబాయిలోనూ అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి ముత్తఖీ సమావేశం కావడం పాకిస్థాన్‌ను కలవరపరిచింది. పహల్గాంలో ఉగ్రదాడిని పాకిస్థాన్ పేరు ప్రస్తావిస్తూ పొరుగున ఉన్న నేపాల్ ఖండించలేదు కానీ అఫ్ఘానిస్తాన్ మాత్రం నిర్ద్వంద్వంగా ఖండించింది, ఇది మాములు విషయం కాదు. భారత దౌత్యనీతికి విజయం. అయినా మోదీ ప్రభుత్వం ఈ విజయాన్ని బహిరంగంగా చెప్పుకోలేని ఇరకాటంలో ఉన్నది.

దాయాది దేశానికి ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో భారత్ వ్యూహాత్మక స్నేహం మన దేశ ప్రయోజనాలు లక్ష్యంగా ఉన్నదే, సందేహం లేదు. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం డోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనం. దేశీయ రాజకీయాల విషయానికి వస్తే, ఒకవేళ కాంగ్రెస్ పార్టీయే తాలిబాన్లతో ఇటువంటి మైత్రి చేసి ఉన్నట్టయితే బీజేపీ అగ్గిరాజేసేదని ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం లేదు.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ ఘటనల రేపటి దృశ్యం ఏమిటి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారతదేశంలో కొన్ని సంఘటనలు అనూహ్యంగా రాజకీయ పరిణామాలకు దారితీయడం కద్దు. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనల రాజకీయ పర్యవసానాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉన్నది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు దాడి కలిగించిన దిగ్భ్రమ నుంచి సమాజం తేరుకోకముందే హరియాణాలో పూరన్ కుమార్ అనే ఒక ఐపీఎస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఈ రెండు ఘటనల మధ్య రాయబరేలీలో ఒక అమాయకుడిని చెట్టుకు కట్టి కొట్టి చంపారు. ఈ ముగ్గురూ దళితులే కావడం దేశంలో ఆ అణగారిన సామాజిక వర్గాల పరిస్థితిపై చర్చలకు దారితీస్తోంది. గ్వాలియర్ కోర్టులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను కొందరు అడ్డుకోవడం, ఒక న్యాయవాది అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా ఉద్రిక్తతలకు కారణమైంది. ఈ సంఘటనలు ఏ మార్పును సూచిస్తున్నాయి?

పూరన్ కుమార్ ఆత్మహత్య తర్వాత సంభవించిన పరిణామాలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోనేపట్‌లో జన విశ్వాస్ జనవికాస్ కార్యక్రమంలో పాల్గొనవలసి ఉండగా తన పర్యటననే రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి సైనీ పాల్గొనాల్సిన వాల్మీకి ఉత్సవాలను కూడా రద్దు చేశారు. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన 9 పేజీల లేఖలో హరియాణాలో తాను ఎదుర్కొన్న కులవివక్షను, వేధింపులను ప్రస్తావించారు. డీజీపీతో సహా 12 మంది అధికారుల పేర్లను కూడా పేర్కొన్నారు. తనకు ప్రమోషన్లు రాకుండా అడ్డుకున్నారని, ప్రాధాన్యత లేని పోస్టింగులు ఇచ్చారని ఆయన ఆరోపించారు. తన భర్త ఆరోపణలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోనిపక్షంలో ఆయన భౌతిక కాయాన్ని పోస్ట్ మార్టమ్‌కు అప్పగించే ప్రసక్తి లేదని పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అధికారి అమ్నీత్ కుమార్ పట్టుబడుతున్నారు. పూరన్ ఆత్మహత్య తర్వాత చండీఘడ్‌లో ఆయన నివాసాన్ని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతో సహా రాజకీయ పార్టీల నేతలందరూ సందర్శించడం ప్రారంభించారు. బిహార్‌లో ఎన్డీఏ మిత్రపక్షంగా ఉన్న లోక్‌జనశక్తి నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా పూరన్ కుమార్ నివాసానికి వెళ్లి ప్రభుత్వ సంస్థల్లో కులఆధారంగా వివక్ష జరుగుతోందని విమర్శించారు. ఈ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఏ దళిత కుటుంబమూ ప్రధాన స్రవంతిలో చేరేందుకు ముందుకు రాదని ఆయన అన్నారు. అక్టోబర్ 7న పూరన్ ఆత్మహత్య చేసుకోగా వారం రోజుల తర్వాత డీజీపీని సెలవుపై పంపించడం అనివార్యమయింది.

అధికార వ్యవస్థలోను, రాజకీయాల్లోనూ కుల వివక్ష దేశంలో కొత్తది కాదు. పూరన్ కుమార్ ఆరోపణల్లో వాస్తవాలు ఏ మేరకు ఉన్నాయో, ఆయన నిజంగా వివక్ష వల్ల ఆత్మహత్య చేసుకున్నారో అన్నవి సరైన విచారణ జరిగినప్పుడే తేలుతుంది కాని ఈ దేశంలో కుల వివక్ష తీవ్రంగా ఉన్నదన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. అదే సమయంలో వివిధ అణగారిన కులాలను దరి చేర్చుకోకుండా రాజకీయాల్లో విజయం సాధించలేమన్న విషయం కూడా ఆయా పార్టీలకు తెలుసు. 16 శాతం దళితులు ఉన్న హరియాణలో కుల రాజకీయాల ప్రాధాన్యం తెలిసినందువల్లే గత ఎన్నికల్లో ఎస్సీల్లో మరింత వెనుకబడిన వర్గాలకు ఎన్నికల ముందు 20 శాతం రిజర్వేషన్ కల్పించారు. అదే సమయంలో సెల్జా వంటి దళిత నేతలను కాంగ్రెస్ విస్మరించడం కూడా బీజేపీకి ఉపయోగపడింది. ఇప్పుడు అదే బీజేపీకి పూరన్ కుమార్ ఆత్మహత్య సమస్యలు తెచ్చిపెడుతోంది.

నిజానికి హిందూత్వ ఆధారంగా అనేక కులాలను ఆకర్షించి బీజేపీకి ఓటు బ్యాంకు సాధించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చాలా కాలంగా కృషి చేస్తోంది. 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ సిద్ధాంతానికీ బందీ కాదు. అది నిత్యం సమాజం అవసరాలకు తగ్గట్లుగా తనను తాను మార్చుకున్నందువల్లే అది దినదిన ప్రవర్థమానమవుతోంది' అని ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ సిద్ధాంతకర్త రాంమాధవ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ కూడా వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది కాని ఆ పార్టీ క్షీణ దశలో ఉన్నదని, 21వ శతాబ్దంలో కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత తగ్గిపోతుండగా ఆర్ఎస్ఎస్ ఆవశ్యకత పెరిగిపోతోందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఒక మెజారిటీ మతం ఆధారంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్‌ను ఒక రాజకీయ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీతో పోల్చవచ్చా అన్న విషయాన్ని పక్కన పెడితే ఏ సంస్థ ప్రభావాన్ని అయినా అది ఎన్ని సంవత్సరాలు పూర్తి చేసుకున్నది అన్న విషయం ఆధారంగా అంచనా వేయడం కష్టం. 11 సంవత్సరాల క్రితం కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఆర్ఎస్ఎస్ విశేషంగా దోహదం చేసిందనడంలో సందేహం లేదు. అదే సమయంలో బీజేపీ అధికారంలో ఉన్నందువల్ల కూడా ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందన్న విషయంలో కూడా అనుమానం లేదు. భారతీయ జనతా పార్టీ అభ్యున్నతికి ఆర్ఎస్ఎస్ కారణమైనందువల్ల మోదీ ప్రభుత్వం ఎదుర్కొనే ప్రశంసలనైనా, విమర్శలనైనా సంఘ్‌ను దృష్టిలో పెట్టుకోకుండా చేయడం సరైంది కాదేమో? ఒక రకంగా రాజగురువు పాత్రను సంఘ్ పోషిస్తుండడమే అందుకు కారణం.

రాంమాధవ్ అన్నట్లు ఆర్ఎస్ఎస్ తనను తాను పరివర్తనం చేసుకుంటోంది. బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కూ పెద్ద తేడాలేని విధంగా ఈ మార్పు జరుగుతోంది. అనేకమంది బీజేపీ నేతలు ఆర్ఎస్ఎస్ శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ను ఒక ఎన్జీవోగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పినప్పటికీ ప్రభుత్వంపై దాని ప్రభావాన్ని విస్మరించలేము. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు మారుమూల ప్రాంతాల్లో కూడా రాజకీయ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బూత్ స్థాయి మేనేజ్‌మెంట్ నుంచి బీజేపీ నేతల మధ్య విభేదాలు తొలగించేందుకు కూడా ఆ సంస్థ ప్రయత్నిస్తోంది. వివిధ రాజకీయ పార్టీల మధ్య పొత్తులు సంఘ్ వల్లే ఏర్పడుతున్నాయి.

ఒకప్పుడు అగ్రవర్ణాల పార్టీగా, బ్రాహ్మణ–బనియా పార్టీగా మాత్రమే గుర్తింపు పొందిన భారతీయ జనతా పార్టీ ఇవాళ దళితులు, ఆదివాసీలు, ఇతర అణగారిన వర్గాల్లో చొచ్చుకువెళ్లేందుకు సంఘ్ అనేక కార్యకలాపాలు నిర్వహించడమే ప్రధాన కారణం. ఉత్తర భారతదేశంలో కాన్షీరామ్ ప్రయోగం విఫలమయ్యాక దళితులను పెద్ద ఎత్తున తమ వైపునకు తిప్పుకునేందుకు చాలా కాలం నుంచి ఆర్ఎస్ఎస్ యత్నిస్తోంది. కాన్షీరామ్ విమర్శించిన చెంచారాజ్ సంస్కృతే ప్రత్యామ్నాయ దళిత రాజకీయాలకు నష్టం చేకూరుస్తుందేమో? 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక దళిత ఓట్లు బీజేపీ సాధించేందుకు ఆర్ఎస్ఎస్ కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

నిజానికి దళితులను హిందూత్వ వైపునకు మళ్లించడంలో ఆర్ఎస్ఎస్ రూపొందించిన భూమిక ఆధారంగానే బీజేపీ పనిచేస్తోంది. దళితులను రాజకీయంగా సమీకరించడంలో భాగంగా వారిలో వేర్వేరు సాంస్కృతిక వర్గాలను, స్థానిక ఆచారాలను, వారు ఆరాధించే సద్గురువులను హిందూత్వలో విలీనం చేసేందుకు సంఘ్ చాలా కాలంగా కృషి చేస్తోంది. 'సామాజిక సమరసత మంచ్' పేరుతో దళితుల్లో చొచ్చుకుపోయే ప్రయత్నం చేసింది. రవిదాస్, కబీర్, శివనారాయణ్ సందేశాలను స్వంతం చేసుకుంది. తమ సాధువులు, గురువులకు ఇస్తోన్న గౌరవాన్ని దళితులూ గుర్తించి సంఘ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సమానత్వం, గౌరవం కోసం దళితుల తపనను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. సుహల్దేవ్, బల్దేవ్, దల్దేవ్ వంటి పాసీ హీరోల ఉత్సవాలను నిర్వహించారు. ఒకప్పుడు వారిని అగ్రవర్ణాలపై పోరాడిన శక్తులుగా కాన్షీరామ్ భావించారు. కాని వారిప్పుడు జాతీయవాద, హిందూత్వశక్తులుగా మారారు. అంతేకాక జాతవేతర దళితులు, యాదవేతర ఓబీసీల్లో కూడా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోంది. గుజరాత్ నుంచి త్రిపుర వరకు ఆదివాసీలు, సంచార జాతుల్లో కూడా పనిచేస్తోంది. యూపీ, రాజస్థాన్, ఎంపీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అత్యధిక ఓట్లు లభించేందుకు అదే కారణం. వారి చరిత్రను, గుర్తింపును, సాంస్కృతిక చిహ్నాలు, సంకేతాలను వేదాలు, పురాణాల్లో గాథలకు, వ్యక్తులకు ముడిపెట్టి దేశం జాతి ప్రయోజనాలు అన్న భావనను ప్రవేశపెట్టేందుకు సంఘ్ చేస్తున్న కృషి అంతా ఇంతా కాదు.

అగ్రవర్ణాలను బీజేపీ వైపు తిప్పుకోవడం పెద్ద కష్టం కాదు యూపీ, బిహార్‌లో దళితులు, ఓబీసీలను హిందూత్వ పరిధిలో ఇముడ్చుకోవడం ఆర్ఎస్ఎస్ బీజేపీ ఒక సవాలుగా తీసుకున్నాయి. సోషలిస్టు రాజకీయాలు విఫలమయ్యాక వారి పని కొంత సులువైంది. షెడ్యూల్డు కులాలు, బీసీల ఓట్లను సమీకరించేందుకు ఉత్తరప్రదేశ్‌లో అప్నాదళ్, సుహల్దేవ్ భారతీయ సమాజ్ వంటి పార్టీలతోనూ, బిహార్ నితీశ్ కుమార్, రాంవిలాస్ పాశ్వాన్ వంటి వ్యక్తులతోనూ బీజేపీ పనిచేసేందుకు ఆర్ఎస్ఎస్ ప్రోద్బలమే కారణమని వేరే చెప్పనక్కర్లేదు. రాజ్యాంగాన్ని కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ గౌరవించే ప్రయత్నం చేస్తున్నాయి. 'ఇది మన రాజ్యాంగం' అని గోల్వాల్కర్ అన్న మాటల్ని రాంమాధవ్ గుర్తు చేశారు.

కాని ఈ మార్పు ప్రజల జీవితాల్లో, ఆలోచనా విధానంలో, ఎంత మేరకు మార్పు తీసుకువచ్చిందన్నదే ప్రధానం. సంఘ్ ఎంత ప్రయత్నించినా ప్రజల్లో కుల అస్తిత్వాలను చెరిపివేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. తాను నిలబెట్టిన ప్రభుత్వంపై నైతిక ఆధిపత్యం చలాయించడం కూడా అంత సులభం కాదని స్పష్టమవుతోంది. గత కొంతకాలంగా సామాజిక న్యాయం అజెండాగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పనిచేస్తున్న విషయాన్ని విస్మరించలేము. గవాయ్‌పై దాడి, పూరన్ కుమార్ ఆత్మహత్య వంటి సంఘటనలు ప్రతిపక్షాల సామాజిక న్యాయ అజెండాకు తోడ్పడతాయనడంలో అతిశయోక్తి లేదు. కుల రాజకీయాలే ప్రధానమైన బిహార్ ఎన్నికల్లో ఈ ప్రభావం ఎంతమేరకు ఉంటుందో ఇప్పుడే చెప్పలేము కాని హిందూత్వ పరిధిలోకి అణగారిన వర్గాలను తీసుకు వచ్చేందుకు ఆర్ఎస్ఎస్ చేసిన కష్టం వృథా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీజేపీపై ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



AKBAR

> **ఆరెస్సెస్ ఎంత ప్రయత్నించినా ప్రజల్లో కుల అస్తిత్వాలను చెరిపివేయడం అంత సులభం కాదు. తాను నిలబెట్టిన ప్రభుత్వంపై నైతిక ఆధిపత్యం చలాయించడమూ సాధ్యం కాదు. గవాయ్‌పై దాడి, పూరన్ కుమార్ ఆత్మహత్య ప్రతిపక్షాల సామాజిక న్యాయ అజెండాకు తప్పక తోడ్పడతాయి. బిహార్ ఎన్నికల్లో ఈ ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో గానీ హిందూత్వ పరిధిలోకి అణగారిన వర్గాలను తీసుకువచ్చేందుకు సంఘ్ చేసిన కష్టం వృథా పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీజేపీపై ఉన్నది.**

అమెరికా ఆత్మీయురాలికే నోబెల్ 'శాంతి'!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతి తనకే కావాలని ప్రకటించి ఆ ప్రయత్నం చేయటంతో ఈసారి అవార్డు ఎంపిక ఆసక్తికరంగా మారింది. బహుమతి కోసం పరోక్షంగా ప్రయత్నించటం సహజమే కానీ, తనకి ఇవ్వమని ఆ స్థాయి మనిషి బహిరంగంగా హుంకరించటం అరుదు. ఇలా చేసి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా తన స్థాయిని తానే తగ్గించుకోవటంతోపాటు, చివరకు ఎంపిక కాలేక అవమానం పాలయ్యారు.

గతంలో అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన రూజ్‌వెల్ట్ (1906), వుడ్రో విల్సన్ (1919), జిమ్మి కార్టర్ (2002), బరాక్ ఒబామా (2009)లు నోబెల్ శాంతి బహుమతులు అందుకున్నారు. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచంలో ఏ మూల యుద్ధం జరిగినా అమెరికా పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వుంటుందనేది వాస్తవం. ఈ నిజం నేపథ్యంలో అసలు అమెరికా ఏ అధ్యక్షుడైనా ఈ అవార్డుకి అర్హుడేనా అన్నది ఎక్కువమంది విజ్ఞుల అనుమానం. అయితే నోబెల్ ఎంపిక కమిటీ ట్రంప్‌ను బుజ్జగించటానికి అతని అనుంగు అనుచరురాలు, అమెరికా కీలుబొమ్మ అయిన వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ఈ అవార్డు ప్రకటించింది. ఆమె కూడా తమ మైత్రిని ఏ మాత్రం దాచుకోకుండా ఈ అవార్డుని ట్రంప్‌కి అంకితం చేస్తున్నట్లు ప్రకటించింది.



వెనిజులా ప్రజా నాయకుడు చావెజ్‌ని 2002లో అధ్యక్ష పదవి నుంచి తప్పించిన కుట్రలో ఈ మచాడో కీలక భాగస్వామి. కానీ ప్రజల ఆగ్రహ ఉద్యమంతో చావెజ్ విడుదలయ్యాడు. రాజద్రోహం ఆరోపణలపై విచారణ జరిపి మచాడోకి 28 సంవత్సరాల జైలుశిక్షని కోర్టు విధించింది. కాని పెద్దమనసుతో చావెజ్ ఆమెకి క్షమాభిక్ష పెట్టారు. అప్పట్లోనే (2005) ఆనాటి అమెరికా అధ్యక్షులు జార్జి డబ్ల్యూ బుష్ మచాడోని వైట్‌హౌస్‌కి పిలిపించుకుని చర్చలు జరిపాడు. వెనిజులా నాయకుడు చావెజ్ దేశ ప్రయోజనాల కోసం చమురు, ఉక్కు పరిశ్రమల్ని జాతీయం చేయటంతో దేశంలోని పెద్ద వ్యాపారులకి, అమెరికా ఆధిపత్యానికి తీవ్ర విఘాతం కల్గింది. దాంతో వీరంతా చావెజ్‌పై తీవ్రమైన అక్కసుతో ఉన్నారు. అలాంటి ఒక బడా ఉక్కు వ్యాపారి కూతురే ఈ కొరినా మచాడో. తన దేశంలో ప్రభుత్వ ఆస్తుల్ని తగలబెట్టడం, కొందరు ప్రజల సజీవ దహనం లాంటి హింసకు కారకురాలైన ఈ 'శాంతి పురస్కార గ్రహీత' తన దేశంలో ప్రభుత్వాన్ని మార్చటానికి సహకరించాలని ఇజ్రాయెల్, అర్జెంటీనా లాంటి దేశాలకు లేఖలు రాశారు. గాజా మారణకాండ నేపథ్యంలో నెతన్యాహుని సమర్థిస్తూ 'ఇజ్రాయెల్ స్వేచ్ఛకు నిజమైన మిత్రుడని' ఈమె కొనియాడారు. ఈ ఎంపికను వర్తమాన ప్రపంచంలో అనేకమంది ప్రజాస్వామిక ప్రియులు వ్యతిరేకిస్తుండటంలో ఆశ్చర్యం లేదు.

ఈ ఏటి నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయినవారిలో పాలస్తీనా పిల్లలకు, స్త్రీలకు, కాందిశీకులకు మానవతా సాయం చేస్తూ, ఇజ్రాయెల్ అమెరికాల నిర్బంధాన్ని సైతం ఎదుర్కొంటున్న 'ఫ్రొటిల్లా' వంటి సంస్థ కూడా ఉన్నది. అలాంటి ఎంపికలను కాదని– తన దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు పాదాక్రాంతం చేయటానికి వెనుకాడక, మాదక ద్రవ్యాలను అరికట్టే పేరుతో ట్రంప్ చేయాలని చూస్తున్న దురాక్రమణ వ్యూహానికి మద్దతు పలుకుతున్న 'దేశద్రోహి'కి, వెనిజులా తీరంలో యుద్ధ నౌకల్ని మోహరించిన అమెరికాని సమర్థిస్తున్న మచాడోకి శాంతి బహుమతి ఇచ్చారు. నోబెల్ దృష్టిలో శాంతికి హింసకి ఉన్న నిర్వచనాలేమిటో మెజారిటీ ప్రజలకు అర్థం కావటం లేదు. ఇది మన స్వాక్షిలేని నిర్ణయమని దీనిని పునఃపరిశీలించాలని అమెరికా – ఇస్లామిక్ దేశాల మండలి డిమాండ్ చేసింది. మచాడోతో పోల్చితే ప్రజల దృష్టిలో చాలా మెరుగైన వారి పేర్లను కొందరు ప్రస్తావిస్తున్నారు. అసలు నామినేట్ అయిన మొత్తం 244 మంది వ్యక్తులు 94 సంస్థల వివరాలు ప్రకటిస్తే ఈ ఎంపిక ఎంత ఏకపక్షమో ప్రపంచానికి అర్థమవుతుంది.

ట్రంప్ పాకులాడినా ఎంపిక చేయలేదని అన్పించుకున్న ఈ ఎంపిక కమిటీ కనీసం తమ ఎంపికను ప్రకటించే వరకు కూడా లీక్ కాకుండా కాపాడుకోలేకపోయింది. దేనితో అయినా జూదం ఆడగల, జూదాన్ని ప్రోత్సహించగల కార్పొరేట్ శక్తులు తమ బెట్టింగ్ ప్లాట్‌ఫాం పాలీ మార్కెట్‌లో మచాడో ఎంపిక విషయాన్ని లీక్ చేయించి, ఆమెపై బెట్టింగ్‌ను 3.75శాతం నుంచి 73శాతానికి పెంచాయి. ఈ విషయాన్ని సాక్షాత్తూ నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌విలెన్ నార్వే టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆదివారం ప్రకటించారు. నోబెల్ బహుమతుల ఎంపిక పకడ్బందీగా, పారదర్శకంగా ఉంటుందన్న అభిప్రాయంలోని డొల్లతనాన్ని ఈ విషయం ఋజువు చేస్తున్నది. ఇప్పటివరకు మన దేశంలోని అకాడమి ఎంపికల్ని చూసి అవాక్కవుతున్న మనం విశ్వవ్యాప్తంగా ఎంపికలన్నీ ఒకేరకం అని సరిపెట్టుకొని కొంత ఉపశమనం పొందుదాం. సామ్రాజ్యవాదులు తన పంజా దేని మీదకైనా విసరగలరని అర్థం చేసుకుందాం.

● **చెరుకూరి సత్యనారాయణ**

మోదీ సహకారంతో అభివృద్ధిపథంలో...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కర్నూలు ప్రాంతం మరింత అభివృద్ధికి బాటలు వేసుకోబోతోంది. గతంలో విభజనతో మూడు రాజధానులను కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఇప్పుడు కొత్తగా అభివృద్ధి దిశలో పయనిస్తోంది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం గత దశాబ్దంగా చేపట్టిన పథకాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు రాష్ట్రానికి కొత్త రూపు ఇస్తున్నాయి. 1953లో చెన్నైని కోల్పోవడం, 1956లో కర్నూలు– తాత్కాలిక రాజధానిగా ఏర్పడటం, 2014లో తెలంగాణ విభజనతో హైదరాబాద్‌ను కోల్పోయింది. అయినా ఇప్పుడు రాష్ట్రం కొత్త దిశలో పయనిస్తోంది.

కర్నూలు చరిత్రాత్మక నగరం నుంచి ఆధునిక కేంద్రంగా మారింది. నేడు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పరిశ్రమల కేంద్రంగా అవతరిస్తోంది. బెంగళూరు–చెన్నై పరిశ్రమల కారిడార్‌లో భాగంగా ఓర్వకల్ నోడ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. రక్షణ పరిశోధన సంస్థ డీఆర్‌డీవో ఆధ్వర్యంలో డ్రోన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు కాగా, రాబోయే డ్రోన్ ఉత్పత్తి యూనిట్ ఈ ప్రాంతాన్ని దేశ రక్షణ, సాంకేతిక రంగంలో ప్రాధాన్యం కలిగిన కేంద్రంగా నిలబెడుతుంది. ప్రధాని ఈ నెల 16న తన పర్యటనలో డ్రోన్ సహా పలు కీలక ప్రాజెక్టులను సందర్శించనున్నారు. అలాగే, ఆసియాలోనే అతిపెద్ద హైబ్రిడ్ సౌర–గాలి–హైడ్రో విద్యుత్ ప్రాజెక్ట్ కర్నూలులో పనిచేస్తోంది. ఇది రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో ఒక కొత్త మైలురాయిగా నిలిచింది.



విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం తన ముద్ర వేసింది. విద్యా రంగాన్ని అభివృద్ధి సాధనంగా భావిస్తూ, మోదీ ప్రభుత్వం రాష్ట్రంలో పలు జాతీయ స్థాయి విద్యా సంస్థలను స్థాపించింది. వీటిలో ఐఐటీ–తిరుపతి, ఐఐఎం–విశాఖపట్నం, ఎన్ఐటీ–తాడేపల్లిగూడెం, ఐఐఐటీడీఎం–కర్నూలు, ఐఐఎస్ఈఆర్–తిరుపతి, ఎఐఐఎంఎస్–మంగళగిరి వంటి సంస్థలు ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌ను దేశ విద్య, పరిశోధనా మ్యాప్‌లో స్థిరంగా నిలబెట్టాయి. పరిశ్రమలు, రవాణా, కారిడార్లు, పెట్టుబడుల కొత్త గమ్యం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 11 ఆర్థిక కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. హైదరాబాద్–బెంగళూరు, బెంగళూరు–చెన్నై, విశాఖ–చెన్నై... ఈ కారిడార్ల ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, ఎగుమతులు విస్తరిస్తున్నాయి.

కేవలం హైవేలు మాత్రమే కాదు, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రూ.1.2 లక్షల కోట్ల మౌలిక వసతుల ప్రాజెక్టులు అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2014లో 4,193 కి.మీ. ఉన్న నేషనల్ హైవేలు ఇప్పుడు 8,660 కి.మీ.కు పెరిగాయి. ప్రధాన ప్రాజెక్టులను సైతం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్– రూ.5వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్– రూ.12వేల కోట్లు, ఓఎన్‌జీసీ పెట్టుబడులు– రూ.8,110 కోట్లు, బీపీసీఎల్ గ్రీన్ హైడ్రోజన్ హబ్– విశాఖ, అమరావతి అభివృద్ధి ప్రాజెక్ట్– రూ.15,000 కోట్లు.

మోదీ ప్రభుత్వం 'అభివృద్ధి అందరికీ' సూత్రంతో పలు సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తోంది. 'అమృత్' పథకం కింద కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో రూ.130 కోట్లు వ్యయం చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,300 కోట్ల పనులు జరిగాయి. పీఎం ఆవాస్ యోజన (అర్బన్) కింద 20.28 లక్షల ఇళ్లు నిర్మించి, దేశంలో అగ్రస్థానాన్ని సాధించింది. జల్‌జీవన్ మిషన్ కింద 39.77 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆత్మవిశ్వాసం, అవకాశాలు, పెట్టుబడుల రాష్ట్రంగా అవతరించింది. కేంద్ర ప్రభుత్వం అందించిన మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థలు, పరిశ్రమల మద్దతు రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను ఇచ్చాయి. కర్నూలు ప్రాంతం ఇప్పుడు పరిశ్రమల, విద్యా, సాంకేతిక కేంద్రంగా ఎదుగుతోంది. పోలవరం నుంచి విశాఖపట్నం వరకు అభివృద్ధి ఇప్పుడు గణాంకాలకు పరిమితం కాకుండా, ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

– **డా. వినూషరెడ్డి,** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అమ్మో అద్దేపల్లి!



అద్దేపల్లి జనార్దనరావు

విద్యార్థి దశ నుంచి నేరపూరిత ఆలోచనలు



జోగి రమేశ్

చూడడానికి సైలెంట్‌గా కనిపిస్తాడు. ఆలోచనలు మాత్రం చాలా వైలెంట్‌గా ఉంటాయి. ప్రతి ఆలోచనలోనూ నేర పూరిత పోరలు ఉంటాయి. రాజకీయంగా అధికార, ప్రతిపక్ష భేదాలు ఉన్నప్పటికీ ఆయన విషయంలో మాత్రం అంతా స్వపక్షమే. ఆయన చేసే కార్యకలాపాలు ఏమిటో స్పష్టంగా తెలిసినా అన్ని పార్టీల నేతలు కాసులతో కళ్లు మూసుకున్నారు. ఇదీ నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు లీలలు. ఆయన గురించి ఆరా తీసే కొద్దీ కొత్తకొత్త విషయాలు బయటకు వస్తున్నాయి.

- అన్నదమ్ములిద్దరిదీ ఒకే తీరు
- తాతయ్య పేరుతో మద్యం వ్యాపారం
- ఇబ్రహీంపట్నంలో అన్ని పార్టీల నేతలతో సంబంధాలు
- ఏఎన్ఆర్ బార్‌కు స్థలం ఇప్పించిన టీడీపీ నేత
- ఆ ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు
- కేసుల నుంచి తప్పించుకునేందుకు రాజకీయ భాగస్వామ్యం
- జనార్దనరావుతో మద్యం వ్యాపారం చేసిన జోగి సోదరుడు



మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నంలోని అద్దేపల్లి జనార్దనరావు నివాసంలోకి వెళ్తున్న సిట్ అధికారులు

ఆంధ్రజ్యోతి-విజయవాడ: అదేపల్లి జనార్దనరావు మంచి విలాస పురుషుడు. ఆయనను చూసి తన సోదరుడు జగన్మోహనరావు అదే బాటలో పయనించాడు. ఇద్దరూ కలిసి ఒకే మార్గంలో వెళ్తున్నారు. జనార్దనరావు తండ్రి కిరాణా వ్యాపారం చేసి కూడగట్టిన ఆస్తులను విలాసాల కోసం అన్నదమ్ములు ఇద్దరూ హారతికర్పూరంలా కరిగించేశారు. ఇలా ఒక్కో ప్రాంతంలో ఉన్న ఆస్తులు, భూములను విక్రయించేయడంతో చిన్నాన్నలతో ఉమ్మడిగా ఉన్న ఆస్తులను మిగతా 6లో..

జనార్దనరావు ఇంట్లో సిట్ అధికారుల సోదాలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కల్తీ మద్యం కేసులో ఏ 1 ముద్దాయి అయిన జనార్దనరావుకు చెందిన ఇబ్రహీంపట్నంలోని ఇంట్లో మంగళవారం రాత్రి సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన ఇంట్లో ఉన్న పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను విచారించారు. ఇంట్లో లభించిన ల్యాబ్ టాప్ పాస్ వార్డు తదితర వివరాలు గురించి పోలీసులు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తుల వివరాలపై విచారణ చేశారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి.



రిటైల్ వ్యాపారుల దందా!

ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా మార్కెట్లో తగ్గని ధరలు

- సామాన్యులకు అందని పన్ను తగ్గింపు ప్రయోజనాలు
- మభ్య పెడుతూ పాత ధరలకే వస్తువుల అమ్మకాలు
- ఎంఆర్‌పీ కంటే అధికంగా కూడా విక్రయాలు
- పట్టించుకోని తూనికలు, కొలతలశాఖ అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న ప్రజలు

రిటైల్ మార్కెట్లో వ్యాపారుల వ్యవహారశైలి చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా ఇక్కడ మాత్రం ధరలు తగ్గడంలేదు. జీఎస్టీ ప్రయోజనాలను వ్యాపారులు పొందుతూ, సామాన్యులకు మాత్రం దూరం చేస్తున్నారు. కొందరు పాత ధరలకే వస్తువుల విక్రయాలు చేస్తుంటే, మరికొందరు ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన తూనికలు, కొలతలశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నగరంలో హోల్‌సేల్ మార్కెట్ ఒక్క గొల్లపూడి హోల్‌సేల్ కాంప్లెక్స్‌లోనే నడుస్తోంది. సూపర్ మార్కెట్స్ తప్పితే మిగతాదంతా రిటైల్ మార్కెట్. అతి పెద్ద రిటైల్ మార్కెట్‌లో కొనుగోలు చేసే ప్రజలు తీవ్రంగా మిగతా 6లో..

ఉపాధ్యాయులపై సైబర్ నేరగాళ్ల కన్ను

ఫోన్ చేసి బెదిరింపులు

- లక్షల రూపాయల డిమాండ్
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రూట్ మార్చారు. మొన్నటి వరకు రాజకీయ నాయకులు, వ్యాపారస్థులను టార్గెట్ చేసిన వీరి కన్ను ప్రస్తుతం ఉపాధ్యాయులపై పడింది. వేర్వేరు నెంబరుల నుంచి ఫోన్ చేస్తూ మీ కుమారులు అమెరికాలో, యూకేలో ఉన్నారంటూ, అక్కడ డ్రగ్స్ కేసులో పట్టుపడ్డారని, వారిని అరెస్టు చేయటానికి రంగం సిద్ధం చేశామంటూ బెదిరించి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ, మీ వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి.. మీరు మాకు డబ్బులు పంపించకపోతే అన్ని వాట్సాప్ గ్రూపుల్లో మీ వివరాలు అప్‌లోడ్ చేస్తామంటూ బెదిరిస్తున్నారు.

- గత నెలలో వన్‌టౌన్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయురాలికి సైబర్ నేరగాళ్లు వేర్వేరు ఫోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. నీ పేరు పలానా అని అడిగి, మేము మినిస్ట్రి ఆఫ్ టెలీకమ్యూనికేషన్ నుంచి మిగతా 6లో..

- ఇటీవల వన్‌టౌన్‌లోని ఓ స్కూల్లో రిటైర్ అయిన ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి మీ కుమారుడు అమెరికాలో చదువుతున్నాడు.. అతను డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు.. రూ.10 లక్షలు పంపిస్తే కేసు మాఫీ చేస్తామని చెప్పటంతో ఉపాధ్యాయుడు, అతని భార్య ఆందోళన చెందారు. రూ.10 లక్షలు చెల్లించటానికి ముందుకు వచ్చాడు. ఈ క్రమంలో ఈ విషయాన్ని స్నేహితుడికి చెప్పగా ఆయన సూచనల మేరకు సైబర్ పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది.

- పూర్ణానందంపేటలోని ఓ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి ఓ మహిళ ఫోన్ చేసి పరిచయం పెంచుకుంది. మంచిగా మాట్లాడుతూ తన అశ్లీల చిత్రాలను పంపింది. వాటిని చూసిన ఉపాధ్యాయుడు ఆమెతో సన్నిహితంగా ఉండేందుకు ఎక్కువ సమయం మాట్లాడాడు. ఆ తర్వాత ఓ రోజు ఆ మహిళ రూ.30 లక్షలు డిమాండ్ చేసింది. డబ్బులు ఇవ్వకపోతే అతనిపై కేసు పెట్టి అరెస్టు చేయిస్తానని బెదిరించటంతో భయపడి ఎవరికీ చెప్పుకోలేక ఆందోళనకు గురయ్యాడు.

గూడుపుఠాణి!

కార్పొరేషన్‌లో లీడ్ మేస్త్రీల వ్యవహారంపై విమర్శలు

కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగంలో లీడ్ మేస్త్రీల పేరిట గూడుపుఠాణి నడుస్తోంది. ఇన్‌స్పెక్టర్లు కొందరు లీడ్ మేస్త్రీల పోస్టులను సృష్టించటం వెనుక స్వప్రయోజనాలు దాగున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌లో లీడ్ మేస్త్రీలు ఉన్నారని సమాచార హక్కు దరఖాస్తుకు సమాధానాలు పంపిన అధికారులు, ఏడాది తిరక్కుండానే మరో దరఖాస్తుకు అసలు లీడ్ మేస్త్రీలే లేరంటూ సమాధానమిచ్చి ఆశ్చర్యపరిచారు. లీడ్ మేస్త్రీలే లేనపుడు నగరంలో 225 మందికిపైగా పనిచేస్తున్నారు. కమిషనర్ ఆదేశాలు లేకుండా అక్రమ వసూలు కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీరిని నియమించుకున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



- ఏడాది కిందట సమాచార హక్కు దరఖాస్తులో లీడ్ వర్కర్ల జాబితా ఇచ్చిన ప్రజారోగ్యశాఖ
- తాజాగా మరో సమాచార హక్కు దరఖాస్తుకు అసలు లీడ్ మేస్త్రీలే లేరని సమాధానం
- పరస్పర విరుద్ధ సమాధానాలపై అనేక అనుమానాలు
- ఇప్పటికీ కొనసాగుతున్న లీడ్ మేస్త్రీలు..
- వసూళ్ల కోసమే వీరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నియమించారని విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగంలో అనధికారిక మేస్త్రీలు రాజ్యమేలుతున్నారు. అధికారికంగా లీడ్ మేస్త్రీలు అనేవారు ఎక్కడా లేరన్న విషయాన్ని తాజాగా సమాచార హక్కు చట్టం ద్వారా కార్పొరేషన్ అధికారులు స్పష్టం చేశారు. 2024, జూలైలో సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన దరఖాస్తుకు నగరంలో లీడ్ మేస్త్రీలు ఉన్నారని ప్రజారోగ్య శాఖ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన లీడ్ వర్కర్ల జాబితాను కూడా సమాచార హక్కు దరఖాస్తుదారునికి అందించారు. సరిగ్గా ఏడాది తర్వాత ఇప్పుడు లీడ్‌మేస్త్రీలకు సంబంధించి వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు అస్సలు కార్పొరేషన్‌లో లీడ్ మేస్త్రీలు ఎవరూ లేరని అధికారులు సమాధానం ఇచ్చారు. ఒక అర్ధ సంవత్సర కాలంగా లీడ్ వర్కర్లకు సంబంధించి వివాదం నలుగుతున్న నేపథ్యంలో, కార్పొరేషన్ అధికారులు ఈ మేరకు అసలు లీడ్ వర్కర్లే లేరని సమాధానం ఇచ్చారు. లీడ్ వర్కర్లు లేకపోతే లీడ్ మేస్త్రీలుగా పనిచేసేవారంతా ఎవరన్నది సందేహంగా ఉంది. ప్రభుత్వ స్థాయిలో అనుమతులు తెచ్చుకోకుండా.. మునిసిపల్ కమిషనర్ ఆర్డర్ లేకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ విధంగా లీడ్ మేస్త్రీలను నియమించుకుంటారన్నది నిగ్గుతేలాల్సిన విషయం.

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 80 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం 40 మందే ఉండాలి. ఇది వేరే వివాదం. ప్రతి 40 వేల మందికి ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. ప్రతి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కింద ముగ్గురు శానిటరీ మేస్త్రీలు మిగతా 6లో..

ఇన్నర్ ఫ్లై ఓవర్లపై డేంజర్ బెల్స్!

ఇన్నర్ రింగ్ రోడ్డు ఫ్లై ఓవర్లు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఇటీవల భారీ రంధ్రంతో కలవరపెట్టిన ఓ ఫ్లై ఓవర్ల నాణ్యతాప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ ఫ్లై ఓవర్ నిర్మాణ దశలోనే గడ్డర్ కూలటంతో మూడేళ్ల పాటు పనులు ఆగిపోయాయి. మళ్లీ ఇటీవల పరిణామాలు వాహన చోదకులకు ఆందోళన కలిగిస్తున్నాయి.

శిథిలమైన వంతెనలు.. పదిలంగా వెళ్లినా తప్పని ప్రమాదాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రామవరప్పాడు నుంచి నిర్మాణం చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. దశాబ్దకాలంలోనే వంతెనల ఇనుప చువ్వలు బయటపడి నిర్మాణంలోని నాణ్యత లోపాన్ని రుజువు చేస్తున్నాయి. భారీ గుంతలతో అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణికులు ఓ సాహసోపేతమైన ప్రయాణాన్ని సాగిస్తున్నారు. నెమ్మదిగా, సక్రమంగా వాహనాన్ని నడిపే వారు సైతం అకస్మాత్తుగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్న.., క్షతగాత్రులవుతున్న ఘటనలు ఈ రోడ్డుపై కోకొల్లలు.



ఫ్లై ఓవర్‌పై ఏర్పడిన గుంతలు.. కనిపిస్తున్న చువ్వలు

- నిర్మాణ దశలోనే బయటపడ్డ నాణ్యతా లోపాలు
- వినియోగంలోకి వచ్చిన కొద్దినెలలకే గుంతలు
- బయటపడుతున్న ఇనుపచువ్వలు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- ఇటీవల భారీ రంధ్రంతో.. ఫ్లై ఓవర్ల పటిష్టతపై అనుమానాలు

నిర్మాణ సమయంలోనే వెలుగుచూసిన నాణ్యతా లోపం

ఈ రోడ్డులో ఏలూరు కాల్వ, బుడమేరు వాగు, రైల్వే ట్రాప్‌పై ఉండే రెండు ఫ్లై ఓవర్‌లు అత్యంత కీలకమైనవి. సుదీర్ఘమైన పొడవుతో ఉండే ఈ ఫ్లై ఓవర్‌లు నేడు అధ్వానంగా కనిపిస్తున్నాయి. నిర్మాణ దశలోనే వీటి నాణ్యతా లోపం వెలుగు చూసింది. అప్పట్లోనే ఓ వంతెన నిర్మాణ సమయంలో గడ్డర్ కూలిన ఘటనలు వెలుగు చూశాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో మిగతా 6లో..

నగరంలో ట్రాఫిక్ తగ్గించేందుకే ఇన్నర్ రింగ్ రోడ్డు

ఒడిశా, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనాలు 15 ఏళ్ల క్రితం వరకు నగరంలోని బెంజిసర్కిల్, పీఎన్‌బీఎస్ ద్వారా ప్రయాణించేవి. ఈ వాహనాల కారణంగా నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను తగ్గించేందుకు రామవరప్పాడు ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటైంది. పదేళ్ల క్రితం రాష్ట్ర విభజనకు ముందే ఈ నాలుగు వరసల రోడ్డు అందుబాటులోకి వచ్చింది. రామవరప్పాడు రింగ్ నుంచి పాయకాపురం, కండ్రిక, మీదుగా నగర శివారులోని గొల్లపూడి వరకు ఈ రోడ్డు విస్తరించి ఉంటుంది. విశాఖపట్నం-హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనాలు నగరంలోకి ప్రవేశించే అవకాశం లేకుండా దీనికి నిర్మాణం జరిగింది. మిగతా 6లో..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆశీస్సులు అందజేస్తున్న దుర్గగుడి వేద పండితులు, అర్చకులు



డిప్యూటీ సీఎంకు దుర్గమ్మ ఆశీస్సులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దుర్గగుడి వేదపండితులు మంగళవారం ఆశీస్సులు అందజేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ డాక్టర్ హరి జవహర్‌లాల్, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో దుర్గగుడి ఈవో శీనానాయక్, వేద పండితులు మంగళవారం సెక్రటేరియట్‌కు వెళ్లి పవన్‌కు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం దుర్గమ్మ చిత్రపటం, లడ్డూ ప్రసాదం ఇచ్చారు. దసరా ఉత్సవాలు విజయవంతం కావటం గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు.


8లో
ఆరోగ్యం మన చేతుల్లోనే..!
- నేడు అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డే

6లో
హెలికాప్టర్ పైనుంచి పెట్రోల్ పోసి చంపేయండి
- ఎన్టీటీపీఎస్ సీఈపై మండిపడిన ఉద్యమకారులు

అబ్బురపరిచే కళాకృతులు..

కార్లు, వాహనాలు ఇళ్లపైన ఉన్నాయేంటి అనుకుంటున్నారా.. ఇవి మన భవన నిర్మాణ కార్మికుల కళా నైపుణ్యానికి ప్రతీకలు. ఇంటిపైన నీటి ట్యాంకు సర్వ సాధారణం. అయితే టెక్నాలజీ శాసిస్తున్న ఈ రోజుల్లో భవన నిర్మాణ కార్మికులు తమ మేథస్సుతో వినూత్న రూపాలతో భవన నిర్మాణాలు చేపట్టడం విశేషం. విజయవాడ నగరంలో పలు చోట్ల ఇళ్లపైన నీటి ట్యాంకులను ఈ విధంగా మలిచారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)















జీఎస్టీ లబ్ధి ప్రతులను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, కొనకళ్ల నారాయణ, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

జీఎస్టీ సంస్కరణలతో ఊపందుకోనున్న నిర్మాణ రంగం

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి

అవనిగడ్డ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 సంస్కరణలతో నిర్మాణ రంగం ఊపందుకోనుందని, తగ్గిన శ్లాబుల ద్వారా 1000 చదరపు అడుగుల ఇంటి నిర్మాణంలో రూ.1.35 లక్షల మేర ఖర్చు తగ్గుతుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం అవనిగడ్డ రెవెన్యూ సమావేశ మందిరంలో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్, జేసీ నవీన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ రంగం పూర్తిగా కుదేలయిందన్నారు. నేడు జీఎస్టీ 2.0తో నిర్మాణ వ్యయం తగ్గి నిర్మాణాలు ఊపందుకోనున్నాయని తెలిపారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వపరంగా నిర్మాణాలు పెరగటంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగై నిర్మాణ రంగం ఊపందుకుందని తెలిపారు. జేసీ నవీన్ మాట్లాడుతూ, జీఎస్టీ శ్లాబులను సరళతరం చేయటంతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌ను నియోజకవర్గ భవన నిర్మాణ కార్మికులు కలిసి తమ సమస్యలను వివరించారు.



సంఘటన స్థలం వద్ద ఎమ్మెల్యే కొలికపూడి

రైతులపై రౌడీషీట్లా?

» వైసీపీ, టీడీపీ దాడి ఘటనపై ఎమ్మెల్యే ఆరా..

» టీడీపీ కార్యకర్తను పరామర్శించిన కొలికపూడి

సొబ్బాల (గంపలగూడెం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేసుకునే రైతులపై రౌడీషీట్లు తెరవడం ఏంటని, ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావును ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రశ్నించారు. మంగళవారం సొబ్బాల గ్రామంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య కొట్లాటకు దారితీసిన ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. 2024 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా, వైసీపీ-టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన కొట్లాటలో ఎన్నికల నియమావళిని అనుసరించి కేసులు నమోదు చేయాల్సి వచ్చిందని ఎస్ఐ వివరించారు. రౌడీషీట్ల వల్ల అమెరికాలోని తమ పిల్లల వద్దకు వెళ్లలేకపోతున్నామని, టీడీపీ నేతలు యడ్లపల్లి శ్రీనివాసరావు, కొమ్మినేని బాబు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. టీడీపీ కార్యకర్త ఇంటిపై వైసీపీ కార్యకర్తల దాడి ఘటనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రభుత్వ స్థలంలో వైసీపీ తోరణాలను పార్టీ కార్యకర్తలు కట్టారని, వాటిని తొలగించాలని కోరితే, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని సర్పంచ్ ఉన్నం కృష్ణారావు ఎమ్మెల్యేకు వివరించారు. టీడీపీ కార్యకర్తలపై కేసులు ఎత్తివేయాలని ఎమ్మెల్యేను సర్పంచ్ కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా దళితులకు తన సొంతనిధులు రూ.10 లక్షలతో కమ్యూనిటీ షెడ్డు నిర్మిస్తానని ఎమ్మెల్యే గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ మూకదాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త కొంగల బాబురావును పరామర్శించారు. కార్యక్రమంలో వై.చంద్రం, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కావూరి శ్రీనివాసరావు, గొల్లమందల రామకృష్ణ, చింతల లక్ష్మి, కోట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన మైనర్

» భవనంపై నుంచి దూకి పారిపోయేందుకు యత్నం

» తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

» పట్టుకునేందుకు ప్రయత్నించిన ఎస్ఐకి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : గంజాయితో పోలీసులకు పట్టుబడిన మైనర్ బాలుడు పారిపోయే క్రమంలో భవనం పైనుంచి దూకేశాడు. ఘటనలో బాలుడితో పాటుగా ఎస్ఐ కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ పోలీస్ సిబ్బంది, స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మంగళవారం వాంబేకాలనీ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని ఏబ్లాకు ప్రాంతానికి చెందిన మైనర్(18)వద్ద గంజాయి ఉన్నట్టు నున్న రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సోమవారం రాత్రి అతడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు 4 కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు కూడా తనతోపాటు గంజాయి తీసుకువచ్చాడని బాలుడి ద్వారా తెలుసుకున్న ఎస్ఐ పండూదొర్రై విచారణ నిమిత్తం సిబ్బందితో కలిసి బాలుడిని ఏ బ్లాకుకు తీసుకువెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం ఏ బ్లాకులో విచారిస్తుండగా బాలుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మూడో అంతస్తు నుంచి దూకేశాడు. అయితే బాలుడి కాలు విరగడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. బాలుడిని పట్టుకునే క్రమంలో ఎస్ఐ పండూదొర్రై తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని పట్టుకునేందుకు పరిగెత్తి కిందపడి సమీపంలోని గోడకు బలంగా తగలడంతో మోకాలుకు గాయమైంది. ఇరువురినీ పోలీసు సిబ్బంది, స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గంజాయి కలిగి ఉన్న బాలుడిపై గతంలో పలుకేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దొంగతనాలు, మోటారు సైకిళ్ల చోరీ, గంజాయి కలిపి 8 కేసులు వరకు ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల బాలుడు మరో యువకుడితో కలిసి ఎనికేపాడులో పల్సర్ బైక్‌ను దొంగిలించాడని, బైక్ అమ్మగా వచ్చిన డబ్బుతో రాజమండ్రి సమీపంలో గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయించేందుకు ప్రయత్నించారని సమాచారం అందడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. బాలుడిని పోలీసులు తీవ్ర భయానికి గురిచేశారని, ఆ కారణంగానే భవనంపైనుంచి దూకేశాడని, ఘటనకు పోలీసులే బాధ్యత వహించాలని బాలుడి బంధువులు ఆందోళనకు దిగారు.

హెలికాప్టర్ పైనుంచి పెట్రోల్ పోసి చంపేయండి

» ఎన్టీటీపీఎస్ సీఈపై మండిపడిన ఉద్యమకారులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'ఏడు గ్రామాల్లోని 1.5 లక్షల మంది జనం ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో అల్లాడుతున్నాం. ప్లాంట్‌కు భూములిచ్చిన స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకున్నా, ఉచిత ఆసుపత్రి నిర్మించకున్నా, మెడికల్ క్యాంప్‌లు పెట్టకున్నా, స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వకున్నా.. కేవలం ఉచిత బూడిద లోడింగ్‌పై ఆధారపడి వెయ్యి కుటుంబాలు జీవిస్తున్నాం. ఇప్పుడది కూడా తీసేశారు. మా పొట్టకొట్టొద్దని 50 రోజుల నుంచి నిరసన చేస్తున్నా ఎందుకు పట్టించుకోరు. ఇప్పటికే 10 మంది కుటుంబాలను పోషించుకోలేక ఉరేసుకుని చనిపోయినా స్పందించరా, ఏడు గ్రామాల ప్రజలపై పెట్రోల్ పోసి తగలబెట్టండి. మీరే బాగుపడండి..' అని వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఎన్టీటీపీఎస్ అధికారుల ఎదుట ఆవేదన వెళ్లగక్కాడు. ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ పి.శివరామాంజనేయులు మంగళవారం ఉచిత బూడిద లోడింగ్ దీక్షా శిబిరం వద్ద పీడిత గ్రామాల ప్రజలు, స్థానిక ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశమయ్యారు.

ఈనెల 6న ఎన్టీటీపీఎస్ గేటు ముట్టడి సందర్భంగా దీక్షాధారుల నుంచి, పీడిత గ్రామాల ప్రజల నుంచి ఆయన స్వీకరించిన అర్జీలకు అనుకూల సమాధానాలు వస్తాయని 8 రోజుల పాటు ఎదురుచూసిన వారికి చీఫ్ ఇంజనీర్ సమాధానం షాక్‌కు గురిచేసింది. స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకు బూడిద ఇచ్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, బూడిద కాంట్రాక్టును మాత్రం రద్దు చేసేందుకు జెన్కో యాజమాన్యం అంగీకారం చెప్పలేదన్నారు.

గేటు ముట్టడి రోజున స్వీకరించిన ఏ అర్జీల గురించి సీఈ ప్రస్తావించలేదు. దీంతో ఉద్యమకారులు, అక్కడకు చేరుకున్న ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సీఈపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో ఆయన వారికి ఏం సమాధానం చెప్పకుండా భారీ పోలీస్ బందోబస్తు సాయంతో వెళ్లిపోయారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌పోర్టర్లు మాట్లాడుతూ జెన్కో యాజమాన్యం దిగొచ్చే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య పీడిత గ్రామాల ప్రజలు, స్థానిక ట్రాన్స్‌పోర్టర్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రిటైల్ వ్యాపారుల దందా!

(5వ పేజీ తరువాయి)

నష్టపోతున్నారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో జీఎస్టీ తగ్గింపులు విజయవంతంగా అమలు జరుగుతున్నాయి. కానీ నిత్యావసరాలకు సంబంధించి మాత్రం రిటైల్ మార్కెట్‌లో అమలు కావటం లేదు. రిటైల్ మార్కెట్‌లో జీఎస్టీ మినహాయింపులు ప్రజలకు అందటం లేదన్న ఫిర్యాదులు వస్తున్నా తూనికలు, కొలతల శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు.

ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా విక్రయించే అధికారం ఉందా?

రిటైల్ వ్యాపారులైనా ఎంఆర్‌పీ కంటే అదనంగా విక్రయించటానికి లేదు. కానీ రిటైల్ వ్యాపారులు లాభం కోసం అధికంగా వసూలు చేస్తున్నారు. జీఎస్టీ ప్రయోజనాలనూ దిగమింగేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి వచ్చి పక్షం రోజుల దాటినా ఇంకా పాత ఎంఆర్‌పీలతోనే విక్రయించటం చూస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుంది.

జీఎస్టీ తగ్గింపులతో రిటైల్ వ్యాపారులకు ప్రయోజనం ఇలా

250 ఎంఎల్ కూల్‌డ్రింక్ గతంలో రూ.20 ఉండేది. జీఎస్టీ ప్రయోజనాల వల్ల రూ.2 తగ్గుతుంది. ఎంఆర్‌పీ రూ.18 అని ఉన్నా రిటైల్ వ్యాపారులు రూ. 20కు విక్రయిస్తున్నారు. గతంలో ఇదే బాటిల్ హోల్‌సేలర్ల నుంచి రూ.16కే రిటైలర్లకు వచ్చేది. ఎంఆర్‌పీ ధర రూ.20 ఉండేది. రిటైల్ వ్యాపారులు రూ. 4 ప్రయోజనం పొందేవారు. ఇప్పుడు ఎంఆర్‌పీ ధర రూ.18కి తగ్గింది. అయినప్పటికీ కూడా రూ.20కే విక్రయిస్తున్నారు. రిటైల్ వ్యాపారి రూ.6 లాభం పొందుతుండగా.. సామాన్య ప్రజలకు ప్రయోజనం దక్కటం లేదు. అలాగే లీటరు వాటర్ బాటిల్ ధర రూ.13.33కు తగ్గింది. కానీ ప్రస్తుతం రూ.20కు విక్రయిస్తున్నారు. ఒక్క లీటర్ వాటర్ బాటిల్‌పైనే రూ.6.67 అదనంగా వసూలు చేస్తున్నారు. రిటైల్ వ్యాపారికి రూ.181.39 లాభం వస్తోంది. గతంలో కేసు లీటర్ వాటర్ బాటిల్స్ రూ.240కు విక్రయించేవారు. వారికి అప్పట్లో రూ.100 లాభం వచ్చేది. జీఎస్టీ ప్రయోజనాలను దిగమింగటం వల్ల ప్రస్తుతం రూ.181.39 అదనపు ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ ప్రయోజనాలేవీ కూడా సామాన్య ప్రజలకు అందటం లేదు. జీఎస్టీ తగ్గింపులకు సంబంధించి చూస్తే స్నాక్ ఫుడ్ వంటి వాటికి కూడా ఇంకా పాత ఎంఆర్‌పీలు వస్తున్నాయి. కొన్నింటికి తగ్గించి వచ్చినా రిటైల్ వ్యాపారులు పాత ధరలకే విక్రయిస్తున్నారు. సబ్బులు, పేస్టులు, కాస్మోటిక్స్ వంటి వాటి విషయంలో కూడా రిటైల్ వ్యాపారులు ఏమాత్రం తగ్గించని పరిస్థితులు నెలకొన్నాయి.

నిద్ర నటిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటే.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో తూనికల కొలతల శాఖ అధికారులు నిద్రనటిస్తున్నారు. కనీస తనిఖీలు కూడా చేయటం లేదు. విజయవాడలో అతి పెద్ద మార్కెట్ ఉంది. జీఎస్టీ తగ్గింపులు అనే అంశం మాది కాదన్న రీతిన అధికారులు వ్యవహరిస్తున్నారు. జీఎస్టీ విజిలెన్స్ అధికారులకు ఎంత బాధ్యత ఉందో అంతకంటే ఎక్కువ బాధ్యత తూనికలు, కొలతల శాఖ అధికారుల మీద ఉంది. జీఎస్టీ తగ్గింపుల వల్ల నిర్దేశించిన ఎంఆర్‌పీ ధరలను కూడా కాదని అధికంగా విక్రయిస్తున్నపుడు చర్యలు తీసుకోవాల్సింది తూనికలు, కొలతల శాఖ అధికారులే. వ్యాపార సంస్థల నుంచి ఆయాచిత ప్రయోజనాలు పొందుతున్నారన్న తీవ్ర విమర్శలు ఇప్పటికే తూనికలు, కొలతలశాఖ అధికారులపై ఉన్నాయి. ఆరోపణలకు తగ్గట్టుగానే ఆ శాఖ అధికారుల తీరు ఉంటోంది.



సమావేశంలో మాట్లాడుతున్న రాధమ్మ

సంఘాన్ని చీల్చే కుట్రలను అడ్డుకుంటాం..

» ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలు రాధమ్మ

గాంధీనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తున్న తమ సంఘాన్ని చీల్చేందుకు జరుగుతున్న కుట్రలను అడ్డుకుంటామని ఏపీ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గతేడాది చట్టబద్ధంగా జరిగిన ఎన్నికల ద్వారా ఏర్పాటైన తమ విజ్ఞప్తిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమస్యలను అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో స్టాఫ్‌నర్సుల ఇబ్బందులు పరిష్కరించాలన్నారు. మారుమూల గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే నర్సులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రధానకార్యదర్శి ఎస్.కోటమ్మ మాట్లాడుతూ, కర్నూలుకు చెందిన డి.మంజులాదేవీకి తమ సంఘంతో సంబంధం లేదన్నారు. కొంతమంది ఉద్యోగులతో తమ సంఘాన్ని చీల్చే కుట్రలను సహించేదిలేదన్నారు. ఉపాధ్యక్షురాలు పి.లత, వీపీ చంద్రసాయి, జి.శాంతిభవానీ, కొత్తపల్లి మంజేష్, పి.శాంతకుమారి, సంయుక్త కార్యదర్శులు ఎం.దయావతమ్మ, వై.పద్మజ, డి.వరలక్ష్మి, జె.జ్యోతి, 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఇన్నర్ ఫ్లై ఓవర్లపై డేంజర్ బెల్స్!

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం వాటి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఫ్లై ఓవర్ శ్లాబులపై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. చాలా ప్రదేశాల్లో గుంతలు ఏర్పడ్డాయి. బయట పడి వలయంగా మారిన ఇనుప చువ్వల కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాల చక్రాలకు పంచర్లు పడుతున్నాయి. ఏ సమయంలో కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉన్న ఫ్లై ఓవర్‌లు ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

వేల వాహనాలు రాకపోకలు

నిత్యం కొన్ని వేల వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఫ్లై ఓవర్‌లతో పాటు రోడ్డు నిర్మాణంలోనూ నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా ముస్తాబాద అడ్డ రోడ్డు నుంచి పాయకాపురం జంక్షన్ వరకు రోడ్డు భారీ గుంతలతో కనిపిస్తుంది. రోడ్డుకు కుడి వైపున ఉండే కాల్వ వద్ద కోతకు గురైంది. గుణదల-నున్న క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పడిన భారీ గొయ్యి వాహనాల రాకపోకలను తీవ్ర ప్రభావితం చేస్తోంది. ఈ ప్రదేశంలోనే అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, కేవలం బోర్డును మాత్రమే ఏర్పాటు చేసి జాగ్రత్త పడే అంశాన్ని వాహన చోదకులకే అధికారులు వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై సూచిక బోర్డులు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. ఎంత జాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదాలు తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై సైబర్ నేరగాళ్ల కన్ను

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతున్నాం, నీ ఆధార్ నెంబరు పలానా నెంబరుకు ఎందుకు లింక్ అయ్యింది అని ప్రశ్నించారు. ఆమె తనకు తెలియదని చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఆమెను దబాయించి నీ వివరాలు మొత్తం మాకు తెలుసంటూ బెదిరించారు. ఆ ఉపాధ్యాయురాలి ఫోన్ నెంబర్‌కు అశ్లీల చిత్రాలను పంపించి బెదిరించటంతో ఆమె ఆందోళనకు గురైనట్లు తెలిసింది. ఇంకో వ్యక్తి మరోసారి ఫోన్ చేసి తాను ఎస్ఐనని చెబుతూ, మీ భార్యభర్తలపై కేసులు ఉన్నాయంటూ బ్యాంక్ వివరాలు అడిగాడు. ఆమె ఆ వివరాలు ఇచ్చిన తర్వాత ఆ అకౌంట్ చూసుకున్న సైబర్ నేరగాళ్లు నీ దగ్గర డబ్బులు లేవా అని గట్టిగా ప్రశ్నించటంతో ఇటీవలే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్టు ఆమె తెలిపింది. ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను క్యాన్సిల్ చేసుకుని బ్యాంక్ అకౌంట్‌లో ఆ డబ్బులు వేసుకోవాలని చెప్పగా, భార్యాభర్తలు బ్యాంక్‌కు వెళ్లి, ఫిక్స్‌డ్ డిపాజిట్టును క్యాన్సిల్ చేసుకుని తమ బ్యాంక్ అకౌంట్‌లో వేసుకోవటానికి ప్రయత్నించారు. బ్యాంక్ మేనేజర్ వారి ఆందోళన గమనించి వివరాలు అడగ్గా, జరిగిన విషయాన్ని మేనేజర్‌కు వివరించారు. దీంతో ఆయన వారికి ధైర్యం చెప్పి సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు పంపించారు. నగరానికి చెందిన ఉపాధ్యాయుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి నీవు నీ భార్యను వేరే వారికి రూ.30 లక్షలకు అమ్మావు.. ఆ వివరాలు మా దగ్గర ఉన్నాయి.. రూ.20లక్షలు పంపించమంటూ బెదిరించారు.

అమ్మో అద్దేపల్లి!

(5వ పేజీ తరువాయి)

అమ్మడానికి వారు అడ్డుకట్ట వేశారు. కొంతకాలంగా అన్నదమ్ములిద్దరూ తమ ఆస్తిని పంచాలని చిన్నాన్నలపై ఒత్తిడి చేస్తున్నారు. జనార్దనరావు, జగన్మోహనరావు ప్రవర్తన గురించి తెలిసిన చిన్నాన్నలు ఆస్తిని పంచడానికి అంగీకరించలేదు. ఇంజనీరింగ్ విద్యాభ్యాసం నుంచే జనార్దనరావు ఆలోచనలు నేర పూరితంగా ఉండేవని చిన్ననాటి స్నేహితులు చెబుతున్నారు. సమాజంలో ప్రముఖులుగా ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆ స్థాయికి వెళ్లాలని భావించేవాడు. నిజాయితీగా వ్యాపారాలు చేసి ఆ స్థాయికి వెళ్లలేమని జనార్దనరావు గమనించాడు. అడ్డదారులు తొక్కితేనే ఉన్నత స్థితికి చేరుకుంటామనుకున్నాడు. ఇంజనీరింగ్ నుంచి జనార్దనరావుకు విలాసవంతంగా గడపం అలవాటుగా మారింది. విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేయడం ఆయనకు చాలా ఇష్టం. జనార్దనరావు తరచూ ఆఫ్రికా దేశాలకు వెళ్తుండేవాడని స్థానికులు చెబుతున్నారు. అక్కడ తనకు నచ్చినట్టుగా ఎంజాయ్ చేసేవాడు.

తాతయ్య జ్ఞాపకార్థం

అద్దేపల్లి జనార్దనరావు తన తాతయ్య పేరు మీద మద్యం వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. తాతయ్య అద్దేపల్లి నాగేశ్వరరావు (ఏఎన్‌ఆర్) పేరుతో బార్‌ను ఏర్పాటు చేశాడు. మద్యం వ్యాపారంలోకి దిగినప్పటి నుంచి ఈ పేరుతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. తొలుత జాతీయ రహదారి పక్కన ఈ బార్‌ను నెలకొల్పాడు. ఈ బార్‌ను జాతీయ రహదారికి పక్కన ఏర్పాటు చేయడానికి టీడీపీకి చెందిన ఓ నాయకుడు సహకరించినట్టు స్థానికులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బార్‌ను ఇక్కడి నుంచి తొలగించినా స్థలాన్ని మాత్రం జనార్దనరావు ఉపయోగించుకుంటున్నాడు. ఈ స్థలానికి సమీపంలో టీడీపీ నేత ఇల్లు ఉందని సమాచారం. ఈ స్థలంలోనే జనార్దనరావు నకిలీ మద్యం తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. జనార్దనరావు చేసే నకిలీ వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేసుకోవడానికి రాజకీయ సంబంధాలను కొనసాగించాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో అంటకాగేవాడు. ఇందులో భాగంగానే 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇబ్రహీంపట్నంలోని ఆ పార్టీ నేతలకు దగ్గరగా ఉండేవాడు. 2019 నుంచి 2023 వరకు వైసీపీ నేతలకు దగ్గరగా ఉన్నాడు. అద్దేపల్లి జనార్దనరావు బార్ ముసుగులో ఏ వ్యాపారం చేస్తున్నాడన్న విషయం ఇబ్రహీంపట్నంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలకు బాగా తెలుసు. ఏ నాయకుడు ఆరోపణ, విమర్శ చేయడానికి వీలు లేకుండా ఆ నేతలకు చేయాల్సిన ఏర్పాట్లు చేసేవాడు. ఏఎన్‌ఆర్ బార్‌కు స్థలం ఇప్పించిన నేతతో జనార్దనరావుకు ఇప్పటికీ సత్సంబంధాలు, ఆర్థిక సంబంధాలు ఉన్నాయని స్థానికులు బహిరంగంగా చెబుతున్నారు. వైసీపీ హయాంలో బార్‌ను దక్కించుకున్న జనార్దనరావు తెలంగాణలో వ్యాపారం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఇందులో భాగస్వాములను చేశాడు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి జోగి రమేశ్ సోదరుడి బార్‌లో చాలాకాలం భాగస్వామిగా ఉన్నాడు.

జనార్దనరావు జోగి మెట్లు ఎక్కాడా?

అద్దేపల్లి జనార్దనరావు.. మాజీ మంత్రి జోగి రమేశ్‌కు సంబంధించిన మరిన్ని అంశాలు నెమ్మదిగా బయటకు వస్తున్నాయి. జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే తాము నకిలీ మద్యం తయారు చేసినట్టు జనార్దనరావు వీడియోలు విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా వారిద్దరికీ మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్ బయటకు వచ్చింది. కాల్ మీ అని జోగి రమేశ్ జనార్దనరావుకు సందేశం పంపాడు. దానికి ఆయన ఓకే.. అని తిరుగు సమాధానం ఇచ్చాడు. తర్వాత కమ్ టు మై హోం అని జోగి నుంచి సందేశం వచ్చింది. దీని ప్రకారం జనార్దనరావు ఆయన ఇంటికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాటింగ్ జరిగిన తేదీని బట్టి జోగి రమేశ్ ఇంటి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరిస్తున్నారు.



కేరళ డీజీపీ ఆజాద్ చంద్రశేఖర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ

దుర్గమ్మ సేవలో కేరళ డీజీపీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్ర డీజీపీ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ మంగళవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈవో, చైర్మన్ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం ఇచ్చారు. అనంతరం డీజీపీ ఆజాద్ మీడియాతో మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

నేడు గాంధీజీ హైస్కూల్‌కు ఎన్నారై రాజ్ వట్టికూటి రాక



వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ బీఆర్పీ రోడ్డులోని గాంధీజీ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 1964-67 మధ్య చదివిన పూర్వ విద్యార్థి, ప్రముఖ ఎన్నారై రాజ్ వట్టికూటి బుధవారం గాంధీజీ హైస్కూల్‌కు రానున్నారు. అమరావతిలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనటానికి ఆయన విజయవాడ విచ్చేశారు. అందులో భాగంగా బుధవారం ఓ హోటల్‌లో జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 9.45 గంటలకు వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.30లక్షలకు పైగా విలువ చేసే కంప్యూటర్లు, ఇతర సామగ్రిని అందచేయనున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటనున్నారు. ఈయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు.

గూడుపుఠాణి!

(5వ పేజీ తరువాయి)

పనిచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన 120 మంది శానిటరీ మేస్త్రీలు పనిచేయాల్సి ఉంది. నగరానికి 88 మంది శానిటరీ మేస్త్రీలే ఉన్నారు. మరో 32 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అవసరం ఉంది. అవసరమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి అనుమతులు తెచ్చుకోవచ్చు. కానీ, ఆ పని చేయకుండా అనధికారికంగా ఇష్టానుసారంగా మేస్త్రీలను నియమించుకున్నారు. కార్పొరేషన్ పరిధిలో అనధికారికంగా 225 మంది శానిటరీ లీడ్ మేస్త్రీలను నియమించుకున్నారు. ఇప్పటికీ లీడ్ మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. వీరందరినీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నియమించుకున్నారు. ప్రస్తుతం లీడ్ మేస్త్రీలుగా పనిచేస్తున్న 225 మంది కూడా సాధారణ వర్కర్లే కావటం గమనార్హం. వర్కర్లనే ఒక గ్రూపునకు లీడ్ మేస్త్రీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనధికారికంగా నియమించారు. తమకు నచ్చిన వర్కర్లను, తమ చెప్పుచేతల్లో ఉండే వర్కర్లను, తాము ఏ పని చెబితే ఆ పని చేసే వర్కర్లను నియమించుకున్నారు. శానిటరీ డివిజన్ల పరిధిలో కళ్యాణ మండపాలు, దుకాణాలు, వ్యాపార సంస్థలు ఎంపిక చేసిన ప్రాంతాలకు సంబంధించి అక్రమ వసూళ్లకు తెగపడటం కోసమే లీడ్ మేస్త్రీలను తెరమీదకు తీసుకువచ్చినట్టుగా తెలుస్తోంది. లీడ్ మేస్త్రీలు ఇళ్ల దగ్గర కూడా అక్రమ వసూళ్లకు తెగబడుతుంటారు. ప్రతి పనికీ ఓ రేటును నిర్ధారిస్తుంటారు. లీడ్ మేస్త్రీలుగా చేసినా వారికి అదే జీతం ఉంటుంది. వసూలు చేసిన వాటిలో కొంత పర్సంటేజీని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారికి చెల్లిస్తారు. ఇలా తమ అక్రమ వ్యవహారాలను చక్కబెట్టుకోవటం కోసమే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లీడ్ మేస్త్రీల పేరుతో కొంతమంది వర్కర్లకు పెత్తనం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జలవనరుల శాఖ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు తాతయ్య, తంగిరాల

ఎత్తిపోతల మరమ్మతులకు నిధులిస్తాం

» జలవనరులశాఖ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్

జగ్గయ్యపేట : పశ్చిమకృష్ణాలో వేలాది ఎకరాలకు సాగునీటిని అందించే పోలంపల్లి మునేరు ఆనకట్ట, వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు త్వరలో నిధులు విడుదల చేస్తామని జలవనరులశాఖ ప్రత్యేకకార్యదర్శి జి.సాయిప్రసాద్ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్యలకు తెలిపారు. ఎంపీ కేశినేని, నీటిపారుదల శాఖ అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణతో కలిసి ఎమ్మెల్యేలు తంగిరాల, తాతయ్యలు పోలంపల్లి మునేరు ఆనకట్టకు మరమ్మతుల ప్రాధాన్యాన్ని, వేదాద్రి-కంచెల ఎత్తిపోతల పథకం మరమ్మతుల ఆవశ్యకతను ఆయనకు వివరించారు. ఇప్పటికే నిధులు మంజూరు క్లియరెన్స్ కోసం ఆర్థికశాఖకు సంబంధిత ఫైల్స్‌ను పంపామని, క్లియరెన్స్ రాగానే నిధులు విడుదల అవుతాయని తెలిపారు.

ముమ్మరంగా శానిటేషన్ డ్రైవ్

రామలింగేశ్వరనగర్ : స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 14వ డివిజన్‌లో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. 80 మంది పారిశుధ్య కార్మికులు డివిజన్‌లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కల తొలగింపు, వ్యర్థాలను తొలగించారు. డ్రెయిన్లలోని పూడిక తీసి ట్రాక్టర్‌లతో డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550



19వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

జీఎస్టీలో సంస్కరణలతో అందరికీ మేలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావడంతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గెద్ద రామ్మోహన్ అన్నారు. మంగళవారం 19వ డివిజన్ ఫకీరుగూడెంలో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భాగం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత సమస్యల పరిష్కారమే లక్ష్యం

లబ్బీపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరిస్తూ, డీ అడిక్షన్, పోర్నోగ్రాఫీ, సోషల్ మీడియా. స్ర్కీన్ వ్యసనాలపై స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అవగాహన కల్పిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు అమీర్ ఫహద్ అన్నారు. మంగళవారం లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో మొరాలిటి అండ్ ట్రాంక్విలిటి అనే శీర్షికతో నవంబరు 10 వరకు జాతీయస్థాయి క్యాంపెయిన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ 42 ఏళ్లుగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోసం నైతిక మార్గదర్శక శిబిరాలు తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



లబ్బీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బందర్‌రోడ్డులోని షాపింగ్ మాల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. బందర్ రోడ్డులోని షాపింగ్ మాల్, పుష్పహోటల్ సమీపంలోని ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. అక్కడి సిబ్బందికి పరికరాలు ఉపయోగించే విధానంపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఆఫీసర్ కె.నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.


చెస్‌లో స్పార్క్ క్రీడాకారులకు బహుమతులు



విజయవాడ(స్పోర్ట్స్), అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఈ నెల 12న జరిగిన తెలుగు స్టేట్స్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తమ అకాడమీ క్రీడాకారులు విజేతలుగా నిలిచి బహుమతులు సాధించారని స్పార్క్ చెస్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ వెంకటశివరావు తెలిపారు. అండర్-7 కేటగిరిలో టి.నాగష న్మఖ మొదటి, అండర్-15 కేటగిరిలో టి.నిశ్చల్ రెండో, ఎఫ్15 కేటగిరిలో ఎ.హసీలా రెండో బహుమతి సాధించాన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

టీడీపీ కార్యకర్తకు గద్దె పరామర్శ

కృష్ణలంక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక ఎం.హోటల్ సమీపంలోని శ్రీరామ్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న 18వ డివిజన్ టీడీపీ కార్యకర్త నాగవరపు ప్రసాద్‌ను గద్దె క్రాంతికుమార్ పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. అలాగే 17వ డివిజన్‌కు చెందిన మరో కార్యకర్త మొకర అప్పలనాయుడుకు కూడా వైద్యం కోసం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, నాగవరపు దుర్గారావు, మర్రి వెంకట రమణ, మందుల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యం మన చేతుల్లోనే..!



- పరిశుభ్రమైన చేతులతోనే సంపూర్ణ ఆరోగ్యం
- ఇన్ఫెక్షన్లకు కారణం చేతుల అపరిశుభ్రతే
- చిన్నపిల్లలకు అవగాహన తప్పనిసరి
- అపరిశుభ్ర చేతులతో పది రకాల వ్యాధులు వ్యాప్తి
- చేతులు శుభ్రం చేసుకోవడానికి కనీసం 15 సెకన్లు తప్పనిసరి

చేతులు పరిశుభ్రంగా ఉంటే సగం ఆరోగ్యం పదిలంగా ఉన్నట్టే. ఎందుకంటే మనం రోజూ తినే ఆహార పదార్థాల నుంచి ఇతర కార్యక్రమాల వరకు అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయి. అటువంటప్పుడు చేతులు అపరిశుభ్రంగా ఉంటే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఆహార పదార్థాలు తినే ముందు చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల అనేక రకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంది. అయితే చేతుల శుభ్రతకు ఒక పద్ధతి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చాలామందికి అవగాహన లేక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. చిన్నారులు చీటికిమాటికి చేతులను నోటిలో పెట్టుకోవడం వలన ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటుందని, వారు చేతులను శుభ్రం చేసుకోవడంపై అవగాహన తప్పనిసరని వైద్యులు చెబుతున్నారు. ఈ ఏడాది 'గ్లౌవ్స్ వేసుకున్నా చేతులను పరిశుభ్రంగా ఉంచుకుందాం' అనే థీమ్‌తో నేడు వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. - ఆంధ్రజ్యోతి - విజయవాడ

నేడు అంతర్జాతీయ హ్యాండ్ వాష్ డే

చేతుల పరిశుభ్రతతో కొన్ని రకాల వ్యాధులకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కలిగించాలన్న ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 2008 నుంచి వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తోంది. దేశంలో హ్యాండ్ వాష్ డేను ప్రమోట్ చేస్తూ ఎంతో మంది సెలబ్రిటీలు అవగాహన సదస్సులు నిర్వహించారు.

గ్లౌవ్స్ వాడకంతో శుభ్రంగా ఉన్నట్టా..?

వైద్య రంగంతోపాటు మరికొన్ని రంగాల్లో పనిచేసే సిబ్బంది చేతులకు గ్లౌవ్స్ ధరించి పనులు చేస్తుంటారు. చాలామంది గ్లౌవ్స్ ధరించామన్న ఉద్దేశంతో చేతులను శుభ్రంగా ఉన్నట్టు భావిస్తుంటారు. అది నిజం కాదు. గ్లౌవ్స్ ధరించినా తినేముందు చేతులు శుభ్రపరచుకోకపోతే ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే వైరస్‌లు, బాక్టీరియాలు చేతుల్లో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆయా సెక్టార్స్‌లో పనిచేసే ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకే ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేశారు.

ప్రతి ఒక్కరూ చేసుకోవాలి

చేతులను శుభ్రంగా ఉంచుకోవడమన్నది వ్యక్తిగత విషయం. ఇంట్లో తిరిగాడే పిల్లాడి నుంచి, ఇంటి, వంట పనిలో బిజీగా ఉండే గృహిణి, ఉద్యోగులు, కార్మికులు వృత్తిగత, వ్యక్తిగత కార్యక్రమాల వల్ల వేల బాక్టీరియాలు చేతుల్లోకి చేరే అవకాశముంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాటిని నాశనం చేయాలంటే చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా శానిటైజర్ లేదా సబ్బుతో కడుక్కోవడం ఉత్తమం.

చేతులు శుభ్రమేనా..?

సాధారణంగా చాలామంది మనమేం చేయలేదులే చేతులు శుభ్రంగా ఉన్నాయని భ్రమలో ఉండడంతో కడగడానికి ఇష్టపడరు. ఒకవేళ కడగాల్సి వచ్చినా తూతూమంత్రంగా కానిచ్చేస్తారు. చేతులు శుభ్రంగా ఉన్నట్టు కనిపించినా బాక్టీరియాలు చేతుల్లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సూక్ష్మదర్శినితో పరిశీలిస్తే లక్షల బాక్టీరియాలు కనిపిస్తాయని, చేతులను శుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల అవి శరీరంలోకి ప్రవేశించి అనేక వ్యాధుల బారినపడేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

పది రకాల వ్యాధుల నుంచి రక్షణ

చేతులను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల 10 నుంచి 30 రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. చేతులను పరిశుభ్రం చేసుకోకుండా ఆహార పదార్థాలు నేరుగా తినడం వల్ల విరేచనాలు, వాంతులు, పచ్చకామెర్లు, టైఫాయిడ్, న్యుమోనియా, మెదడువాపు వ్యాధి, కళ్ల కలక, చర్మ వ్యాధులు, అమీబియాసిస్ (కడుపునొప్పి, రక్తంతో కూడిన విరేచనాలు), స్వైన్ ఫ్లూ, టీబీ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. చేతులను శుభ్రం చేసుకోకపోవడంతో ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురై మృతి చెందుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల ఈ జబ్బుల్లో 80 శాతం నివారించవచ్చు. చేతులను శుభ్రంగా కడగడం అంటే సబ్బు/లిక్విడ్‌తో కనీసం 30 నుంచి 60 సెకన్లపాటు కడగాలి. లేదా పరిస్థితిని బట్టి కనీసం 30 సెకన్లయినా కడగాలి. చేతులను కడిగే సమయంలో వేళ్లమధ్యలో, గోళ్లను శుభ్రపరుచుకోవాలి. చేతులను శుభ్రం చేసుకున్న అనంతరం పొడి వస్త్రంతో తుడ్చుకోవాలి.

పరిశుభ్రమైన చేతులతో వ్యాధులకు దూరం

ప్రశాంతి, మైక్రోబయాలజీ ప్రొఫెసర్, సిద్ధార్థ మెడికల్ కాలేజీ



చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం వల్లే 90శాతం శ్వాసకోస, జీర్ణ వ్యవస్థ, చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. పిల్లలకు హ్యాండ్ వాష్ పట్ల అవగాహన కలిగించాలి. ఆసుపత్రిలో ఉన్న రోగుల సహాయకులయితే కచ్చితంగా రోగిని తాకిన వెంటనే, తినడానికి ముందు, ఏదైనా వస్తువును ముట్టుకున్నప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. ఈ ఏడాది థీమ్ ప్రకారం హెల్త్ కేర్ రంగంలో పనిచేసే వాళ్లు గ్లౌవ్స్‌ను ధరించడం వల్ల చేతులు పరిశుభ్రంగా ఉంటాయని భావిస్తుంటారు. కానీ వందశాతం శుభ్రంగా ఉన్నట్టు కాదు. గ్లౌవ్స్ తీసిన తరువాత చేతులను మళ్లీ శుభ్రం చేసుకోవడం ద్వారా మాత్రమే చేతులు శుభ్రంగా ఉన్నట్టు.

ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరవు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ ధాన్యం సేకరణకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 ధాన్యం సేకరణకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం జిల్లాస్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఎస్ ఇలక్కియాతో కలిసి పాల్గొన్నారు. పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార ఇతర శాఖల అధికారులు, కస్టోడియన్ అధికారులు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లా మొత్తంలో 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తిని అంచనా వేయగా ప్రాథమికంగా సుమారు 3,03,154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 159 రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పౌర సరఫరాల డీఎం టీ వెంకట్ సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, తిరువూరు ఆర్డీవో కే మాధురి, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, డీఎస్‌వో పాపారావు, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

లక్ష్యసాధనకు అధికారులు కృషి చేయాలి

కీలక ప్రగతి సూచికల (కేపీఐ) లక్ష్యాల సాధనకు ప్రతి శాఖ కృషి చేయాలని, ఇందుకు సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేపీఐల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. వార్షిక తలసరి ఆదాయ వృద్ధితో పాటు వృద్ధిరేటు 18శాతం ఉండాలన్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. రైతులు, కౌలు రైతులకు రుణాల మంజూరు లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. మత్స్య రంగ (ఫిషరీల) విస్తరణపై దృష్టిసారించాలని, సహకార సంఘాల పురోగతిని తెలియజేయాలన్నారు. ధాన్యం ప్రతి మంగళవారం కీలక ప్రగతి సూచికలపై సమావేశం నిర్వహిస్తామని, జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సీపీవో వై శ్రీలత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించండి

గుణదల: వసతిగృహాల్లో ఉంటూ విద్యాభ్యాసం చేసే విద్యార్థినిలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన గురుతర బాధ్యత సిబ్బందిపైనే ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గుణదల్లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ వసతి పొందుతున్న బాలికలకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వారితో కలిసి ఉదయం అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వసతి గృహాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ఇందుకు గాను ఒక్కో వసతి గృహానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. వీరు వారానికి 2 సార్లు వసతి గృహాలను సందర్శించి అన్ని అంశాలను పరిశీలించి ఆన్‌లైన్లో నివేదికలు సమర్పిస్తారన్నారు. వసతిగృహాల్లో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్న వారితో కెరీర్ గైడెన్స్, మెడిటేషన్ తరగతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వసతిగృహ ప్రత్యేక అధికారి డీపీవో పీ లావణ్య కుమారి, వసతిగృహ సంక్షేమ అధికారి ఏ రజనీ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

ఊహించిన దానికంటే ఎక్కువ అభివృద్ధి

- సిబ్బందిని ప్రశంసించిన ఎంపీ చిన్ని
- జీజీహెచ్‌లో అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం
- ఆసుపత్రి ఏర్పాట్లపై ఎంపీ, కలెక్టర్ ఆరా

విజయవాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏమేమి లోటుపాట్లు ఉన్నాయో, ఇప్పటి వరకు నిధులెన్ని ఖర్చుపెట్టారు.. ఇంకా ఏయే అవసరాలు ఉన్నాయనే విషయంపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ తాము ఊహించిన దాని కన్నా ఎక్కువగా అభివృద్ధి డాక్టర్లు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేయలేని ఆపరేషన్స్‌ను సైతం ప్రభుత్వాసుపత్రిలో చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. డాక్టర్స్ అడిగిన రిక్రూట్‌మెంట్ త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎప్పకప్పుడు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామని, త్వరలోనే కొత్త బిల్డింగ్ నిర్మాణం పూర్తయితే మరిన్ని అధునాతన పరికరాలను ఏర్పాటుచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్లు రోగులకు మంచి సేవలందిస్తున్నారన్నారు. సరైన సమయంలో సరైన వైద్యం అందిస్తున్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు తమను అభినందిస్తున్నారని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏ వెంకటేశ్వర్లు అన్నారు. ఆసుపత్రికి కావాల్సిన కొన్ని అత్యాధునిక పరికరాల కోసం కలెక్టర్, ఎంపీకి వివరించామన్నారు. వాటిని వెంటనే అందిస్తామన్నారని, తాము అడిగిన ప్రతిపాదనలన్నిటికీ ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ ఒప్పుకోవడం సంతోషమన్నారు. ఈ మీటింగ్‌లో పలు అంశాలకు సంబంధించిన బిల్లులకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. పలు విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో

రైల్వే ఉద్యోగికి రెండు కాంస్యాలు



రైల్వేస్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈనెల 12న జరిగిన 7వ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు గెలుచుకుని సంస్థకు కీర్తిప్రతిష్టలు తెచ్చి న కే లవయ్యను అధికారులు అభినందించారు. అసాధారణ నైపుణ్యం, దృఢ సంకల్పం, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన లవయ్య 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్లలో కాంస్య పతకాలను గెలుచుకున్నాడు. తెనాలిలో పార్శిల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వాణిజ్య విభాగానికి చెందిన లవయ్య మంగళవారం డీఆర్ఎం మోహిత్ సొనాకియాను కలవగా ఆయన అభినందించారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న అతడికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్సీ విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

గవర్నర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, పాఠశాలల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మంగళవారం విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. పాఠశాల కమిషనర్ విజయ రామరాజు, ఇంటర్, డిగ్రీ కమిషనర్ నారాయణ భారత్ గుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ భార్గవ్‌ను కలిసి సమస్యలను వివరించారు. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రాడేషన్ ఆర్థిక ఆమోదంతో తదుపరి చర్యలు చేపట్టాలని, వెల్ఫేర్ పాఠశాలలు ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్ 100 శాతం హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. మనబడి-మనభవిష్యత్తు పాఠశాలల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని, ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో పీజీటీ ఖాళీలు నింపాలని, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలకు పీడీ పదోన్నతులు ఇచ్చి ఇన్ సర్వీస్‌కు అవకాశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పదోన్నతుల అంతర్ జిల్లా సమస్యలు పరిష్కరించాలని, ఉన్నత పాఠశాలల్లో పీఈటీలకు పీడీ పదోన్నతులివ్వాలని, ఏపీ మోడల్ స్కూల్‌లో పాఠశాల సమయాన్ని 9 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించాలని, గోదావరి బాలోత్సవం 3వ పిల్లల పండుగ నిర్వహించుకునేందుకు ఎస్‌కెవీటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుమతి ఇవ్వాలని కోరారు.

జగన్ రెడ్డి, జోగి రమేష్, జనార్ధనరావుది పెవిక్విక్ బంధం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న)

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యాపారంలో జగన్ రెడ్డి, జోగి రమేష్, జనార్ధనరావు బంధం పెవిక్విక్ బంధమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) అన్నారు. మంగళవారం హనుమాన్‌పేట తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యంపై గతంలో తాను మాట్లాడిన విధంగానే నిజాలు నిర్భయంగా బయటికి వచ్చాయన్నారు. నకిలీ మద్యం లిక్కర్ స్కామ్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకోగానే, సాక్షి మీడియాని తీసుకొని వెళ్లి హడావుడి చేశారని తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కి నకిలీ లిక్కర్ స్కామ్‌కి, ఖచ్చితమైన సంబంధం ఉందని ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన రావు మాటలలో స్పష్టమైందని వెల్లడించారు. ఒక మాజీ మంత్రిగా పనిచేశానని మర్చిపోయి, కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులపై మీడియా కాన్ఫరెన్స్‌లో అసంబద్ధమైన ప్రేలపణలు, బాధ్యతారాహిత్యమైన మాటలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. జోగి రమేష్ చేసే పనులకు గుడిలో ఉన్న దేవుళ్లకి, ఇళ్లల్లోని ఆడవాళ్ళకి ఏం సంబంధమని ప్రశ్నించారు? గతంలో సీఎం జగన్మోహన్ రెడ్డి వద్ద పేరు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో, మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన నీచమైన వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. వైసీపీ నాయకుల్లాగా, తెలుగుదేశం పార్టీ నాయకులకి కార్యకర్తలకి కార్యాలయాలపై, ఇళ్లపై దాడి చేసే సంస్కృతి లేదన్నారు.

నాటకరంగ పరిరక్షణలో గోపాలుడు

- బొబ్బిళ్లపల్లి సాయి సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం
- నేడు రవీంద్ర భారతిలో సంగమం జీవన సాఫల్య పురస్కారం



ఆంధ్రజ్యోతి, నందిగామ: మూడు దశాబ్దాల క్రితం వరకూ ప్రజలను ఉర్రూతలూగించిన రంగస్థల కళారంగం రానురానూ తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. ఈ తరుణంలో బొబ్బిళ్లపల్లి గోపాలకృష్ణ సాయి అనే ఒక సామాన్యుడు గతించిపోతున్న రంగస్థల వైభవానికి జీవం పోశారు. మణులు, మాన్యాలు లేకపోయినా కళాకారుల కడుపు నింపి రంగస్థల నాటక రంగాన్ని కాపాడేందుకు స్వశక్తితో నడుంబిగించారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సంగమం జీవన సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసింది. బుధవారం (నేడు) రవీంద్రభారతిలో అవార్డు తీసుకోబోతున్నారు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం బొబ్బిళ్లపాడు గ్రామానికి చెందిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ కాంగ్రెస్ తరపున 1985, 1994లో నందిగామ నుంచి శాసనసభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. మూడున్నర దశాబ్దాల పాటు గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. నాటకాలపై మక్కువతో కళాకారుల బాధలకు చలించిపోయారు. బళ్లారి రాఘవ కళాసమితిని స్థాపించి గుమ్మడి గోపాలకృష్ణ, డీవీ సుబ్బారావు, బీసీ కృష్ణ, చీమకుర్తి నాగేశ్వరరావు, అరిగెల జేమ్స్, గూడూరు సావిత్రి, వంటి పద్యనాటక అగ్ర కళాకారులతో కళాప్రదర్శనలు ఇప్పిస్తూ వచ్చారు. వయోభారంతో ఆరోగ్యం సహకరించపోయినా ప్రతి ఏడాది అద్భుతమైన కళా రూపాలను ఏర్పాటు చేస్తూ కళాభిమానులకు కనువిందును, కళాకారులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. వైసీపీ హయాంలో కళాకారులకు పెన్షన్లు ఎత్తివేయడంతో వేలాది మంది కళాకారులతో రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం నిర్మించారు. గోపాలకృష్ణ సాయిని పలు అవార్డులు వరించాయి. సువర్ణ నంది అవార్డుతో పాటు తెలుగు వర్సిటీ నుంచి అవార్డులు అందుకున్నారు. తానా సాదరంగా ఆహ్వానించినా ఆర్థిక ఇబ్బందులతో వెళ్లలేకపోయారు. ఎన్టీఆర్ పరిషత్ సంస్థ శ్రీ భారతీయుడు అవార్డుతో సత్కరించింది.

సంగమం జీవన సాఫల్య పురస్కారం

బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి సామాజిక, సాంస్కృతిక జీవిత వజ్రోత్సవాలను సంఘం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈనెల 15న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదగా సంగమం జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, శాసన సభ్యులు, కళా అభిమానులు పాల్గొంటున్నారు.

గూగుల్‌తో ఒప్పందం రాష్ట్ర చరిత్రలో

సువర్ణాధ్యాయానికి నాంది

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఎంపీ శివనాథ్ ఘన స్వాగతం



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ

వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయానికి నాంది పలికారని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ఢిల్లీలో ఒప్పందం చేసుకుని మంగళవారం ఉండవల్లి తిరిగి వచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను వారి నివాసం వద్ద ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఘన స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు పుష్పగుచ్ఛం అందించారు. విశాఖను ఏఐ సిటీగా తీర్చిదిద్దబోతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గూగుల్ సంస్థ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందని ఎంపీ తెలిపారు. నిరుద్యోగ యువతకి ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఓల్డ్‌టైర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఓల్డ్ టైర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఫక్కర్ అహ్మద్ (బాబు) మర్యాదపూర్వకంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఓల్డ్‌టైర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బృందం ఆయన్ను కలిసింది. ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈనెల 7న ఓల్డ్‌టైర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో షేక్ ఫక్కర్ అహ్మద్ (బాబు) అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా 218 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు ఎంపీకి తెలిపారు. నూతన అధ్యక్షుడు బాబుకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్, ఓల్డ్‌టైర్ అసోసియేషన్ స భ్యులు ఎస్ఎస్ఎస్ హుస్సేన్ బాబా, షేక్ మస్తాన్ వలి, షేక్ బాజీ, జీ గంగరాజు, అబ్దుల్ అజీస్ పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన దూండీ

ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను మంగళవారం ఉండవల్లిలోని వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. గూగుల్ సంస్థ పెట్టుబడులను ఏపీకి తీసుకురావటానికి కీలకపాత్ర పోషించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

రైళ్లలో చోరీల నిందితుడి అరెస్టు

- రూ.3.68 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

రైల్వేస్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల వద్ద నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దొంగిలిస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన ముల్పూరి ఫణీంద్ర రెడ్డి (36)ని మంగళవారం విజయవాడ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.3,68,000 విలువైన బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వేజెండ్ల గ్రామానికి చెందిన ఫణీంద్ర రెడ్డి రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు, నగదు చోరీకి పాల్పడుతున్నాడు. ఇటీవల విజయవాడ రైల్వే పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ సీఐ జేపీ రమణ, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఫతే ఆలీ బేగ్ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో వారు స్టేషన్ ప్రాంగణంలో సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుడి ఆచూకీని కనుగొన్నారు. నిందితుడు పాత నేరస్థుడు ఫణీంద్ర రెడ్డి అని గుర్తించారు. మంగళవారం వన్‌టౌన్ శివాలయం వీధిలో నిందితుడు ఉన్నట్టు గుర్తించి పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించి దొంగిలించిన రూ.3,68,000 విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



నిందితుడు ఫణీంద్ర రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్ఈఎంఎస్ పథకం అమలు చేయాలి

- ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు

బస్‌స్టేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు గతంలో ఉన్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆ ర్ఈఎంఎస్)ను అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోధరరావు, జీవీ నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనానికి ముందు ఆర్ఈఎంఎస్ పథకాన్ని కావాలనుకునే ఉద్యోగులు కొంతమేర డబ్బు చెల్లించేవారని, రిటైరయ్యాక భార్యాభర్తలు ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం పొంది, మందులు తీసుకునేందుకు అవకాశం ఉండేదని పేర్కొన్నారు. విలీనం అనంతరం 2020 నుంచి ఈ పథకాన్ని నిలిపివేసినప్పటి నుంచి సుమారు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు వైద్య సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ పథకం యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకుని రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు.



చదువు కోసం

"బాగా చదువుకోవాలన్న సంకల్పం, పట్టుదల ఉంటే చాలు... పేదరికం, వివక్ష లాంటి అవరోధాలను అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అయితే అది అంత సులభం కూడా కాదు... పోరాటం చేయాల్సిందే" అంటారు డాక్టర్ కుమ్మరి ఆదిలక్ష్మి. నంద్యాల జిల్లాలోని ఆవులదొడ్డి గ్రామానికి చెందిన ఆమె హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి తెలుగు పరిశోధనలో ఈ మధ్యే పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. "తొమ్మిదో తరగతితోనే ఆగిపోతుందనుకున్న చదువు ఇక్కడి వరకు కొనసాగడానికి కుటుంబంతో సమాజంతో పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది" అంటున్న ఆదిలక్ష్మి 'నవ్య'తో తన కథను పంచుకున్నారు.

పెద్ద యుద్ధమే చేశాను

"నల్లగా, పొట్టిగా ఉన్న పిల్లను ఎవరు పెళ్లి చేసుకుంటారు?... ఇలాంటి మాటలు బంధువులు, ఇరుగుపొరుగు వారి నోళ్ల నుంచి నిత్యం వింటూ పెరిగిన నాకు ఆ వెక్కిరింతలే దీవెనలయ్యాయి. ఆ అవమానాలే నన్ను మారుమూల పల్లెటూరు నుంచి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వరకూ తీసుకువచ్చాయి. మా ఊర్లో అమ్మాయిలకు చదువు అంటే తొమ్మిది లేదా పదోతరగతి... అంతే! ఇప్పటికీ అదే పరిస్థితి. తొమ్మిదో తరగతిలో ఉండగా నాకు కూడా మా ఇంట్లో వాళ్లు పెళ్లి చేయాలని చూశారు. కాకపోతే, వచ్చిన సంబంధాలు వచ్చినట్టే వెనక్కివెళ్లడంతో 'హమ్మయ్య... ఇక సంతోషంగా చదువుకోవచ్చు' అనుకున్నాను. అలా నా రూపమే నాకు మనోబలాన్ని, సంకల్పానికి శక్తిని అందించింది అయితే నా పాలిట మరొక విలన్ ఉంది! అదే పేదరికం. నా తల్లిదండ్రులకు నన్ను చదివించడానికి స్థోమత ఒక్కటే కాదు, ఆ దిశగా నన్ను ప్రోత్సహించాలన్న కనీస ఆలోచనకూడా లేదు. నా చదువు గురించి వారికి అస్సలు ఏమీ తెలీదు కూడా. కాకపోతే, నా ఇష్టానికి నన్ను వదిలేశారు. అదొక్కటే నా జీవితాన్ని నాకు నచ్చినట్టుగా మలచుకోవడానికి అవకాశం కల్పించింది.

పురుగుల అన్నం తింటూ...

పొలం పనులు సాగకపోవడంతో అమ్మ, నాన్న కూలి పనుల కోసం కర్నూలుకు వచ్చినప్పుడు



చదువు ఒక్కటే దారి...

చదువు ఒక్కటే మన జీవితాన్ని ఒక మెట్టుపైకి తీసుకెళుతుందని గుర్తించాను. కొంతమంది దృష్టిలో చదువుకోవడం అంటే పాఠ్యపుస్తకాలు వల్లెవేసి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే. కానీ నాలాంటి అమ్మాయిలకు మాత్రం చదువు అంటే అదొక పెద్ద సంగ్రామం. సమాజంతో, కుటుంబంతో నిత్యం పోరాడాలి. అవమానాలు, ఛీత్కారాలు భరించాలి. 'అమ్మాయిలకు అంత పెద్ద చదువు అవసరమా' లాంటి సామాజిక ఒత్తిళ్లను అధిగమించాలి. అప్పుడుకాని తరగతి గదికి చేరుకోలేం. నా పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా వివాహ వ్యవస్థ గురించి డాక్టర్ కె.శ్రీదేవి, మల్లాది సుబ్బమ్మ, ఓల్గా, కాత్యాయనీ విద్మహే లాంటి ప్రఖ్యాత రచయిత్రులు రాసిన వ్యాసాలు అధ్యయనం చేశాను. దీనివల్ల భారతీయ సమాజంమీద, ముఖ్యంగా స్త్రీ, పురుష సంబంధాలమీద స్పష్టమైన అవగాహన నాలో ఏర్పడింది. వారి రచనలు నన్ను మరింత విశాల ప్రపంచంలోకి తీసుకువెళ్లాయి.

ఆ విషయం ఏడాదిన్నర దాచాను...

మా ప్రాంతంలో రజస్వల అయిన వెంటనే అమ్మాయిలకు పెళ్లి చేస్తారు. ఇప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని చాలా గ్రామాలలో బాల్యవివాహాలు తరచుగా జరుగుతుంటాయి. కొన్ని పల్లెల్లో అయితే ఒకరిద్దరు మాత్రమే ఇంటర్, డిగ్రీ వరకు చదివి ఉంటారు. మూఢనమ్మకాలు కూడా ఎక్కువే. పుష్పవతి అయ్యానని తెలిసి, నాకు పెళ్లి చేస్తారేమోనన్న భయంతో ఏడాదిన్నర పాటు అమ్మకు కూడా చెప్పకుండా ఆ విషయాన్ని దాచాను.

నన్నూ వెంట తీసుకువెళ్లారు. ఒక ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించారు. నేను అక్కడ ఉండలేకపోతున్నానని ఎంత ఏడ్చి చెప్పినా "చదువుకోవాలంటే తప్పదు" అన్నారు. సెలవుల్లో నేనూ కూలికి వెళతానని చెప్పడంతో... నన్ను ఇంటికి తీసుకువచ్చారు. అలా ఇంటర్, డిగ్రీ వరకు పత్తిగింజల ఫ్యాక్టరీలో లేదంటే అప్పడాలు అమ్మడంలాంటి పనులుచేస్తూ కొనసాగాను. వచ్చిన కూలీని ఇంట్లోనే ఇచ్చాను. కొద్ది రోజులకు అమ్మావాళ్లు తిరిగి మా సొంతూరు వెళ్లడంతో... మళ్లీ ప్రభుత్వ వసతిగృహంలో చేరాల్సి వచ్చింది. ఆ జీవితం నరకప్రాయం. మరుగుదొడ్లు లేవు. చీకటితోనే లేచి ఆరుబయట స్నానాలు చేయాల్సి వచ్చేది. అన్నంలో పురుగులు ఏరుకొని తినాల్సి వచ్చేది. ఎప్పుడైనా కాలేజీలో స్పెషల్ క్లాసు వల్ల హాస్టల్‌కు ఆలస్యంగా వెళితే... మాకు ఆ వేళ ఉపవాసమే. రికార్డులు, నోటు పుస్తకాలకు డబ్బులు అడిగితే ఇంట్లోవాళ్లు లేవనేవారు. సెలవుల్లో కూలి పనులు చేస్తే వచ్చిన డబ్బుతో అవసరమైనవి సమకూర్చుకోవడం ఒక్కటే నాకు మిగిలిన దారి. ఈ రోజుల్లో డిగ్రీ చదవడం చాలామందికి పెద్ద విషయమేమీ కాదు. కానీ నాలాంటి ఆడపిల్లలకు మాత్రం అది పెద్ద యుద్ధమే. అందులో గెలవడానికి ఎన్ని బాధలు పడాలో అవన్నీ అనుభవించాను.

సెంట్రల్ వర్సిటీలో సీటు వచ్చింది...

డిగ్రీలో ఉండగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో ప్రవేశ పరీక్ష ద్వారా పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చేరవచ్చునని తెలిసింది. అప్పటివరకు నాకు ఆ యూనివర్సిటీ ఉందనే విషయమే తెలియదు. ఎంట్రన్స్ రాశాను. మంచి ర్యాంకు రావడంతో ఎమ్మే తెలుగులో చేరాను. తెలుగు అంటే సులువుగా ఉంటుందని అనుకున్నా, ఇక్కడ చేరాక కానీ తెలియలేదు... అది ఎంత కష్టమో. చదువుమీద ఇష్టంతో ఆ కష్టాన్ని కూడా సునాయాసంగా దాటాను. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన తర్వాత పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలోనూ రెండవ ర్యాంకు సాధించాను. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కి ఎంపికయ్యాను. ఆచార్య గోనా నాయక్ సర్ పర్యవేక్షణలో 'తెలుగు కథా సాహిత్యం - వివాహ వ్యవస్థలో పరిణామాలు... పరిశీలన' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి, మొన్నటి స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నాను. ఈ టాపిక్‌కూడా మా ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వరరావు సర్ సూచించారు. మా ప్రొఫెసర్లు మాత్రం నాకు చక్కటి మార్గనిర్దేశం చేశారు కాబట్టే సాధారణ అమ్మాయినైన నేను డాక్టర్ ఆదిలక్ష్మి కాగలిగాను. మా ఊర్లో పీహెచ్‌డీ చేసిన మొదటి అమ్మాయి నేనే కావచ్చు. ఇది గర్వంతో చెప్పడం లేదు, 'ఇన్నేళ్ల స్వాతంత్ర్య ఫలాలు మా పల్లెలాంటి ఇంకెన్ని పల్లెలకు చేరలేదో?' బాధతోనే అంటున్నాను.

అదే నా లక్ష్యం...

సెంట్రల్ యూనివర్సిటీలో ఉండగా అక్కడే మరో కోర్సు చదువుతున్న ఒక అతను పరిచయమయ్యాడు. ఒకరినొకరం ఇష్టపడి కులాంతరాలను సైతం కాదని పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నాం. ఇన్నాళ్లూ తల్లిదండ్రుల నుంచి అందని ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం భర్త నుంచి ఆశించాను. తాను ఒకటి తలిస్తే, విధి మరొకటి తలచిందని... వివాహమైన నెలరోజులకే కట్నం కోసం కొట్లాటలు మొదలయ్యాయి. మా అమ్మా నాన్నా నా చదువుకు సహకరించకపోయినా... ఆంక్షలు మాత్రం విధించలేదు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మాత్రం చదువుకోవద్దని ఒక రోజు, 'ఇప్పటికిప్పుడు ఉద్యోగం తెచ్చుకోవాల్సిందే' అని మరొక రోజు నానా మాటలతో చిత్రవధ చేయడం మొదలుపెట్టాడు. పీహెచ్‌డీ పరిశోధన ఆపేయమన్నాడు. మగ ప్రొఫెసర్లతో మాట్లాడకూడదని షరతులు పెట్టాడు. ఆ హింస భరించలేక ఇంటి నుంచి బయటకు వచ్చాను. ఇంకోవైపు పుట్టింటి నుంచి సహకారం లేదు. ఒకానొక సమయంలో డిప్రెషన్‌లోకి వెళ్లాను. తిరిగి నాలో నేనే ధైర్యం తెచ్చుకొని పీహెచ్‌డీ పరిశోధన పూర్తిచేశాను. ఉపాధ్యాయ వృత్తి అంటే నాకు మొదటి నుంచి చాలా ఇష్టం. టీచర్ అవ్వాలనీ, నాలాంటి నిరుపేద అమ్మాయిలు మరికొందరికి అండగా నిలవాలనీ నా కోరిక. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. జీవితంలో ఎన్నో యుద్ధాలు చేసి గెలిచిన నేను ఈ పోరాటంలోనూ తప్పకుండా విజయం సాధిస్తాను."

• సాంత్వన్

ఇల్లు సువాసనభరితంగా..

మనం ఎప్పుడైనా బయటకు వెళ్లి, తిరిగివచ్చి తలుపులు తెరవగానే ఇంట్లో నుంచి ఘాటైన వాసనలు రావడం గమనించే ఉంటాం. కిచెన్, బెడ్ రూమ్, స్టడీ రూమ్, హాల్, వాష్ రూమ్‌లలో సహజంగానే పలు రకాల వాసనలు నిండి ఉంటాయి. వీటివల్ల ఒక్కోసారి చికాకుగా అనిపిస్తుంటుంది. అలాకాకుండా ఇల్లంతా సువాసనభరితంగా ఆహ్లాదకరంగా ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...



- ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటి తలుపులు, కిటికీలు తెరచి ఉంచాలి. అప్పుడే ఎండ, గాలి లోపలికి ప్రసరించి ఇంటిని ఆహ్లాదకరంగా మారుస్తాయి.
- దుమ్ము, ధూళి, బూజు చేరకుండా ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. హాల్లో ఉండే సోఫాలు, కర్టెన్లు, కార్పెట్ల మీద కొద్దిగా బేకింగ్ సోడా చల్లి, వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోయి ఆహ్లాదకరంగా అనిపిస్తుంది.
- ప్రతి గదిలో ఇండోర్ ప్లాంట్ కుండీలను ఏర్పాటు చేసుకుంటే ఇల్లంతా తాజదనం నిండుతుంది. లావెండర్, రోజ్‌మేరీ, లెమన్‌గ్రాస్, యూకలిప్టస్, ఆర్కిడ్స్, పుదీనా, హనీసకేల్, గార్డెనియా లాంటి మొక్కలు ఇంటిని సువాసనలతో నింపేస్తాయి.
- ప్రస్తుతం నిమ్మ, లావెండర్, గులాబీ, మల్లె, సంపెంగ లాంటి ఎన్నో రకాల ఎసెన్షియల్ ఆయిల్స్, అత్తర్లు అందుబాటులో ఉంటున్నాయి. వాటిలో నచ్చినదాన్ని తెచ్చుకుని అప్పుడప్పుడు ఇల్లంతా స్ప్రే చేసుకోవచ్చు. దూది ఉండల మీద రెండు చుక్కల ఆయిల్ వేసి వాటిని గది మూలల్లో ఉంచినా ఫలితం ఉంటుంది.
- రాత్రిపూట ఇంట్లో సువాసనలను వెదజల్లే ఆర్గానిక్ కొవ్వొత్తులు వెలిగించుకోవచ్చు. అవి వెలుగుతున్నంతసేపు ఇల్లంతా మంచి వాసన నిండుతుంది. ఆ సుంగంధాన్ని కర్టెన్లు, కార్పెట్లు, సోఫా కవర్లు కూడా శోషించుకుంటాయి. దీంతో రోజంతా ఇల్లు ఆహ్లాదకరంగా ఉంటుంది.

పిల్లలు నడక నేర్చుకుంటున్నారా..?

సాధారణంగా పిల్లలు నడక నేర్చుకునే క్రమంలో చిన్న చిన్న దెబ్బలు తగిలించుకుంటూ ఉంటారు. అలాకాకుండా పిల్లలు తప్పటడుగులు వేసేటప్పుడు తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పిల్లలు నిలబడడానికి ప్రయత్నిస్తున్నప్పుడు వాళ్లని వాకర్‌లో కూర్చోబెట్టాలి. వాకర్‌ను మెల్లగా ముందుకు జరుపుతుంటే... పిల్లలు నిటారుగా నిలబడడం, అడుగులు వేయడం నేర్చుకుంటారు. అలాగని పిల్లలను గంటలకొద్దీ వాకర్లో ఉంచితే... వాళ్లకు నడుము నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది. పిల్లలు వాకర్లో ఉన్నంతసేపు వాళ్లని గమనిస్తూ ఉండాలి.
- పిల్లలు బుడి బుడి అడుగులు వేసేటప్పుడు వాళ్లకి పొడవాటి డ్రెస్‌లు వేయకూడదు. ఒక్కోసారి అవి కాళ్లకు అడ్డుపడి పిల్లలు కిందపడిపోయే అవకాశం ఉంటుంది. చేతి వేళ్లను పట్టుకుని నడిపిస్తుంటే పిల్లలు నడవడం నేర్చుకుంటారు.
- పిల్లలు ఇంటి పరిసరాల్లో నడిచేటప్పుడు పాదాలకు సాక్స్ బయటికి తీసుకువెళ్లేటప్పుడు మెత్తని షూస్ వేయాలి. లేదంటే రాళ్లు, ఇసుక లాంటివి గుచ్చుకుని పాదాలు కందిపోతాయి. ఒక్కోసారి పిల్లలు రెండు లేదా మూడు అడుగులు వేసి అకస్మాత్తుగా ముందుకు పడిపోతుంటారు. అలాంటప్పుడు దెబ్బలు తగలకుండా అరచేతులకు గ్లౌజ్‌లు వేయాలి.
- నడక నేర్చుకుంటున్న పిల్లలు... మంచం, ఉయ్యాల, సోఫా, ఇంటి ముందున్న మెట్లు దిగే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అలా దిగుతూ ఒక్కోసారి కింద పడిపోయి దెబ్బలు తగిలించుకుంటూ ఉంటారు. కాబట్టి పిల్లలు నడక నేర్చుకునే రెండు లేదా మూడు నెలలపాటు వాళ్లని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి.



పురాతన కోర్సెట్ ఫ్యాషన్ మళ్లీ ఊపందుకుంది. ఒంపుసొంపులతో కనికట్టు చేసే కోర్సెట్స్... చీరలు, గౌన్లు, జీన్స్... ఇలా అన్ని రకాల దుస్తులకూ తోడవుతున్నాయి. ప్రత్యేకించి వేడుకల్లో వెలిగిపోవాలనుకుంటే ఈ ట్రెండ్‌ను ఇలా అనుసరించాలి.

ఫ్యాషన్

'కోర్సెట్' కనికట్టు

17 నుంచి 19వ శతాబ్దం వరకూ వాడుకలో ఉన్న కోర్సెట్స్. ప్రారంభంలో తిమింగలం ఎముక, స్టీలుతో రూపొందేవి. శరీరానికి అతుక్కుపోయేలా, బిగుతుగా బిగించి కట్టే కోర్సెట్స్‌తో శరీరాకృతి ఆకట్టుకునేలా మారిపోతుందనే ఉద్దేశంతో ఒకప్పటి యూరోపియన్ మహిళలు వీటిని లోదుస్తుల్లా ధరించేవారు. అయితే ఈ దుస్తుల ఫ్యాషన్ క్రమేపీ అంతరించిపోతూ ఉండడంతో... వీటిని సరికొత్త రూపంలో వాడుకలోకి తీసుకురావాలనుకున్న ఫ్యాషన్ డిజైనర్లు... సంప్రదాయ కోర్సెట్స్‌ను మరిపించే దుస్తులను డిజైన్ చేయడం మొదలుపెట్టారు. ఫలితంగా కోర్సెట్ గౌన్లు, చీరలు వాడుకలోకి వచ్చాయి. అయితే వీటిని ఎలా ఎంచుకోవాలో తెలుసుకుందాం!



- ఛాతీ, నడుము, కటి ప్రదేశాలను కచ్చితంగా కొలుచుకుని, ఆ కొలతలకు తగిన కోర్సెట్‌ను ఎంచుకోవాలి
- కొందరికి ఛాతీ వెడల్పుగా ఉండొచ్చు. ఇంకొందరికి నడుము వెడల్పుగా ఉండొచ్చు. ఇలాంటి వాళ్లు 'అండర్‌బస్ట్' లేదా 'ఓవర్‌బస్ట్' కోర్సెట్‌ను ఎంచుకోవాలి
- పిరుదులు, నడుము నొక్కుకుపోకుండా సౌకర్యంగా ఉండాలి
- వదులు చేసుకోడానికీ, బిగుతును పెంచడానికీ వీలైన లేసింగ్ ఉండేలా చూసుకోవాలి



- కాటన్, మెష్, జెన్యూన్ లెదర్‌తో తయారైన కోర్సెట్స్ ఎంచుకోవాలి
- అండర్‌బస్ట్ కోర్సెట్స్ ధరించడం ఎంతో తేలిక. కాబట్టి వీటికే ప్రాధాన్యం ఇవ్వాలి
- చీరకు జోడీగా ధరించాలనుకుంటే, ఓవర్‌బస్ట్ కోర్సెట్‌ను ఎంచుకోవాలి.





సైకాలజీ

'కౌన్ బనేగా కరోడ్‌పతి 17'లో పాల్గొన్న ఇషిత్ భట్ అనే ఒక పదేళ్ల పిల్లాడు ప్రస్తుతం అందరూ ద్వేషించే పిల్లాడిగా వైరల్ అయ్యాడు. బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్ సారథ్యంలో సాగే ఈ క్విజ్ కార్యక్రమంలో ఆ పిల్లాడి దుందుడుకు ప్రవర్తన, దురుసైన మాటతీరు సర్వత్రా చర్చనీయాంశాలుగా మారాయి. పిల్లాడి ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందా లేదంటే అహంకారాన్ని కనబరుస్తోందా? ఇది ఆ పిల్లాడి తప్పిదమా, లేక తల్లితండ్రుల పెంపకం లోపమా? సమస్య ఎక్కడుంది?




ట్రోల్ అవుతున్న కెబిసి కుర్రాడు

ఐదో తరగతి చదువుతున్న గుజరాత్‌కు చెందిన ఇషిత్ భట్... కార్యక్రమం మొదట్లోనే...'నాకు ఈ కార్యక్రమం నియమాలన్నీ తెలుసు. కాబట్టి మీరిప్పుడు నాకు నియమాలు చెప్తూ కూర్చోకండి' అంటూ అమితాబ్‌ను ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు... ప్రశ్నకు తగిన ఆప్షన్స్ చెప్పే సమయం తీసుకోకుండానే దూకుడుగా సమాధానం చెప్పేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత కూడా... ఒక ప్రశ్న అడిగిన వెంటనే "ఇదసలు అడగవలసిన ప్రశ్నేనా?" అంటూ ఎద్దేవా చేయడంతో పాటు, మరొక ప్రశ్నకు సమాధానంగా 'ఒకటికి నాలుగు లాక్స్ వేసుకోండి' అంటూ అవసరానికి మించిన ఆత్మవిశ్వాసాన్ని కనబరిచి, అంతిమంగా పాతిక వేల ప్రైజ్ మనీని కోల్పోయి ఇంటి దారి పట్టాడు. అయితే ఈ కార్యక్రమంలో ఇషిత్ కనబరిచిన ప్రవర్తనను ఆత్మవిశ్వాసంగా పరిగణించాలా? లేక అహంకారంగా భావించాలా? లేదంటే ఇప్పటి తరం ఇలాగే ఉందని సరిపెట్టుకోవాలా?

సిక్స్ పాకెట్ సిండ్రోమ్

ఈ కార్యక్రమంలో ఇషిత్ కనబరిచిన ప్రవర్తనను మానసిక వైద్యులు 'సిక్స్ పాకెట్ సిండ్రోమ్'గా పరిగణిస్తున్నారు. ఈ సామాజిక పరిస్థితిలో ఆరుగురు కుటుంబసభ్యులు ఒకే బిడ్డ మీద విపరీతమైన ప్రేమనూ, శ్రద్ధనూ కనబరుస్తూ ఉంటారు. పిల్ల లేదా పిల్లాడి ప్రవర్తన వెనుక... ఆ బిడ్డ తల్లితండ్రులతో పాటు, ఇరువైపులా ఉన్న అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలిపి మొత్తం ఆరుగురు కుటుంబసభ్యుల ప్రమేయం ఉంటుందని సైకాలజిస్టులు అంటున్నారు. దంపతులు ఒక సంతానానికే పరిమితమైపోతున్న రోజులివి. దాంతో కుటుంబంలోని ఆరుగురి దృష్టీ ఆ ఒక్క సంతానం మీదే కేంద్రీకృతమై ఉంటుంది. ఆ ఆరుగురూ బిడ్డను గారం చేస్తూ, అడిగినవన్నీ కొనిపెడుతూ, నొప్పి తెలియకుండా పెంచడమే కాకుండా... ఆలస్యం చేయకుండా అలక తీర్చేయడం, అడిగినవన్నీ క్షణాల్లో అందించడం, తన మాటే నెగ్గుతుందనే భరోసా కల్పించడం లాంటి పొరపాట్లు చేస్తూ ఉంటారు. దాంతో పిల్లల్లో తానొక ప్రత్యేకమైన వ్యక్తిననే అభిప్రాయం బలపడుతుంది. తన మాటకు ఎదురుండదనే భరోసా కలుగుతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలను అవసరానికి మించి పొగిడేస్తూ ఉంటారు. ఇదీ మంచిది కాదు. పిల్లల ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిఫలిస్తున్నట్టు కనిపించవచ్చు. అయితే అది అహంకారానికి దారి తీయకుండా





జాగ్రత్తపడవలసిన బాధ్యత తల్లితండ్రులదే!

సామాజిక మాధ్యమాలు, రియాలిటీ షోలు

దురుసుగా, నిర్మొహమాటంగా మాట్లాడితే 'మా పిల్లలు పిడుగులు' అంటూ మురిసిపోయే తల్లితండ్రులు ఉంటారు. కానీ అలాంటి ప్రవర్తనను చూసి, మెచ్చుకోలుగా మాట్లాడిన ప్రతిసారీ పిల్లల్లో అదే సరైన ప్రవర్తన అనే నమ్మకం నాటుకుపోతూ ఉంటుంది. పెద్దలతో దురుసుగా మాట్లాడినప్పుడు మందలించడానికి బదులుగా, 'వాడి తీరే అంత' అంటూ పట్టించుకోకుండా వదిలేస్తే, తన ధోరణి సరైనదేననే ప్రోత్సాహాన్ని పిల్లలు పొందుతారు. ఇంట్లో ఇలాంటి వాతావరణానికి తోడు, రియాలిటీ షోలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, సీరియల్స్‌లో నటించే బాలనటుల ప్రవర్తనలను కూడా పిల్లలు అనుకరిస్తూ ఉంటారు. ఆయా మాధ్యమాల్లో పిల్లల మాటలకు వస్తున్న ప్రతిస్పందననూ, మెచ్చుకోళ్లనూ, చప్పట్లనూ రివార్డులుగా భావిస్తూ, అదే సరైన ప్రవర్తన అని భ్రమపడుతూ ఉంటారు. ఇంకొందరు పిల్లలు పెద్దల దృష్టిని ఆకట్టుకోవడం కోసం విపరీతంగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇవన్నీ పిల్లలే స్వయంగా అలవరుచుకున్న లక్షణాలు కావు. పరిసరాలు, పరిస్థితులు, చుట్టూ ఉన్న వాతావరణం, పెద్దల ప్రవర్తన... ఇవన్నీ పిల్లల మీద ప్రభావం కనబరుస్తూ ఉంటాయి. కాబట్టి పెద్దలను ఎదిరించి మాట్లాడడం, కసురుకోవడం, చెప్తున్నది పూర్తిగా వినకుండానే సమాధానం చెప్పడం, చులకనగా మాట్లాడడం.. చిన్న పిల్లల్లో ఇలాంటి ప్రవర్తనా లోపాలను గుర్తించినప్పుడు వాటిని మొదట్లోనే ఖండించాలి.

చిటికెలో చేతికి?

ఏది కావాలనుకున్నా, చిటికెలో చేతికందే రోజులొచ్చాయి. రిమోట్‌లో బటన్ నొక్కగానే రెప్పపాటులో ఛానల్ మారిపోతోంది. స్విగ్గీలో ఆర్డర్ పెట్టిన నిమిషాలలోపే ఆహారం ఇంటికొస్తోంది. ఫలానాది కావాలని తల్లితండ్రులను అడిగిన వెంటనే ఆ వస్తువును చేతికి అందించే ధోరణి కూడా పెరుగుతోంది. ఇలా అనుకున్న వెంటనే పనులన్నీ చకచకా జరిగిపోతున్నప్పుడు, తాను తలచుకున్న ప్రతిదీ అలాగే జరుగుతుందనే నమ్మకం కలగడం, అందుకోసం తొందరపడడం, కొద్దిపాటి ఆలస్యాన్ని సైతం భరించలేకపోవడం మొదలైన స్వభావాలు పిల్లల్లో పెరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయడం అవసరం. సహనం, ఉపేక్షల అసలు అర్థాలను పిల్లలకు నేర్పాలి. దుందుడుకుతనంతో ఒరిగే నష్టాలను తెలియచెప్పాలి. కోపం, ఉక్రోషం లాంటి భావోద్వేగాల దుష్ప్రయోజనాలను వివరించాలి. మరీ ముఖ్యంగా ఆత్మవిశ్వాసానికీ, అహంకారానికీ వ్యత్యాసాన్ని విపులంగా వివరించాలి.

డాక్టర్ జ్యోతిర్మయి
సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
మనహ క్లినిక్, హైదరాబాద్.

సానుభూతి ఎక్కడ?

మన మాట, ప్రవర్తనలు ఎదుటివారిని బాధపెట్టే అవకాశం ఉంటుందని పిల్లలు గ్రహించేలా చేయడం ఎంతో అవసరం. ఎలాంటి ప్రవర్తన, ఎలాంటి మాట తీరు ఎదుటి వారి మనసును నొప్పిస్తాయో పిల్లలు తమంతట తాము తెలుసుకోలేరు. కాబట్టి ఈ విషయంలో పెద్దలే పిల్లలకు మార్గదర్శకులుగా మారాలి. అలాంటి ప్రవర్తనను మొగ్గలోనే ఖండించాలి. తోటి పిల్లలతో, పెద్దలతో పిల్లలు నడుచుకునే తీరును గమనిస్తూ, అవసరమైన చోట కౌన్సెలింగ్ ఇస్తూ ఉండాలి. మరీ ముఖ్యంగా టీవీలు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లల మీద పడకుండా జాగ్రత్త పడాలి.

• గోగుమళ్ల కవిత

స్పోర్ట్స్

తొలి గంటలోనే..



రెండో టెస్టులో విండీస్‌పై భారత్ ఘన విజయం

రాహుల్ అజేయ అర్ధసెంచరీ ● 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌పై తమ ఆధిపత్యాన్ని భారత జట్టు మరోసారి చాటుకుంది. నాలుగో రోజే ఫలితం తేలిపోయిన రెండో టెస్టులో మంగళవారం గిల్ సేన ఏడు వికెట్ల తేడాతో తమ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేసింది. దీంతోపాటు ఈ రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అలాగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా 12 పాయింట్లను ఖాతాలో వేసుకుని, పట్టికలో ఆసీస్, శ్రీలంక తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. మరోవైపు విండీస్‌పై భారత్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా పదో టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 121 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 35.2 ఓవర్లలో 124/3 స్కోరుతో గెలిచింది. కేఎల్ రాహుల్ (58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించాడు. ఛేజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అయితే ఫాలోఆన్ ఆడినప్పటికీ విండీస్ చూపిన తెగువ క్రీడాభిమానులను ఆకట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248, ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 390 రన్స్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా జడేజా నిలిచారు.


గిల్, రాహుల్

17.2 ఓవర్లలోనే..: 63/1 స్కోరుతో నిలిచిన భారత్ ఆఖరి రోజు 17.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. విజయానికి మరో 58 పరుగుల కోసం బరిలోకి దిగగా క్రీజులో ఉన్న రాహుల్, సుదర్శన్ ఆటను పూర్తి చేస్తారని అంతా భావించినా.. విండీస్ బౌలర్లు మరో రెండు వికెట్లను పడగొట్టగలిగారు. పియెర్ ఓవర్‌లో రాహుల్ 6,4తో వేగం చూపినా.. తర్వాతి ఓవర్‌లోనే సుదర్శన్‌ను ఛేజ్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక వేగంగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో గిల్ 33వ ఓవర్‌లో 6,4 బాదినప్పటికీ అదే ఓవర్‌లో ఛేజ్‌కే దొరికిపోయాడు. కానీ ఆ తర్వాత మరో 14 బంతుల్లోనే రాహుల్, జురెల్ (6 నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్.
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248.
వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390.
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ (నాటౌట్) 58, సాయి సుదర్శన్ (సి) హోప్ (బి) ఛేజ్ 39, గిల్ (సి) గ్రీవ్స్ (బి) ఛేజ్ 13, జురెల్ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 35.2 ఓవర్లలో 124/3; వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0; వారికన్ 15.2-4-39-1, పియెర్ 8-0-35-0, ఛేజ్ 9-2-36-2.

1 ఒకే జట్టు (వెస్టిండీస్)పై వరుసగా ఎక్కువ టెస్టు సిరీస్ (10) విజయాలు సాధించిన జట్టుగా భారత్. దక్షిణాఫ్రికాతో (విండీస్‌పై 10) సంయుక్తంగా నిలిచింది. అలాగే విండీస్‌పై భారత్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా 27వ టెస్టు విజయం.

3 స్వదేశంలో ఎక్కువ (122) టెస్టు మ్యాచ్‌లు గెలిచిన మూడో జట్టుగా భారత్. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) ముందున్నాయి.

పిచ్‌పై భారత్ అసంతృప్తి

భారత జట్టు రెండో టెస్టులో గెలిచినప్పటికీ అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్‌పై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'స్పిన్నర్లు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తారని అందరూ చెబుతుంటారు. కానీ టీమ్‌లో ఇద్దరు అద్భుత పేసర్లు ఉన్నప్పుడు వారికి కూడా పిచ్‌పై సమాన అవకాశం లభించాలి కదా' అని కోచ్ గంభీర్ అన్నాడు.

దేశవాళీలు ఆడడం ఉత్తమం


కోచ్ గంభీర్

రాణాపై ట్రోలింగ్ సిగ్గుచేటు

న్యూఢిల్లీ: రంజీలు ఆడాలని టెస్ట్ స్పెషలిస్టులకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సలహా ఇచ్చాడు. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ నేపథ్యంలో బెంగళూరులోని సీవోఈలో స్కిల్ ట్రైనింగ్‌కు వెళ్లేకంటే.. ఆయా రాష్ట్రాల తరపున రంజీలు ఆడితే మంచి మ్యాచ్ ప్రాక్టీస్ లభిస్తుందని అభిప్రాయపడ్డాడు. వచ్చే నెల 9న బ్రిస్బేన్‌లో భారత్ చివరి టీ20 ఆడనుండగా.. 14న కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. ఇంత తక్కువ సమయంలో ఒక ఫార్మాట్ నుంచి మరో ఫార్మాట్‌కు మారడం కొంత కష్టమైన విషయమేనని టెస్ట్ మ్యాచ్ ముగిసిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో గౌతీ అన్నాడు. ఇక, యంగ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు 2027 వరల్డ్ కప్ ఆడతారా? అని ఎదురైన ప్రశ్నకు ఇప్పుడే ఏమీ చెప్పలేమని గౌతీ సమాధానమిచ్చాడు. పేసర్ హర్షిత్ రాణా ఎంపికను ప్రశ్నించిన మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్‌కి కౌంటర్ ఇచ్చాడు. 'యూట్యూబ్ చానెల్ నడుపుతున్న ఓ వ్యక్తి 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటు. నన్ను టార్గెట్ చేయండి ఎదుర్కొంటా. తన ప్రతిభతోనే జట్టులో స్థానం సంపాదించిన రాణాను గేలి చేయడం అన్యాయ'మని గౌతీ అన్నాడు.

భారత పారా త్రోబాల్ కెప్టెన్‌గా మహేష్



శామీర్‌పేట (ఆంధ్రజ్యోతి): భారత పారా త్రోబాల్ కెప్టెన్‌గా ధీరవత్ మహేష్ నియమితుడయ్యాడు. మేడ్చల్ జిల్లాలోని లింగాపూర్ తండా.. మహేష్ స్వస్థలం. శ్రీలంకలోని రత్నపురాలో వచ్చే డిసెంబరు 6వ తేదీ నుంచి జరిగే దక్షిణాసియా పారా త్రోబాల్ పోటీల్లో భారత జట్టుకు మహేష్ సారథ్యం వహించనున్నాడు.

శ్రీలంక-కివీస్ మ్యాచ్ రద్దు

మహిళల వన్డే వరల్డ్‌కప్

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఇంగ్లండ్ X పాకిస్తాన్

కొలంబో: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో శ్రీలంక-న్యూజిలాండ్ జట్ల మధ్య మంగళవారం నాటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. శ్రీలంక ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండు వర్షంతోనే రద్దు కావడం గమనార్హం. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్‌కు ఎలాంటి ఆటంకం ఎదురుకాలేదు. అలాగే టాపార్డర్ మెరుగ్గా రాణించడంతో 50 ఓవర్లలో 6 వికెట్లకు 258 పరుగులు సాధించింది. నీలాక్షి డిసిల్వా (55 నాటౌట్), ఓపెనర్ చమరి ఆటపట్టు (53) అర్ధసెంచరీలు సాధించగా.. హాసిని (44), విష్మి (42) సహకారం అందించారు. తొలి వికెట్‌కు చమరి, విష్మి 101 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడం విశేషం. అలాగే నీలాక్షి తమ జట్టు తరఫున ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (26 బంతుల్లో) పూర్తి చేసింది. సోఫీ డివైన్‌కు మూడు, బ్రీ లింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం కివీస్ ఇన్నింగ్స్ సమయానికి వర్షం ప్రారంభమైంది. మధ్యలో కాసేపు తెరిపినిచ్చినా ఫలితం లేకపోయింది. ఇక దాదాపు మూడు గంటల నిరీక్షణ తర్వాత రాత్రి 9.15 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక: 50 ఓవర్లలో 258/6 (నీలాక్షి 55, చమరి 53, హాసిని 44, విష్మి 42; డివైన్ 3/54, లింగ్ 2/39).

దీప్తి ఖాతాలో రెండో స్వర్ణం



పర్వతగిరి (వరంగల్-ఆంధ్రజ్యోతి): వరల్డ్ పారా వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి జీవాంజి దీప్తి రెండో స్వర్ణం సాధించింది. మంగళవారం జరిగిన 200 మీటర్ల పరుగులో దీప్తి 24.62 సెకన్లలో సరికొత్త ప్రపంచ రికార్డు టైమింగ్‌తో రేసును పూర్తి పసిడి పతకం కొల్లగొట్టింది. ఇదే పోటీల్లో దీప్తి 400 మీటర్ల పరుగులోను స్వర్ణం సాధించడం తెలిసిందే. వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, కల్లెడ గ్రామం దీప్తి స్వస్థలం.

శేషు, ఆనందికి కాంస్యాలు


శేషు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు క్రీడాకారులు దుడ్డు శేషు, నల్లవెల్లి ఆనంది కాంస్య పతకాలు కొల్లగొట్టారు. భువనేశ్వర్‌లోని కళింగలో నాలుగు రోజులక్రితం మొదలైన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు అండర్-18 విభాగం 200 మీటర్ల పరుగులో విశాఖపట్నం అథ్లెట్ శేషు 22.09 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానం దక్కించుకున్నాడు. అండర్-16 బాలికల 600 మీటర్ల పరుగులో పెద్దపల్లి అమ్మాయి ఆనంది ఒక నిమిషం 34.48 సెకన్లలో రేసును పూర్తి చేసి, తృతీయ స్థానంలో నిలిచింది.

విరాట్ వచ్చేశాడు



న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నాలుగు నెలల విరామానంతరం భారత్ తిరిగొచ్చాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టును విజేతగా నిలబెట్టిన విరాట్.. ఆ లీగ్ ముగిసిన వెంటనే భార్య అనుష్క, ఇద్దరు పిల్లలతో కలిసి లండన్ వెళ్లిపోయాడు. ఇన్నాళ్లూ కుటుంబంతో కలిసి అక్కడే ఉన్న కోహ్లీ, ఈనెల 19 నుంచి ఆస్ట్రేలియాలో జరిగే వన్డే సిరీస్‌కు జట్టుతో కలిసి వెళ్లేందుకు మంగళవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నాడు. రోహిత్, మరికొందరు ఆటగాళ్లతో కలిసి విరాట్ బుధవారం ఢిల్లీ నుంచి పెర్త్ వెళ్లనున్నాడు. కాగా, రెండు బృందాలుగా టీమిండియా సభ్యులు ఆస్ట్రేలియా వెళ్లనున్నట్టు బీసీసీఐ అధికారులు వెల్లడించారు.

ఇండో-పాక్ పోరు డ్రా

● జోహర్ కప్ జూనియర్ హాకీ



జోహర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జోహర్ జూనియర్ కప్‌లో పాకిస్థాన్‌పై గెలిచే అవకాశాన్ని భారత హాకీ జట్టు చేజార్చుకొంది. మంగళవారం ఇండో-పాక్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్ 3-3తో డ్రాగా ముగిసింది. అర్షీత్ సింగ్ (43వ నిమిషం), సౌరభ్ (48వ), మన్‌మీత్ (53వ)తలో గోల్ సాధించగా.. పాక్ తరఫున హన్నన్ (5వ), సుఫియాన్ (39వ, 55వ) గోల్స్ చేశారు. అయితే, **మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడం విశేషం.**

టాప్‌సీడ్.. గుకేశ్

ఫిడే వరల్డ్ కప్ సీడింగ్స్

అర్జున్‌కు 2, ప్రజ్ఞానందకు 3

న్యూఢిల్లీ: గోవాలో ఈనెల 30 నుంచి జరిగే ఫిడే ప్రపంచ కప్‌లో పోటీపడే ఆటగాళ్ల సీడింగ్స్ ఖరారయ్యాయి. ప్రపంచ చాంపియన్ గుకేశ్‌కు టాప్ సీడింగ్ దక్కగా.. తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి రెండో సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక, ప్రజ్ఞానంద మూడో సీడ్, అనీష్ గిరి (నెదర్లాండ్స్) నాలుగో సీడ్, వెస్లీ సో (అమెరికా) ఐదో సీడ్‌గా పోటీపడనున్నారు. ఈ మెగా ఈవెంట్‌లో టాప్-3లో నిలిచిన క్రీడాకారులు వచ్చే ఏడాది జరిగే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తారు.

బిజినెస్

పారిశ్రామికంలోనూ యువ సత్తా

- అండర్ 35 జాబితాలో 155 మంది
- రూ.39 లక్షల కోట్ల సంపద సృష్టి
- 7.67 లక్షల ఉద్యోగాల కల్పన
- అవెండాస్ వెల్త్- హురున్ ఇండియా వెల్లడి



న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగంలోనూ యువత సత్తా చాటుతోంది. వినూత్న వ్యాపారాలతో తనదైన ముద్ర వేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నాటికి 155 మంది యువత వినూత్న వ్యాపారాలతో 44,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.39 లక్షల కోట్లు) సంపద సృష్టించింది. ప్రస్తుత మన జీడీపీలో ఇది దాదాపు 10 శాతానికి సమానం. నాలుగు పదుల వయసు కూడా నిండకుండానే వీరు ఈ సంపద సృష్టించినట్టు మంగళవారం వెలువడిన 'ది అవెండాస్ వెల్త్-హురున్ ఇండియా అండర్ 35 లిస్ట్ 2025' నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో రేజన్ సోలార్‌కు చెందిన హార్దిక్ కొటియా అగ్రస్థానంలో ఉండగా వికాస్ గోయల్ (కుకు ఎఫ్ఎం), మిను మార్గరెట్ (బ్లిస్ క్లబ్), రితేష్ అగర్వాల్ (ఓయో, ప్రిజమ్) ఉన్నారు. అలాగే ఇషా అంబానీ (రిలయన్స్ రిటైల్), కావ్య కళానిధి మారన్ (సన్ టీవీ నెట్‌వర్క్), రితిక మోహన్ (గరుడ ఏరోస్పేస్) కూడా ఈ జాబితాలో ఉన్నారు. కాగా హైదరాబాద్‌కు చెందిన ఈక్వల్ వ్యవస్థాపకుడు కేశవ్ రెడ్డి, అవంతీ ఫీడ్స్‌కు చెందిన అల్లూరి వెంకట సంజీవ్, అశీష్ గోయెంకాలతో పాటు మరో ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. ఈ యువ పారిశ్రామిక దిగ్గజాలందరూ సంపదతో పాటు వ్యవస్థలనూ నిర్మిస్తున్నారని హురున్ ఇండియా నివేదిక కితాబిచ్చింది.,

ఎంపిక ఇలా: ఈ జాబితా ఎంపిక కోసం కొన్ని నిర్దిష్ట ప్రామాణికాలు పాటించారు. తొలి తరం పారిశ్రామికవేత్తలైతే వారు సృష్టించిన కనీస సంపద విలువ ఐదు కోట్ల డాలర్లకు మించి, అదే వారసత్వ కుటుంబ వ్యాపారమైతే 10 కోట్ల డాలర్లకు మించి ఉండాలని ప్రామాణికంగా నిర్ణయించారు. మరోవైపు సంపద సృష్టితో పాటు ఈ యువ పారిశ్రామికవేత్తలు ఉద్యోగాల కల్పనలోనూ ముందున్నారు. ప్రస్తుతం వీరి కంపెనీల్లో 7.67 లక్షల మంది పనిచేస్తున్నట్టు నివేదిక తెలిపింది. ఇందులో ఇషా అంబానీ (33) నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్‌లో అత్యధికంగా 2,47,782 మంది పని చేస్తున్నారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియోలోనూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు.

నివేదిక ఇతర ప్రధాన అంశాలు

- జాబితాలోని 155 మంది 76 శాతం మంది తొలి తరం పారిశ్రామికవేత్తలు
- మొత్తం జాబితాలో 15 మంది యువతులకు చోటు
- 54 యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో బెంగళూరు అగ్రస్థానం
- ఆరుగురు యువ పారిశ్రామికవేత్తలతో హైదరాబాద్‌కు ఐదో స్థానం
- ఇప్పటి వరకు 1,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.68 లక్షల కోట్లు) నిధులు సమీకరించిన యువ పారిశ్రామికవేత్తలు
- ఆర్థిక సేవల రంగం నుంచి ఎక్కువగా యువ (20) పారిశ్రామిక దిగ్గజాలు
- తరువాతి స్థానాల్లో సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసులు, ఎడ్యుకేషన్, ట్రైనింగ్ వ్యాపారాలు

హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు మినీ నవరత్న హోదా

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు మంగళవారం ప్రతిష్ఠాత్మకమైన మినీ నవరత్న హోదా లభించింది. 1941లో ఏర్పాటైన షిప్‌యార్డు భారత నౌకాదళానికి అవసరమైన నౌకలతో పాటు వాణిజ్య నౌకలను కూడా తయారుచేయడంలో అగ్రస్థానంలో నిలిచింది. అయితే ఒకానొక దశలో ప్రైవేట్ షిప్‌యార్డ్‌ల పోటీని తట్టుకొని ఆర్డర్లు సాధించలేక నష్టాల్లో కూరుకుపోయింది. ఆర్థికంగా నిలబెట్టడానికి, వర్క్ ఆర్డర్లు అందించడానికి వీలుగా 2010లో రక్షణ మంత్రిత్వ శాఖకు సంస్థను బదిలీ చేశారు. కేంద్రం మద్దతు లభించినా ఐదేళ్లు అవే సమస్యలు వెంటాడాయి. ఆ తర్వాత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడంతో 2015 నుంచి లాభాల బాట పట్టింది. .

మిధానికి రూ.306 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) తాజాగా రూ.306 కోట్ల ఆర్డర్ సంపాదించింది. దీంతో చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.2,212 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. అయితే ఈ ఆర్డర్ ఏ కంపెనీ నుంచి లభించిందనే విషయాన్ని మిధానీ వెల్లడించలేదు. ఈ ఆర్థిక సంవత్సరం నౌకా, వైమానిక రంగాల నుంచి మరిన్ని ఆర్డర్లు లభించే అవకాశం ఉందని కంపెనీ భావిస్తోంది.

దిగొచ్చిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార, తయారీ వస్తువుల ధరలు తగ్గడంతో సెప్టెంబరు నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 0.13 శాతానికి దిగి వచ్చింది. ఆగస్టులో ఇది 0.52% ఉండగా గత ఏడాది సెప్టెంబరులో 1.91% ఉంది. కూరగాయల ధరలు భారీగా తగ్గడంతో ఆహార వస్తువుల విభాగంలో ప్రతి ద్రవ్యోల్బణం ఆగస్టుతో పోల్చితే 3.06% నుంచి 5.22 శాతానికి చేరిందని డబ్ల్యూపీఐ డేటా తెలియచేస్తోంది. కూరగాయల ధరలైతే 24.41% తగ్గాయి. తయారీ వస్తువుల ధరలు 2.33%, ఇంధనం-పవర్ విభాగంలో ధరలు 2.58% తగ్గాయి. అయితే కీలక ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం 31 నెలల గరిష్ఠ స్థాయి 1.9 శాతానికి చేరింది.

ఈ ఏడాది వృద్ధి 6.6% : ఐఎంఎఫ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వృద్ధి అంచనాను 6.4% నుంచి 6.6 శాతానికి పెంచింది. అమెరికా విభిన్న వస్తువులపై సుంకాలు గణనీయంగా పెంచినప్పటికీ తొలి త్రైమాసికంలో ప్రైవేట్ వినియోగం ప్రభావంతో సాధించిన బలమైన వృద్ధి ఏడాది మొత్తానికి ఆసరాగా నిలుస్తుందని తాజా నివేదికలో స్పష్టం చేసింది. 2025-26 సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8% బలమైన వృద్ధిని నమోదు చేసిన విషయం విదితమే. ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన జీఎస్‌టీ సంస్కరణలతో దేశీయ డిమాండ్ మరింతగా పెరుగుతుందని, అమెరికా టారిఫ్‌ల ప్రతికూల ప్రభావాన్ని ఇది భర్తీ చేస్తుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	530
చిత్తూరు	563	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	119
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	99
కర్నూలు	105	నెల్లూరు	104
విశాఖపట్నం	127	అనంతపురం	104
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,28,350 ▲	1,17,650 ▲	1,98,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,22,000 ▲	1,79,000 ▼
విశాఖపట్నం	1,29,260 ▲	1,14,950 ▲	2,06,000 ▲
రాజమండ్రి	1,28,350 ▲	1,17,650 ▲	1,95,000 ▲
ప్రొద్దుటూరు	1,31,000 ▲	1,20,520 ▲	1,85,000 ▲
ముంబై	1,26,152 ▲	1,15,555 ▲	1,78,100 ▲

టెక్ మహీంద్రా లాభం రూ.1,195 కోట్లు

- క్యూ2లో 4.5 శాతం తగ్గుదల
- రూ.13,995 కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.15 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) టెక్ మహీంద్రా నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.5 శాతం తగ్గి రూ.1,194.5 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి కంపెనీ రూ.1,250 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా, ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో గడించిన రూ.1,141 కోట్ల లాభంతో పోలిస్తే 4.7 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.1 శాతం పెరిగి రూ.13,995 కోట్లకు చేరింది. క్యూ1తో పోలిస్తే రెవెన్యూ 4.8 శాతం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.15 (300 శాతం) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 21 రికార్డు తేదీగా నిర్ణయించింది. వచ్చే నెల 12 లేదా ఆ లోపు డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. మరిన్ని విషయాలు..

- ఆర్థిక అనిశ్చితుల కారణంగా ఈ క్యూ2లో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం 2 శాతానికి పైగా తగ్గిందని, కంపెనీకి కీలకమైన టెలికాం రంగం నుంచి రాబడి 2.5 శాతం తగ్గిందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓ మోహిత్ జోషి తెలిపారు. మాన్యుఫాక్చరింగ్, బీఎఫ్ఎస్ఐ రంగాల ఆదాయం మాత్రం వరుసగా 5.2 శాతం, 6.5 శాతం పెరిగిందన్నారు.
- గడిచిన త్రైమాసికంలో 81.6 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ దక్కించుకున్నట్లు, వార్షిక ప్రాతిపదికన డీల్స్ విలువ 57 శాతం పెరిగిందని కంపెనీ తెలిపింది.
- గత త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,559 తగ్గి 1.52 లక్షలకు పరిమితమైంది.

హెచ్1బీ వీసా ఫీజు పెంపు ప్రభావం పరిమితమే..

అమెరికా ప్రభుత్వం హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం వల్ల కంపెనీపై ప్రభావం చాలా పరిమితంగా ఉండనుందని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి అన్నారు. అమెరికాలో కంపెనీ కోసం పనిచేస్తున్న వారిలో కేవలం ఒక శాతమే హెచ్1బీ వీసాదారులని ఆయన తెలిపారు. కాగా కంపెనీకి అమెరికాయే అతిపెద్ద మార్కెట్. సంస్థ ఆదాయంలో 45 శాతం ఈ మార్కెట్ నుంచే సమకూరుతోంది.

రెండో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 297 పాయింట్లు పతనం

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. మెటల్, ఆటో, ఫార్మా షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ మంగళవారం 297.07 పాయింట్లు కోల్పోయి 82,029.98 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 545 పాయింట్లు పతనమై 82,000 దిగువకు పడిపోయినప్పటికీ, ఆఖర్లో మళ్లీ కాస్త కోలుకుంది. నిఫ్టీ 81.85 పాయింట్ల నష్టంతో 25,145.50 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి మళ్లీ రూ.88.81 వద్ద ముగిసింది. డాలర్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణం.

ఎల్‌జీ బంపర్ లిస్టింగ్

- తొలిరోజే ఇన్వెస్టర్లకు 50% లాభం
- రూ.1.14 లక్షల కోట్లకు కంపెనీ మార్కెట్ విలువ

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు భారీ స్పందన లభించింది. గత వారం ఐపీఓ ముగించుకున్న ఈ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం.. తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,140తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఏకంగా 50.43 శాతం లాభంతో రూ.1,715 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒక దశలో 52.31 శాతం వృద్ధితో రూ.1,736.40 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు ధర 48.23 శాతం లాభంతో రూ.1,689.90 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,14,671.81 కోట్లకు చేరింది.

టాటా మోటార్స్ షేరు 40% పతనమైందా..?

వ్యాపార విభజనలో భాగంగా షేర్ల ధరను సర్దుబాటు చేసిన సంస్థ

టాటా మోటార్స్ షేరు ధర సోమవారం రూ.660.75 వద్ద ముగిసింది. మంగళవారం ఉదయం ఈ షేరు ట్రేడింగ్ రూ.399 వద్ద ఆరంభమైంది. అంటే, ధర అమాంతం 40 శాతం తగ్గింది. ఎందుకంటే, టాటా మోటార్స్ ప్యాసింజర్ (పీవీ), వాణిజ్య వాహన (సీవీ) వ్యాపారాలను రెండు ప్రత్యేక లిస్టెడ్ కంపెనీలుగా విభజించింది. ఈ నెల 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. తదనుగుణంగా కంపెనీ షేర్లలో సర్దుబాటు మంగళవారం చోటు చేసుకుంది. ఈ సర్దుబాటులో భాగంగా ప్యాసింజర్ వాహన వ్యాపారంతో కూడిన టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్ లిమిటెడ్ (టీఎంపీవీఎల్) షేరు ధరను రూ.400గా గంటపాటు నిర్వహించిన ప్రత్యేక ప్రీ-మార్కెట్ సెషన్ ద్వారా నిర్ణయించారు. దాంతో రూ.399 వద్ద ట్రేడింగ్ ఆరంభించిన ఈ షేరు ఒక దశలో రూ.421 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి రూ.395.50 వద్ద ముగిసింది. కాగా వ్యాపార విభజన ప్రణాళికలో భాగంగా, మంగళవారం నాటికి టాటా మోటార్స్ షేర్లు కలిగిన ఇన్వెస్టర్లకు. తాము కలిగి ఉన్న ఒక్కో షేరుకు గాను ఒక టీఎంఎల్‌సీవీ షేరును సంస్థ కేటాయించనుంది. తద్వారా రెండు లిస్టెడ్ కంపెనీల స్టాక్స్ లభించనున్నాయి. అయితే, టీఎంఎల్‌సీవీ షేర్లను లిస్ట్ చేసేందుకు మరో 4-6 వారాలు పట్టవచ్చు.

రేపే 'ఈశాన్యం' రాక!

19న బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోకి ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. అలాగే, నైరుతి రుతుపవనాలు నిష్క్రమించే సమయం ఆసన్నమైంది. మంగళవారం ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వైదొలిగాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి గురువారం నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించనున్నాయి. అదే సమయంలో దక్షిణ భారతదేశంలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కాగా, మంగళవారమే ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతంలోకి ప్రవేశించాయని కొందరు వెదర్‌మెన్ ప్రకటించారు. కాగా, నైరుతి బంగాళాఖాతంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి అరేబియా సముద్రంలో ప్రవేశించనుంది. దీని ప్రభావంతో అరేబియా సముద్రంలో ఈ నెల 19న అల్పపీడనం ఏర్పడుతుంది. దీంతో 19 నుంచి తమిళనాడు, కోస్తాంధ్ర, సీమల్లో వర్షాలు పెరుగుతాయని వాతావరణశాఖ అంచనా వేసింది. బుధవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో వర్షాలు పడతాయని పేర్కొంది.



యూకే హౌస్ ఆఫ్ కామన్స్ ప్రిన్సిపల్ డిప్యూటీ స్పీకర్ నుస్రత్ ఘనీతో సమావేశమైన ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర

ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం ముఖ్యం

- రాజ్యాంగాన్ని విస్మరిస్తే ప్రజలు సహించరు
- యూకే ఎగువ, దిగువ సభల డిప్యూటీ స్పీకర్లతో సమావేశమైన స్పీకర్ అయ్యన్న

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు యూకే పార్లమెంట్‌కు చెందిన హౌస్ ఆఫ్ లార్డ్స్, హౌస్ ఆఫ్ కామన్స్ ఉప సభాపతులతో చట్టసభల పనితీరుకు సంబంధించిన అనేక కీలక అంశాలపై చర్చించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్యాలెస్ ఆఫ్ వెస్ట్ మినిస్టర్(యూకే పార్లమెంట్ హౌస్)లో పర్యటించారు. బార్బడోస్‌లో 68వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సదస్సు ముగిసిన తర్వాత లండన్ అధ్యయన పర్యటనలో స్పీకర్ పాల్గొన్నారు. యూకే పార్లమెంటు ఎగువ సభ సీనియర్ డిప్యూటీ స్పీకర్ లార్డ్ గార్డినర్ ఆఫ్ కింబల్‌తో సమావేశామయ్యారు. ఈ సందర్భంగా యూకే పార్లమెంటులో కమిటీ వ్యవస్థ పనితీరు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. చట్టసభల ద్వారా ప్రజలకు ప్రభుత్వ జవాబుదారీతనం, అదేవిధంగా ఎన్నుకున్న ప్రజల పట్ల ప్రజాప్రతినిధుల జవాబుదారీతనం ప్రజాస్వామ్యంలో ఎంతో ముఖ్యమని వారిద్దరూ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా లార్డ్ గార్డినర్ ఆఫ్ కింబల్ మాట్లాడుతూ... భారత ప్రజాస్వామ్య గొప్పతనాన్ని మెచ్చుకున్నారు. ఏపీ నూతన రాజధాని అమరావతి నిర్మాణంలో ఒక బ్రిటీష్ సంస్థ కూడా పాలుపంచుకుంటుందని అయ్యన్న పాత్రుడు చెప్పడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం అయ్యన్న హౌస్ ఆఫ్ కామన్స్(యూకే పార్లమెంట్ దిగువ సభ) ప్రిన్సిపల్ డిప్యూటీ స్పీకర్ నుస్రత్ ఘనీతో సమావేశమయ్యారు. శాసనపరమైన విధానాలు, ప్రజలకు సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహించడంలో చట్ట సభసభ్యుల పాత్రకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు జడ్జీలు వెనక్కి!

జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ డి.రమేశ్ తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ

కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుభేందు సమంత కూడా

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి గతంలో బదిలీ అయిన న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ డి.రమేశ్ తిరిగి రాష్ట్ర హైకోర్టుకు వస్తున్నారు. ప్రస్తుతం గుజరాత్ హైకోర్టులో ఉన్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను, అలహాబాద్ హైకోర్టులో ఉన్న జస్టిస్ రమేశ్‌ను మాతృ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది ఆగస్టు 24న కేంద్రప్రభుత్వానికి చేసిన సిఫారసుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో ఇందుకు సంబంధించి కేంద్ర న్యాయ శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే ప్రస్తుతం కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ సుభేందు సమంతను కూడా ఏపీ హైకోర్టుకు బదిలీ చేశారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ 2019 జూన్ 20న, జస్టిస్ రమేశ్ 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టారు. బదిలీపై జస్టిస్ రమేశ్ 2023 జూలై 24న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టగా.. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ 2023 నవంబరు 2న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా వెళ్లారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉంది. అదనపు న్యాయమూర్తులతో కలిపి ప్రస్తుతం 30 మంది ఉన్నారు. పై ముగ్గురి రాకతో జడ్జీల సంఖ్య 33కి చేరనుంది.

జస్టిస్ రాయ్.. ఏపీ హైకోర్టుకు తొలి న్యాయమూర్తి

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ స్వగ్రామం విజయనగరం జిల్లా పార్వతీపురం. ఆయన 1964 మే 21న చీకటి నరహరిరావు, విజయలక్ష్మి దంపతులకు జన్మించారు. సంప్రదాయ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన విశాఖపట్నంలోని ఎంవీపీ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1988 జూలైలో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 1988 నుంచి 2002 వరకు పార్వతీపురం, విజయనగరంలో ప్రాక్టీసు చేశారు. 2002లో రాష్ట్ర ఉన్నత న్యాయ సర్వీసులో జిల్లా సెషన్స్ జడ్జి(గ్రేడ్-2)గా ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ కోర్టుల్లో న్యాయాధికారిగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించారు. అమరావతిలో ఏపీ హైకోర్టును నెలకొల్పాక 2019 జనవరి 1 నుంచి జూన్ 20న హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందే వరకు ఏపీ హైకోర్టు మొదటి రిజిస్ట్రార్ జనరల్‌గా సేవలు అందించారు. ఏపీ హైకోర్టు ఏర్పాటైన తర్వాత నియమితులైన మొదటి న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్.

జస్టిస్ రమేశ్.. ప్రభుత్వ న్యాయవాదిగా..

జస్టిస్ డి.రమేశ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె సమీపంలోని కమ్మపల్లి గ్రామంలో 1965 జూన్ 27న డీవీ నారాయణనాయుడు, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2000-2004 నడుమ ప్రభుత్వ న్యాయవాదిగా.. 2007లో ఏపీ సర్వశిక్ష అభియాన్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జూలై 24న అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఇప్పుడు తిరిగి మాతృ హైకోర్టుకు వస్తున్నారు.

జస్టిస్ సుభేందు.. దీర్ఘకాలం జిల్లా న్యాయాధికారిగా..

జస్టిస్ సుభేందు సమంత 1971 నవంబరు 25న జన్మించారు. కలకత్తా యూనివర్సిటీ హజ్రా క్యాంపస్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. తమ్లుక్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అనంతరం న్యాయాధికారిగా ఎంపికయ్యారు. పశ్చిమ మిద్నపూర్‌లో అదనపు జిల్లా-సెషన్స్ జడ్జిగా, కలకత్తా సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జిగా, బీర్‌భూం, నదియా జిల్లాలకు జిల్లా-సెషన్స్ జడ్జిగా పనిచేశారు. కలకత్తా సిటీ సెషన్స్ కోర్టు చీఫ్ జడ్జిగా పనిచేశారు. అండమాన్ నికోబార్‌లో జిల్లా సెషన్స్ జడ్జిగానూ సేవలు అందించారు. 2022 మే 18న కలకత్తా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, ఈ ఏడాది ఏప్రిల్ 28న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన రికార్డులతో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్

పరకామణి 'రికార్డులు' సీజ్ చేసిన సీఐడీ

హైకోర్టు ఆగ్రహంతో వేగం పెంచిన దర్యాప్తు సంస్థ

ఆధారాలు అందజేసిన బోర్డు సభ్యుడు భానుప్రకాశ్

తిరుమల, తిరుపతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో పరకామణి దొంగతనం కేసులో సీఐడీ బృందం వేగం పెంచింది. ఈ కేసుకు సంబంధించిన సీడీ ఫైల్స్, రికార్డులను తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసి స్వాధీన పరుచుకుంది. పరకామణిలో విస్తృత తనిఖీలు నిర్వహించింది. పరకామణిలో డాలర్ల చోరీకి సంబంధించిన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి, కేసును సీఐడీకి అప్పగించిన విషయం తెలిసిందే. అయితే కేసు విచారణలో సీఐడీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు ఆగమేఘాలపై సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు.

ఉదయం 7 గంటల నుంచే...

సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్, న్యాయ సలహాదారు లక్ష్మణరావు, ఎస్పీ సుబ్బరాయుడు కలసి మంగళవారం ఉదయం 7 గంటల నుంచే విచారణ మొదలుపెట్టారు. తొలత టీటీడీ విజిలెన్స్, పోలీసులతో పోలీసు అతిథి గృహంలో సమీక్షించారు. దొంగతనాన్ని పసిగట్టిన సెక్యూరిటీ గార్డు చంద్రను విచారించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అంతకుముందు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి పరకామణి కేసుకు సంబంధించిన పలు ఆధారాలను డీజీకి అందజేశారు. అనంతరం తిరుమలలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఈ కేసుకు సంబంధించిన సీడీ ఫైల్స్, రికార్డులను, లోక్‌అదాలత్ ప్రొసీడింగ్స్‌ను స్వాధీన పరుచుకుని సీజ్ చేశారు. తర్వాత తిరుమలలోని నూతన పరకామణి భవనానికి చేరుకుని నిబంధనల ప్రకారం పంచె, బనియన్ ధరించి కానుకల విభజన, లెక్కింపులను పరిశీలించారు. సిబ్బంది తనిఖీ విధానాన్ని స్వయంగా వీక్షించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సీసీ కెమెరాల ప్రస్తుత ఫుటేజ్‌ను పరిశీలించారు. పరకామణి దొంగతనానికి సంబంధించి ఇంకా ఏదైనా ఫుటేజ్ ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకున్న సీఐడీ బృందం సెకండ్ ఏడీఎం కోర్టుకు వెళ్లి న్యాయాధికారిని కలసి మాట్లాడారు. తిరుమల వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో రవికుమార్‌పై నమోదైన కేసుకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు కావాలని కోరుతూ మెమో దాఖలు చేశారు. లోక్‌అదాలత్‌లో కేసు రాజీకి సంబంధించిన రికార్డులూ కావాలని అడిగారు. అక్కడ్నుంచి టీటీడీ పరిపాలనా భవనానికి చేరుకుని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో సమావేశమయ్యారు. పరకామణి చోరీ ఘటనకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు కావాలని తిరుపతి సీఐడీ అధికారులు లిఖితపూర్వకంగా కోరారు. అలాగే టీటీడీ పరిపాలనా భవనంలో పరకామణి చోరీ జరిగినప్పటి రోజుల సీసీ కెమెరాల ఫుటేజీలు కావాలని అడిగారు. రోజంతా తనిఖీలు చేసి సుమారు 60 నుంచి 70 ఫైళ్లు, రికార్డులు స్వాధీనం చేసుకుని వెంట తీసుకెళ్లారు.

రేపు హైకోర్టుకు సమర్పిస్తాం

శ్రీవారి పరకామణి కేసుకు సంబంధించి తాము సీజ్ చేసిన టీటీడీ బోర్డు తీర్మానాలు, లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకున్న ప్రొసీడింగ్స్, కోర్టులోని డాక్యుమెంట్లు, పోలీస్ స్టేషన్‌లోని ఫైల్స్, రికార్డులను బుధవారం హైకోర్టుకు సమర్పిస్తామని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్ తెలిపారు. 'మేం ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టలేదు. రికార్డులను మాత్రం సీజ్ చేశాం. వాటిని హైకోర్టుకు సమర్పిస్తాం' అని తెలిపారు.

సీసీ పుటేజీను ఎందుకు తొలగించారు?: భానుప్రకాశ్‌రెడ్డి

తిరుమల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి పరకామణిలో భారీగా దొంగతనం జరిగితే ఆ పుటేజ్ ఎందుకు లేదు? ఎవరు తొలగించారు? ఎవరు తొలగించమన్నారు? వంటి ప్రశ్నలు భక్తుల నుంచి వస్తున్నాయి' అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. తిరుమలలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌లో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే ఈ కేసుకు సంబంధించిన వ్యక్తులు, శక్తులు, వాటాదారులు, సూత్రధారుల వివరాలన్నీ భక్తుల ముందుకు వస్తాయనే నమ్మకం ఉందన్నారు. ఎవరు వాటాలు వేసుకున్నారు? దొంగతనం చేసిన రవికుమార్‌ను ఎవరు కాపాడారు? అతని ఆస్తులు ఎవరు పంచుకున్నారు?... అన్నీ వెలుగులోకి వస్తాయన్నారు. పరకామణి దొంగలు ఎవరు తప్పించుకునే అవకాశమే లేదన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఎమ్‌టీవీ మ్యూజిక్ ఛానల్ మూసివేత

సంగీత ప్రియుల్ని, ముఖ్యంగా యువతను విశేషంగా ఆకట్టుకున్న ప్రముఖ టీవీ ఛానల్ ఎమ్‌టీవీ ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. తమ సంస్థ ఎమ్‌టీవీ పారామౌంట్ గ్లోబల్ ద్వారా నలభయ్యేళ్లకు పైగా సంగీత ప్రసారాలను అందించిన అనుబంధ ఛానళ్లను మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. 'ఎమ్‌టీవీ మ్యూజిక్', 'ఎమ్‌టీవీ 80స్', 'క్లబ్ ఎమ్‌టీవీ', 'ఎమ్‌టీవీ 90స్'. 'ఎమ్‌టీవీ లైవ్' సంగీత ఛానళ్లను మూసివేస్తున్నట్లు వెల్లడించింది. డిసెంబరు 31 తర్వాత ఆ ఛానళ్లు అందుబాటులో ఉండవని పేర్కొంది. అయితే, రియాలిటీ షోలను అందించే ఎమ్‌టీవీ హెచ్‌డీ మాత్రం యధావిధిగా కొనసాగుతుందని తెలిపింది. స్మార్ట్ ఫోన్ వచ్చాక ఈ ఛానళ్లకు ఆదరణ తగ్గడం, యూట్యూబ్, టిక్‌టాక్, స్పాటిఫై వంటి సంగీతం అందించే యాప్స్‌తో పోటీపడలేకపోవడం ఈ నిర్ణయానికి కారణం అని తెలుస్తోంది. అయితే, ఇటీవలే ఎమ్‌టీవీ పారామౌంట్ గ్లోబల్ సంస్థ, స్కై డాన్స్ మీడియాతో విలీనమైంది. 1981లో అమెరికాలో ఎమ్‌టీవీని స్థాపించారు.



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయికగా నటిస్తున్నారు. వీటీవి గణేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైమెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మితా కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు, టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' ప్రోమో సూపర్ హిట్టైంది. మంగళవారం పూర్తి పాటను విడుదల చేశారు మేకర్స్. ఇందులో మెగాస్టార్ వేసిన స్టైలిష్ స్టెప్పులు వింటేజ్ చిరును గుర్తుకు తెస్తున్నాయంటూ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. విజువల్స్ ఆకట్టుకున్నాయి. లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలిచింది. విజయ్ పొలాకి కొరియోగ్రఫీ అందించగా, భాస్కరభట్ల ఈ మెలోడీని రాశారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ ఆలపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి.

విజయం ఖాయం

- రాజేశ్ దండా, శివ బొమ్మక్



'గతేడాది దీపావళికి కిరణ్ అబ్బవరం 'క' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ దీపావళికి అంతకు మించిన విజయాన్ని మా 'కె-ర్యాంప్' చిత్రం అందిస్తుంది' అని నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మక్ అన్నారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకుడు. ఈనెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాజేశ్, శివ మీడియాతో ముచ్చటించారు.' నాని చెప్పిన కథ కిరణ్‌కూ, నాకూ బాగా నచ్చింది. ఇందులో హీరో పాత్ర పేరు కుమార్. తొలుత 'కుమార్ ర్యాంప్' అనే టైటిల్ పెడదాం అనుకున్నాం. తర్వాత దాన్ని కుదించి 'కె - ర్యాంప్' అని పెట్టాం. టైటిల్ బూతు అర్థం ధ్వనించేలా ఉందంటే అది చూసేవారి దృష్టికోణాన్ని బట్టే ఉంటుంది. మా హీరో, దర్శకుడు ఇద్దరూ ముందస్తుగా సన్నద్ధమై ఉండడంతో చాలా తక్కువ సమయంలో సినిమా చిత్రీకరణ పూర్తి చేసి, విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.



కబడ్డీ నేపథ్యంలో..

తమిళ హీరో విక్రమ్ తనయుడు విక్రమ్ ధృవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'బైసన్'. దర్శకుడు పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించాయి. మారి సెల్వరాజ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఈనెల 24న జగదంబే ఫిల్మ్స్ పతాకంపై నిర్మాత బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. హీరో రానా 'బైసన్' చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. 1990 నాటి బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో కబడ్డీ క్రీడ కథాంశంతో తెరకెక్కిన చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.

సరికొత్త అనుభూతిని ఇస్తుంది

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' చిత్రంలో నా పాత్ర తాలూకు వ్యక్తిత్వం ప్రేక్షకులను షాక్‌కు గురి చేస్తుంది. తన ఆలోచనలు విప్లవాత్మకంగా ఉంటాయి. కచ్చితంగా నా పాత్ర ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఇదొక ప్రేమకథా చిత్రమే అయినా ఈ సినిమాలో 80 శాతం సన్నివేశాలు కొత్తగా ఉంటాయి. గతంలో మీరు ఏ సినిమాలోనూ చూసుండరు" అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. ఆయన కథానాయకుడిగా నీరజ కోన దర్శకత్వం వహించిన చిత్రమిది. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సిద్ధు మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- టిల్లూకు పూర్తి భిన్నంగా సాగే పాత్రను ఈ చిత్రంతో చేశాను. ఈ కాలంలో కథ కన్నా పాత్ర చిత్రణ కొత్తగా ఉంటేనే ప్రేక్షకులకు వినోదం ఇస్తోంది. అందుకే ఆ దిశగా చాలా కసరత్తు చేశాం. ఈ సినిమా రిలీజయ్యాక ఈ తరహా చిత్రాలతో ఒక ప్రత్యేకమైన జానర్ ఏర్పడుతుందేమో అనిపిస్తోంది.
- దర్శకురాలు చెప్పిన పాయింట్ కొత్తగా ఉండడంతో నేను ఈ సినిమా అంగీకరించాను. జీవితం, ప్రేమలోని కోణాలను సరికొత్తగా పరిచయం చేస్తుంది. కామెడీ ఉంది. ప్రేమ, జీవితం గురించి వచ్చే లోతైన సంభాషణలు గుర్తుండిపోతాయి.
- ద్వితీయార్థంలో రాశీ ఖన్నా పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. జ్ఞానశేఖర్ గారి విజువల్స్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. తమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు. ఈ సినిమా సక్సెస్ అయితే అందులో సింహభాగం ఎడిటర్ నవీన్ నూలీకే దక్కుతుంది. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ గారితో నాకు మంచి అనుబంధం ఉంది. నాకు చాలా స్వేచ్ఛ ఇస్తారు. దేనికీ వెనుకడుగు వేయరు. మంచి కథ కుదిరితే రవితేజ గారితో ఓ చిత్రం చేయాలనుంది.



డయాఫ్రం వాల్ వద్ద గైడ్‌వాల్ తొలగిస్తున్న పొక్లయిన్

ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి సన్నాహాలు

» డయాఫ్రం వాల్ ప్యానెళ్ల వద్ద గైడ్‌వాల్స్ తొలగింపు

పోలవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అతి కీలకమైన రాతి మట్టి డ్యాం.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. డయాఫ్రం వాల్‌లో పది ప్యానెళ్లకు ఇరువైపులా నిర్మించిన గైడ్‌వాల్స్‌ను ఇప్పటికే తొలగించారు. కొన్ని చోట్ల అవసరానికి మించి పైకి నిర్మించిన గోడను మిగిలిన ఎత్తుకు సమానంగా తొలగించి ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి అనువుగా సిద్ధం చేస్తున్నారు. వాల్‌కు సంబంధించి 373 ప్యానెళ్లకు గాను మంగళవారం నాటికి 190 ప్యానెళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 183 ప్యానెళ్లు కట్టాల్సి ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి 1,397 మీటర్ల మేర డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన ట్రెంచ్ కట్టర్ యంత్ర పరికరాలను ఉంచేందుకు ఆ ప్రాంతంలో గైడ్‌వాల్‌ను నిర్మించి ప్లాట్‌ఫాం సిద్ధం చేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం డ్రాయింగ్, డిజైన్లకు కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు రావలసి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు, జలవనరుల శాఖ ప్రణాళికలకు అనుగుణంగా పనులు వేగవంతం చేస్తున్నట్లు ఎస్ఈ రామచంద్రరావు తెలిపారు.

పట్టణాల్లో 5 తాగునీటి ప్రాజెక్టులకు నిధులు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు పట్టణ తాగునీటి సరఫరా, పారిశుధ్యం ప్రాజెక్టులకు రూ.198.94 కోట్లు మంజూరు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ) ఆధ్వర్యంలో ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. యూఐడీఎఫ్ ప్రాజెక్టు కోసం రూ.142.15 కోట్లు రుణం కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.31.34 కోట్లు, పట్టణ స్థానిక సంస్థల వాటా రూ.25.45 కోట్లతో కలిపి మొత్తం రూ.198.94 కోట్లు ఈ ప్రాజెక్టు కోసం వ్యయం చేయనున్నారు.

అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్లు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన భూములు కేటాయింపుపై సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారాలిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మందడంలో విజయ్ ఆగ్రో ప్రొడక్ట్స్ లిమిటెడ్‌తో కలిసి జీవీ ఎస్టేట్స్ అండ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, మాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లు, తుళ్లూరులో ఓం శ్రీ భావనసాయి అసోసియేట్ ఎల్ఎల్‌పీ, లింగాయపాలెంలో వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కన్వెన్షన్ సెంటర్లు నిర్మించేందుకు బిడ్స్ దక్కించుకున్నాయి. ఒక్కో కన్వెన్షన్ సెంటర్‌కు 2.50 ఎకరాల చొప్పున భూమి కేటాయిస్తున్నారు.

రాజ్‌భవన్ నిర్మాణానికి రూ.212 కోట్లు మంజూరు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాజ్‌భవన్ నిర్మాణానికి రూ.212.22 కోట్లు మంజూరుచేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 8న జరిగిన సీఆర్‌డీఏ 53వ అథారిటీ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ రెసిడెన్స్ కాంప్లెక్స్‌లో గవర్నర్ నివాస సముదాయం, సమావేశ మందిరం, గవర్నర్ కార్యాలయం, రెండు అతిథి గృహాలు, ఆరు ఆఫీసు క్వార్టర్ల నిర్మాణాలు చేపట్టనున్నారు.

కొలిక్కిరాని చర్చలు!

» కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల పట్టు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల యాజమాన్యంతో ఉద్యోగుల చర్చలు మంగళవారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. అయినా చర్చలు కొలిక్కి రాలేదు. తమ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సరైన రీతిలో స్పందించడంలేదని పేర్కొంటూ బుధవారం ఉదయం 6 గంటల నుంచి సమ్మెకు వెళతామని విద్యుత్ ఉద్యోగులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ విడత ఉద్యోగులతో చర్చలు జరిపిన యాజమాన్యం మంగళవారం మరో విడత చర్చలకు ఆహ్వానించింది. మధ్యాహ్నం నుంచి పలు విడతలుగా అర్ధరాత్రి వరకూ చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఉద్యోగులు పట్టుబడుతుండటంతో చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది.

ఎస్టీ హాస్టళ్లలో మంచినీళ్లు కూడా లేవు: వైసీపీ

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీలో గిరిజన హాస్టళ్లలో మంచినీళ్లు కూడా ఉండడం లేదని వైసీపీ ఎంపీ తనూజా రాణి ఆరోపించారు. కలుషిత నీరు తాగి 170 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురైన విషయంపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు వైసీపీ ఫిర్యాదు చేసింది. అనంతరం ఎంపీ తనూజా రాణి మాట్లాడుతూ... 'ఎస్టీ విద్యార్థులకు చివరికి మంచినీళ్లూ ఇవ్వకపోతే ఎలా? చనిపోయిన గిరిజన విద్యార్థుల ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలి' అని డిమాండ్ చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రులు పుష్ప శ్రీవాణి, రాజన్న మాట్లాడుతూ... ఇద్దరు విద్యార్థులు చనిపోతే, ఇప్పటి వరకు కనీస స్పందన లేదని విమర్శించారు.

రబీ నుంచి సులభతరంగా యూరియా పంపిణీ

» వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజిర్ జిలానీ వెల్లడి

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ నుంచి యూరియా పంపిణీని సులభతరం చేస్తామని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వివిధ విభాగాధిపతులతో అనేక అంశాలపై సమీక్ష జరిపారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, డ్రోన్లతో నానో యూరియా, పురుగు మందుల పిచికారీ విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్ ఈ-పంట నమోదు, రబీ నుంచి ఎరువుల పంపిణీకి ప్రత్యేకంగా రూపొందిస్తున్న సాఫ్ట్‌వేర్ పని విధానాన్ని ఆరా తీశారు. ఎరువుల నిల్వలు, సరఫరాను రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తామన్నారు. పంటల బీమా అమలులో దిగుబడులను నిర్ధారించే పంట కోత ప్రయోగాలను నిర్దేశిత సమయంలో చేపట్టాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామని చెప్పారు.

కన్న తండ్రిని గోతిలో పడేసి పోయారు!

» దసరా సమయంలో వదిలించుకున్న కొడుకులు

» ఆశ్రయం కల్పించిన రెడ్ క్రాస్ సిబ్బంది

పెదవాల్తేరు (విశాఖపట్నం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కనిపెంచిన కన్నతండ్రి పట్ల కొడుకులే నిర్దయగా ప్రవర్తించారు. ఏడుపదుల వయస్సు తండ్రిని వదిలించుకునే క్రమంలో.. సినిమా షూటింగ్ చూపిస్తామంటూ ఆయన నగరానికి తీసుకువచ్చి రహదారి పక్కన గోతిలో పడేసి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రెడ్‌క్రాస్ సిబ్బంది ఆయనకు ఆశ్రయం కల్పించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన నందమూడు భాస్కరరావు (70), దమయంతి దంపతులకు ముగ్గురు కుమారులు. దసరా సమయంలో సినిమా షూటింగ్ చూపిస్తామంటూ తండ్రిని విశాఖ నగరానికి తీసుకొచ్చారు. అగనంపూడి సమీపంలోని శనివాడ-స్టీల్‌ప్లాంటు రహదారి పక్కన పెద్దగోతిలో పడేసి వెళ్లిపోయారు. భోజనం లేక ఆకలితో నిస్సహాయ స్థితిలో ఉన్న ఆయన్ను స్థానికులు గుర్తించి, గోతిలో నుంచి తీసి ఆహారం అందించారు. ఈ విషయాన్ని సింధు ప్రియ అనే మహిళ పెదవాల్తేరులోని ఉన్న రెడ్ క్రాస్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని వృద్ధుడిని షెల్టర్‌లెస్ హోమ్‌కు తరలించారు.



విశాఖ రెడ్‌క్రాస్‌లో ఆశ్రయం పొందుతున్న నందమూడు భాస్కరరావు

కర్నూలులో 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్'

- భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని
- 13,429 కోట్లతో చేపట్టే 16 ప్రాజెక్టులకు శంకుస్థాపన
- మంత్రుల పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లు
- రేపు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీశైలానికి రాకపోకలు బంద్





సభాస్థలం వద్ద ఏర్పాట్లు, ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రులు, కూటమి నేతలు

రేపు రాష్ట్రానికి ప్రధాని మోదీ

శ్రీశైల జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాల దర్శనం

కర్నూలు/ శ్రీశైలం/ న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. ఢిల్లీ నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలం చేరుకుంటారు. జ్యోతిర్లింగం, శక్తిపీఠం క్షేత్రాలను దర్శించుకుంటారు. మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. శ్రీశైలంలోని ఘంటా మఠంలో పురావస్తు శాఖ ప్రదర్శించిన 21 సెట్ల తామ్ర శాసనాలను, 53 రాగి రేకులను, నాణేలను తిలకిస్తారు. ఆ తర్వాత ప్రత్యేక హెలికాప్టర్‌లో కర్నూలు నగర శివారున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగమయూరి గ్రీన్‌హిల్స్‌కు చేరుకుంటారు. అక్కడ 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు రూ.13,429 కోట్లతో నిర్మించనున్న 16 ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. దేశంలోనే జీఎస్టీ-2.0పై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న తొలి సభ ఇది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కూటమి పార్టీల ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సభకు 3 లక్షల మందికి పైగా హాజరయ్యేలా పక్కా ప్రణాళికతో, భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

అందరూ కర్నూలులోనే...

రాష్ట్రంలో మంత్రివర్గం మొత్తం కర్నూలులో మకాం వేసింది. దాదాపు వంద మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రాయలసీమ జిల్లాలు సహా ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, టీడీపీ ముఖ్య నేతలు తమకు కేటాయించిన బాధ్యతల్లో నిమగ్నమయ్యారు. మంగళవారం మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్, వంగలపుడి అనిత, రాంప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసమీకరణ కోసం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై నియోజకవర్గం నుంచి సభా ప్రాంగణానికి జనాలను ఎలా చేర్చాలి, ఆహారం, తాగునీరు సరఫరా వంటి ఏర్పాట్లపై సమీక్షించారు. కాగా, ఏర్పాట్లపై కూటమి నేతలకు పవన్ కల్యాణ్, లోకేశ్ కాన్ఫరెన్స్ కాల్ ద్వారా సూచనలు చేశారు. అలాగే పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, కర్నూలు కలెక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

సమష్టిగా ప్రధాని సభను జయప్రదం చేద్దాం

ప్రధాని మోదీ పర్యటనను జయప్రదం చేయాలని మంత్రులు, టీడీపీ, బీజేపీ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. కర్నూలులోని ప్రభుత్వ అతిథి గృహంలో భారీ జన సమీకరణపై కర్నూలు, నంద్యాల జిల్లాల కూటమి పార్టీల ముఖ్య నాయకులతో మంత్రులు సమావేశం నిర్వహించారు. సభా ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. సభకు 4 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూం ద్వారా వాహనాల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు సీమ ప్రజలు ఎంతో ఉత్సాహంతో ఉన్నారన్నారు.

ప్రధాని పర్యటనలో ప్రత్యేక నిఘా: డీజీపీ

నల్లమల అడవుల్లోని శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పటిష్ఠమైన నిఘా ఉంచినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటికే అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టామన్నారు. కేంద్ర బలగాలతో కూంబింగ్ చేశామన్నారు. మంగళవారం శ్రీశైలానికి చేరుకున్న డీజీపీ ప్రధాని పర్యటన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు ఈగల్ చీఫ్ రవికృష్ణ, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, తదితర ఐపీఎస్‌లతో ఆయన సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఇదిలా ఉండగా ప్రధాని పర్యటన నేపథ్యంలో సున్నిపెంటకు మంగళవారం హెలికాప్టర్లతో ట్రయల్ రన్ నిర్వహించారు. పీఎం భద్రతకు సంబంధించిన ప్రత్యేక బలగాలు, అధికారులు ట్రయల్‌ను పరిశీలించారు.

ప్రధాని శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు ఇవే..

- రూ.2,280 కోట్ల పెట్టుబడితో నిర్మించిన విద్యుత్ ప్రసార వ్యవస్థ.
- రూ.4,920 కోట్లతో ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్కులు.
- రూ. 1200 కోట్ల మేరకు వివిధ జాతీయ రైల్వే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.
- గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన రూ.1730 కోట్లతో నిర్మించిన శ్రీకాకుళం-అంగుల్ జాతీయ గ్యాస్ పైప్‌లైన్.
- చిత్తూరులో ఐవోసీకి చెందిన ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్.
- ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ పరిధిలో పాలకొలను, చింతలపల్లి, కొమ్మురోలు గ్రామాలోని 340 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వేర్వేరు విభాగాల్లో దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని, తద్వారా 8-10 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏపీఐఐసీ అధికారులు అంచనా వేస్తున్నారు. కీలకమైన 'ఓర్వకల్లు డ్రోన్ సిటీ' నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేయబోతున్నారు.
- కర్నూలు పీఎస్-3 వద్ద పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం రూ.2,886 కోట్లతో అదనపు పవర్ గ్రిడ్ నిర్మాణం కోసం మోదీ పునాది రాయి వేయనున్నారు.

1,800 మంది పోలీసులతో బందోబస్తు: ఎస్పీ సునీల్

శ్రీశైలంలో ప్రధాని పర్యటనకు సంబంధించి 1,800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని అతిథిగృహంలో ఏర్పాటు చేసిన పోలీసుల అధికారుల సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. గురువారం ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆరోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీశైలానికి రాకపోకలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు

2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్

హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద రూ.2,786 కోట్లతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి కేంద్రం ముందుకొచ్చింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఇప్పటికే టెండర్లు కూడా పూర్తి చేశారు. ఇక్కడ నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాల తయారీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమల ఏర్పాటుపై నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. వీటిద్వారా రూ.12వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని లక్ష్యం. ఈ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. కడప జిల్లాలో 3,157 ఎకరాల్లో రూ.2,894.94కోట్లతో అభివృద్ధి చేయనున్న కొప్పర్తి పారిశ్రామిక పార్కుకు కూడా ఆయన శంకుస్థాపన చేస్తారు.

చిత్తడి నేలల సంరక్షణతో పర్యాటకాభివృద్ధి



స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ భేటీలో డిప్యూటీ సీఎం పవన్

» రాష్ట్రవ్యాప్తంగా 23,450 చిత్తడి నేలలు

» స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ భేటీలో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని.. చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ, సంరక్షణకు శ్రీకారం చుట్టినట్లు ఉపముఖ్యమంత్రి, అటవీ, పరావరణశాఖ మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన స్టేట్ వెట్‌ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తడి నేలల భౌగోళిక సరిహద్దుల గుర్తింపు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి చిత్తడి నేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 23,450 చిత్తడి నేలలున్నాయి. ఇందులో 99.3శాతం నేలలకు డిజిటల్ సరిహద్దుల గుర్తింపు పూర్తయ్యింది. వీటికి ఈనెల 28లోపు భౌతిక సరిహద్దుల గుర్తింపు పూర్తిచేయాల్సి ఉంది. ఇందుకోసం అటవీ, రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో ప్రక్రియను పూర్తి చేయాలి' అని ఆదేశించారు. 2018లో తన పోరాట యాత్ర సందర్భంగా సోంపేట చిత్తడి నేలల్ని పరిశీలించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర పరిధిలో ఒకేసారి 16 చిత్తడి నేలలకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన టెక్నికల్, గ్రీవెన్స్ కమిటీ ఆమోదం తెలిపిందని, వీటిని అధికారికంగా నోటిఫై చేయబోతున్నట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒకేసారి ఇన్ని చిత్తడి నేలలు గుర్తించిన రాష్ట్రంగా ఏపీ చరిత్ర సృష్టించబోతోందన్నారు. సోంపేట, కవిటి మండలాల పరిధిలో 5వేల ఎకరాల్లో విస్తరించిన పెదబీల, చినబీల, తుంపర చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఎకో టూరిజం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అరుదైన పక్షి జాతులకు నెలవుగా ఉన్న రాజమండ్రి సమీపంలోని పుణ్యక్షేత్రం, అనంతపురం జిల్లా వీరాపురంలోని చిత్తడి నేలల్లో ప్రత్యేక పక్షుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, పర్యాటకుల్ని ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద చిత్తడి నేలగా గుర్తింపు పొందిన కొల్లేరు లాంటి సరస్సుల పరిరక్షణపై దృష్టి సారిస్తామన్నారు. అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో కొల్లేరు లేక్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు. మరిన్ని చిత్తడి నేలలకు అంతర్జాతీయ(రాంసర్) గుర్తింపు దక్కేలా చర్యలు చేపడతామని చెప్పారు. కాగా, అమరావతి సచివాలయంలో విజయవాడ దుర్గమ్మ గుడి వేద పండితులు పవన్‌కు ఆశీర్వచనాలు అందజేశారు.

గ్రామీణ ముఖచిత్రం మారేలా పల్లెపండుగ 2.0: పవన్‌కల్యాణ్

రాష్ట్రంలో పల్లెపండుగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా పల్లెపండుగ 2.0 ప్రణాళికలు ఉండాలని పవన్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో పల్లెపండుగ 2.0పై సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ముఖచిత్రం సంపూర్ణంగా మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గోశాలలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం తదితరాలపై దిశానిర్దేశం చేశారు. పల్లెపండుగ 2.0 పేరుతో 25వేల మినీ గోకులాలు, రూ.6,500 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. పంచాయతీరాజ్ లింక్‌రోడ్లతో పాటు ఉపాధి హామీకి సంబంధించి సుమారు 10వేల పనులను గ్రామాల్లో చేపట్టాలని నిర్ణయించారు.

మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పండి

» బొల్లా బ్రహ్మనాయుడుకు మహిళా కమిషన్ సూచన

» లేదంటే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిక

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 'ఆడవాళ్లంతా తాగుబోతులు' అంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. బ్రహ్మనాయుడి వ్యాఖ్యలపై మీడియాలో దుమారం రేగడంతో ఆమె స్పందించారు. మహిళలను అవమానపరుస్తూ చేసిన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలను బట్టి ఆయనకు మహిళల పట్ల ఉన్న చులకన భావం అర్థమవుతోందన్నారు. మహిళలను అగౌరవపరిచినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందని, అలా చేయకుంటే కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల మాటలు ఆదర్శవంతంగా ఉండాలిగానీ ప్రజలు అసహ్యించుకునేలా ఉండకూడదని సూచించారు. సంస్కారవంతులెవరూ బ్రహ్మనాయుడిలా మాట్లాడరని, మహిళలను అవమానించే నాయకులు ప్రజా సేవకు అనర్హులని తేల్చి చెప్పారు. మహిళలపై ఎవరైనా వ్యాఖ్యలు చేసేముందు వారింట్లో తల్లి, చెల్లి, భార్య, నిత్యం పూజించే దేవత కూడా మహిళే అని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ప్రతి వ్యాఖ్యనూ కమిషన్ తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టంచేశారు. మహిళల్ని తూలనాడే రాజకీయనేతలపై నిఘా పెట్టి ప్రభుత్వ పెద్దలు సైతం ఇలాంటి విష సంస్కృతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నిర్లక్ష్యపు పునాదులు!

రూ.30 కోట్లు నేలపాలు

రాజధాని సీఆర్డీయే పరిధిలోని విద్యుత్ లైన్ల మార్పుతో నష్టం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం చోటు చేసుకుంది. ముందుగా ఒక లైన్ అనుకుని.. పునాదులు నిర్మించారు. కానీ, అది తప్పుడు అలైన్‌మెంట్ అని గుర్తించే సరికి నిర్మాణాలు పునాదుల దశకు చేరిపోయాయి. దీంతో రూ.30 కోట్ల వరకు ప్రజాధనం నేలపాలైంది. వెంకటపాలెం, తదితర ప్రాంతాల్లో 400 కేవీ విద్యుత్ లైన్లు సీడ్ యాక్సిస్ రోడ్డు, వెస్ట్ బైపాస్‌తోపాటు పలు సంస్థలకు కేటాయించేందుకు నిర్దేశించిన స్థలాల మీదుగా వెళుతుండటంతో వాటిని మార్చాలని అధికారులు నిర్ణయించారు. సీఆర్డీయే అధికారులతో కలిసి ట్రాన్స్‌కో అధికారులు కొత్త లైన్ వెళ్లాల్సిన అలైన్‌మెంట్‌ను గుర్తించారు. వీటీపీఎస్ నుంచి సత్తెనపల్లి, నెల్లూరు వైపు వెళ్లే ఈ 400 కేవీ లైన్ల పునర్మార్గాల(రీ-రూటింగ్) పనుల కోసం 2018లో టెండరు పిలిచారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. పునాదుల స్థాయి వరకు నిర్మాణం పూర్తయిన తర్వాత అధికారులు అలైన్‌మెంట్‌లో తప్పులు జరిగాయని గుర్తించారు. అయితే, అప్పటికే 15 టవర్లు పునాదుల స్థాయి వరకు చేరుకున్నాయి. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో రాజధానిలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ లైన్ల మార్పిడి వ్యవహారం తెరపైకి వచ్చింది. రూ.357 కోట్లతో టెండర్లు పిలిచి 9 శాతం అదనంగా(రూ.35 కోట్లు) గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించారు. మళ్లీ కొత్త టవర్ల కోసం పునాదులు తీయడం ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. కాగా, ఒక్కో టవర్ బేస్‌మెంట్ నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చవుతుంది. 15 టవర్లకు రూ.2 కోట్లు చొప్పున మొత్తం రూ.30 కోట్లు నేలపాలయ్యాయి.



విలువైన భూమీ వృథానే..

అలైన్‌మెంట్‌లో తప్పు కారణంగా వృథాగా మిగిలిన 15 టవర్ల వేసిన ప్రాంతం సుమారు 2ఎకరాలు వరకు ఉంటుంది. 400కేవీ టవర్ నిర్మాణానికి 20/20 మీటర్ల వైశాల్యంలో బేస్‌మెంట్ నిర్మాణం చేశారు. అంటే సుమారు 500 గజాల స్థలంలో పునాది నిర్మించారు. రాజధాని ప్రాంతంలో గజం రూ.40 వేలు వేసుకున్నా 7,500 గజాల విలువ రూ.30 కోట్లు వరకు ఉంటుంది. టవర్ బేస్‌మెంట్లు భూమిలో 12 అడుగుల లోతున ఉంటాయి. వీటిని తొలగించడం కూడా కష్టం.

వృథా ఖరీదు!

ఈ చిత్రంలో కనిపిస్తున్న కాంక్రీట్ దిమ్మెలు అధికారుల నిర్లక్ష్యానికి ఆనవాళ్లు!. ఆ నిర్లక్ష్యం ఖరీదు రూ.30 కోట్లు!!. రాజధాని అమరావతిలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు హడావుడిగా వీటిని నిర్మించారు. తర్వాత ఈ లైన్‌లలో మార్పు చేశారు. ఫలితంగా ప్రజాధనం నిరుపయోగమైంది. దీంతోపాటు అత్యంత విలువైన 2 ఎకరాల స్థలం కూడా కొరగాకుండా పోయింది.

రాజధాని ప్రాంతంలో వెంకటపాలెం వద్ద సీడ్‌యాక్సిస్ రోడ్డు, వెస్ట్ బైపాస్ క్రాస్ అయ్యే చోట అధికారుల నిర్లక్ష్యానికి ఆనవాళ్లుగా కనిపిస్తున్న విద్యుత్ టవర్ల పునాదులు

తప్పు ఎవరిది?

విద్యుత్ లైన్ మార్పిడిలో తప్పుడు అలైన్‌మెంట్‌కు కారణం ఎవరనేది అధికారులు ఇంత వరకు గుర్తించలేదు. తమ తప్పు కాదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతుంటే.. అలైన్‌మెంట్‌తో తమకేమీ సంబంధం లేదని సీఆర్డీయే అధికారులు చెబుతున్నారు. తప్పంతా ట్రాన్స్‌కో అధికారులదేనని అంటున్నారు.



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది.

ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ సదస్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారు. ఈ రోజు ఏపీకి ఎంతో శుభప్రదం, సంతోషకరమైన రోజు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆవిష్కరణలు, అవకాశాలకు..

కొత్త శకం

గూగుల్ రాక చరిత్రాత్మక ఘట్టం: చంద్రబాబు



గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, లోకేశ్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్, పెమ్మసాని, ఎంపీలు, అధికారులు

- ప్రధాని టెక్నాలజీని వేగంగా స్వీకరిస్తారు
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ గురించి చెప్పగానే ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ సదస్సుపై ఆలోచన చేశారు
- మోదీ, కేంద్ర మంత్రులు నిర్మల, వైష్ణవ్‌కు కృతజ్ఞతలు
- ప్రాజెక్టు కోసం లోకేశ్ ఎంతో కష్టపడ్డాడు
- దీనికి చాలా సమయం కేటాయించాడు
- ఎప్పటికప్పుడు నాకు సమాచారమిచ్చేవాడు: సీఎం
- ప్రధాని, చంద్రబాబు దార్శనిక నేతలు
- వారి ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, వైవిధ్య నిర్ణయాల వల్లే గూగుల్ వచ్చింది: నిర్మల
- దేశ ప్రగతిలో ఏపీ కీలక భూమిక: వైష్ణవ్
- గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా వైజాగ్: గూగుల్ క్లౌడ్ సీఈవో

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం.. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆవిష్కరణలు, అవకాశాలకు కొత్త శకంగా అభివర్ణించారు. విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం గూగుల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందంపై మంగళవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ ప్రసంగించారు. వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషమని సీఎం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో సరికొత్త అధ్యాయంగా పేర్కొన్నారు. దేశంలో మొదటి గిగావాట్-స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. 'రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటోంది. ఏపీలో కృత్రిమ మేధ (ఏఐ)ను ప్రతి కుటుంబానికీ చేరువ చేసేందుకు ప్రయత్నిస్తాం. 1990ల చివర్లో మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకొచ్చాను. ఈ రోజు గూగుల్ విశాఖ వస్తుండడం నాకు గర్వకారణం' అని తెలిపారు. హైటెక్ సిటీ నుంచి 2025లో ఏఐ డేటా సెంటర్ వరకు స్ఫూర్తిదాయకమైన పరివర్తనను చూస్తున్నామన్నారు. విశాఖకు గూగుల్ రావడంలో లోకేశ్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. 'ఆయన గూగుల్‌తో కలిసి చాలా సన్నిహితంగా పనిచేశాడు.. వారి కార్యాలయాన్ని సందర్శించాడు.. చాలా సమయం కేటాయించాడు.. క్రమం తప్పకుండా నాకు సమాచారం అందించాడు. ఈ ప్రాజెక్టును 12 నెలల్లో తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. 13 నెలలు పట్టినప్పటికీ.. మొత్తానికి సాధించగలిగాం. ఈ విజయం పట్ల గర్వపడుతున్నాను' అని తెలిపారు. గూగుల్ ప్రాజెక్టుకు సహకరించిన ప్రధానికి, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రగతిశీల విధానాల వల్లే: నిర్మల

గూగుల్ డేటా ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావడం దేశ ప్రగతిలో అత్యంత కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. దార్శనిక నేతలు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆలోచనలు, ప్రగతిశీల విధానాలు, నిర్ణయాల్లో వైవిధ్యం వల్లే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు సాకారమైందని తెలిపారు. కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ తరహా సుపరిపాలన ఉందని చెప్పారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి వివిధ రాష్ట్రాలు పోటీ పడుతున్నాయని, 2047-వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇలాంటి పోటీ అవసరమని చెప్పారు.

దేశాల అనుసంధానానికి విశాఖ హబ్ వేదిక: కురియన్

ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖపట్నం మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ అన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్‌తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీ, టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, జీఎం హరీశ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికం

- ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలి
- డేటా సెంటర్ ప్రయోజనాలపై సామాన్యులకూ అవగాహన కల్పించాలి.. టీడీపీ నేతలతో సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని సీఎం చంద్రబాబు అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్ర చరిత్రలోనే కాకుండా దేశ ఐటీ చరిత్రలోనే పెద్ద మలుపు కానుందని చెప్పారు. మంగళవారం గూగుల్ ఒప్పందంపై సంతకాల తర్వాత ఢిల్లీ నుంచి అమరావతికి చేరుకున్న ఆయనకు.. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. 'థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారితో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గూగుల్ సంస్థను సంప్రదించి.. నిరంతరం ఫాలోఅప్ చేయడం వల్లే లక్ష్యాన్ని చేరుకున్నామని.. ఇందులో లోకేశ్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. 'ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయి. ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలి. సామాన్యులకు సైతం డేటా సెంటర్ ప్రయోజనాలేంటో తెలిసేలా అవగాహన కల్పించాలి' అని వారికి సూచించారు.

ట్రెండింగ్‌లో 'గూగుల్ కమ్స్ టు ఏపీ'

'గూగుల్ కమ్స్ టు ఏపీ' హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలిచింది. ఢిల్లీలో మంగళవారం గూగుల్‌తో ఏపీ ప్రభుత్వ ఒప్పందం కార్యక్రమం జాతీయ మీడియాలో ప్రముఖంగా ప్రసారం కావడంతో 'ఎక్స్'లో మొదటి స్థానంలో ట్రెండ్ అయింది. ఈ ఒప్పందంపై సీఎం చంద్రబాబు 'ఓకే గూగుల్.. సింక్రనైజ్ ఫర్ వికసిత్ భారత్' అని పోస్టు చేశారు. ఈ పోస్టును అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్, లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్, గూగుల్ నెట్‌వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీకి ట్యాగ్ చేశారు.



డేటా ఇంధనమైతే.. డేటా సెంటర్ రిఫైనరీ

- విశాఖ ఏఐ హబ్‌తో గ్రామాల్లో విస్తృత సేవలు
- ఈ మజిలీలో కనిపించని హీరోలెందరో!
- సాంకేతిక మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యం పెంచుకోవాలి
- మనవాళ్లను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి
- ఇందుకు గూగుల్ మార్గనిర్దేశం కోరుతున్నా: లోకేశ్

విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదు.. యావద్దేశానికే చరిత్రాత్మకమైందని లోకేశ్ అన్నారు. 'గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, విస్తృతమైన సేవలను అందించబోతోంది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపించడం గర్వకారణంగా భావిస్తున్నాం. ఏఐ హబ్ కేవలం భారత్, ఏపీకే గాక ప్రపంచ వేదికపై మన దేశం కీలకపాత్ర పోషించేలా చేస్తుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఈ ప్రాజెక్టు కోసం సమష్టిగా కలిసి పనిచేశాయి. 'డేటా ఇంధనం అయితే.. డేటా సెంటర్లు రిఫైనరీల లాంటివి. 12 నెలల్లో పూర్తవుతుందనుకున్న ఏఐ హబ్ ఎంవోయూ ఒక నెల ఆలస్యమైంది. ఇదో ఉత్సాహభరితమైన ప్రయాణం. ఈ మజిలీలో ఎందరో కనిపించని హీరోలు ఉన్నారు. అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన యువత నైపుణ్యం పెంచుకోవాలి. ఏఐని స్వీకరించాలి. పాఠ్యాంశాలను పునర్వ్యవస్థీకరించాలి. మన యువతను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి. గతంలో వై2కే విప్లవం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల రూపురేఖలు మార్చింది. ఇప్పుడు ఏఐతో కొత్తతరం పట్టణాలు అభివృద్ధి చెందబోతున్నాయి. సీఎం.. విద్య, ఐటీని ఒకే గొడుగు కిందకు తెచ్చి, ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. ఈ రెండు రంగాల్లో క్షేత్ర స్థాయి అత్యుత్తమ ఫలితాలను తేవడమే నా లక్ష్యం' అని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా అమలు చేస్తుందని.. అటువంటి నిర్ణయం భారత్‌కు, ప్రపంచానికి కూడా ఒక నమూనాగా మారుతుందని తెలిపారు. 'మా లక్ష్యాలను అధిగమించేందుకు గూగుల్ మార్గదర్శకత్వం వహించి సహకరించాల్సిందిగా కోరుతున్నాను. విశాఖ ఏఐ హబ్ మన యువతను తర్వాతితరం సాంకేతిక విప్లవానికి సిద్ధం చేస్తుంది' అని తెలిపారు.

వికసిత భారత్ దిశగా..!

- గూగుల్ ఏఐ హబ్‌తో దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఊతం : మోదీ
- హబ్ ప్రణాళికలపై ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన సీఈవో పిచాయ్



సుందర్ పిచాయ్, ప్రధాని మోదీ (ఫైల్)

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత్ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుందని పేర్కొన్నారు. ఈ హబ్‌కు సంబంధించి ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన ఒప్పందంపై ప్రధాని మోదీతో ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. తమ కంపెనీ తొలి హబ్ ఏర్పాటు విశేషాలను ఆయన మోదీకి వివరించారు. ఈ సమాచారాన్ని పేర్కొంటూ సుందర్ పిచాయ్ చేసిన ట్వీట్‌కు మోదీ స్పందించారు. "ఏపీలోని డైనమిక్ సిటీ విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. బహుళ అంచెల పెట్టుబడితో కూడిన ఈ గిగావాట్ స్థాయి డేటా సెంటర్ వికసిత భారత్‌ను నిర్మించాలనే మా దార్శనికతకు అనుగుణంగా ఉంది. ఇది సాంకేతికతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఒక శక్తిమంతమైన సాధనంగా ఉంటుంది. కృత్రిమ మేధను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు అత్యాధునిక సదుపాయాలను అందిస్తుంది. అలాగే, మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇస్తుంది" అని మోదీ ట్వీట్ చేశారు.

కీలక మైలురాయి: సుందర్ పిచాయ్

అంతకుముందు ఏఐ హబ్ ఏర్పాటుపై సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'విశాఖపట్నంలో గూగుల్ మొట్టమొదటి ఏఐ హబ్ ఏర్పాటుకు సంబంధించి మా ప్రణాళికలను ప్రధాని మోదీతో పంచుకోవడం ఆనందంగా ఉంది. ఇది ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. ఇందులో గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్, నూతన అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీస్థాయిలో ఇంధన మౌలిక సదుపాయాలు ఉంటాయి. దీనిద్వారా భారత్‌లోని సంస్థలకు, వినియోగదారులకు అధునాతన సాంకేతికతను అందిస్తాం. ఏఐ ఆవిష్కరణలను, దేశవ్యాప్తంగా వృద్ధిని ఈ హబ్ వేగవంతం చేస్తుంది' అని పిచాయ్ పేర్కొన్నారు.

అమెరికా బయట భారీ పెట్టుబడి: రామ్మోహన్

- డిజిటల్ హబ్‌గా ఏపీ: పెమ్మసాని చంద్రశేఖర్

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అమెరికా బయట భారీ పెట్టుబడితో గూగుల్ విశాఖలో ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఈ డేటా సెంటర్ ద్వారా రాష్ట్ర జీడీపీ ఏటా రూ.11 వేల కోట్లకు పైగా పెరుగుతుందని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత్ నాయకత్వాన్ని మెరుగుపరుస్తుందన్నారు. కాగా, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రానికి రూ.10 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి, స్వావలంబన ప్రస్థానంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును కీలక మైలురాయిగా అభివర్ణించారు. దీంతో విశాఖకు అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు లభిస్తాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎన్నో రెట్లు మెరుగుపడుతుందని వివరించారు. ఏపీని డిజిటల్ హబ్‌గా నిలపడంలో, దేశవ్యాప్తంగా ఏఐ ఆధారిత పరివర్తనను వేగవంతం చేయడంలో ముందడుగని వ్యాఖ్యానించారు.

ఉత్తరాంధ్ర ఏఐ హబ్: ఎంపీ కలిశెట్టి

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ఏఐ హబ్‌గా మారనుందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కొనియాడారు. ఈ సెంటర్ ఏర్పాటు ఉత్తరాంధ్రలో చారిత్రక ఘటనగా అభివర్ణించారు. ఉత్తరాంధ్రలో ఏఐ, ఐటీ అభివృద్ధికి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగన్ ఏనాడూ ఆలోచించిన పాపాన పోలేదని విమర్శించారు. వైసీపీ నేతలు ఉత్తరాంధ్రను దోచుకొని, అవమానించగా నేడు సీఎం చంద్రబాబు మంచి రోజులు తీసుకొచ్చారని సంతోషం వ్యక్తం చేశారు.

హలో ఏపీ... ...ఓకే గూగుల్

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్-ఏపీ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఏఐ డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా గూగుల్ 10 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతుందని రాష్ట్రప్రభుత్వం భావించగా.. అది 15 బిలియన్ డాలర్లకు చేరింది. "ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం వచ్చే ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్ల(రూ.1,33,000 కోట్లు) పెట్టుబడులు పెడతాం" అని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అమెరికా వెలుపల పెట్టుబడుతున్న అతి భారీ పెట్టుబడి ఇదే అని గూగుల్ స్పష్టం చేసింది. అమెరికా వెలుపల ఏర్పాటవుతున్న అతిపెద్ద 'ఏఐ హబ్' కూడా ఇదే కానుంది. గూగుల్ గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్థ్యంతో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేస్తుంది. దీనిని దశలవారీగా పెంచుతూ పోతుంది.

కనెక్టింగ్ ది వరల్డ్...

ప్రపంచవ్యాప్తంగా గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలందించేలా విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటవుతుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్, యూట్యూబ్, గూగుల్ క్లౌడ్, జీ-మెయిల్ తదితర సేవలను ఈ ఏఐ హబ్ ద్వారానే గూగుల్ అందిస్తుంది. భారత్‌తో మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా సబ్ సీ (సముద్ర గర్భం) కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. 20 లక్షల మైళ్లకంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా విశాఖపట్నం ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా మారుతుంది.

మేలి మలుపు...

గూగుల్ ఏఐ హబ్.. విశాఖ నగరానికి, నవ్యాంధ్రకే కాదు, మొత్తం దేశ ఐటీ రంగ ప్రస్థానంలోనే మేలి మలుపులాంటిది. పెట్టుబడుల పరంగా.. ఉద్యోగాల కల్పనలోనూ కొత్త చరిత్ర సృష్టించనుంది. 2029 నాటికి రాంబిల్లి, అడవివరం, తర్లువాడలో మూడు ఏఐ డేటా సెంటర్లను నిర్మించి కార్యకలాపాలను ప్రారంభిస్తామని గూగుల్ ప్రకటించింది. వీటిలో... లక్షన్నర నుంచి రెండు లక్షల మంది నిపుణులు పని చేసే అవకాశముంది. ప్రస్తుతం గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఏఐ హబ్.. దశలవారీగా నాలుగు గిగావాట్లకు చేరనుంది. అప్పటికి ఉద్యోగుల సంఖ్య కూడా రెట్టింపవుతుంది.

గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేస్తున్న అతి పెద్ద 'ఏఐ హబ్' ఇదే! విశాఖ కేంద్రంగా అనేక దేశాలకు 'గూగుల్' తన సేవలను అందిస్తుంది.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' రోజురోజుకూ విస్తరిస్తోంది. దీనికి అతి భారీ కంప్యూటింగ్ సామర్థ్యం అవసరం. క్లస్టర్లలో వేలాది చిప్స్‌ను అనుసంధానించాలి. అందుకే... టెక్ కంపెనీలు ప్రత్యేకమైన డేటా సెంటర్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ద్వారా 1.88 లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. అంతేకాదు... ఇతర సంస్థల రాకకూ అవసరమైన 'ఎకో సిస్టమ్' విశాఖలో అభివృద్ధి చెందుతుంది. తద్వారా... భారత ఐటీ నిపుణులు ఇంకెక్కడికో వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. మన దేశంలోనే కావాల్సినన్ని కొలువులు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.



గూగుల్ ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, అధికారులు

కూటమి సర్కారు చొరవతో...

2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే.. సీఎం చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించారు. ప్రఖ్యాత టీసీఎస్, కాగ్నిజెంట్, అదానీ డేటా సెంటర్లు కార్యకలాపాలు చేపడతామంటూ ప్రతిపాదించాయి. 2014-19 మధ్య కాలంలోనే విశాఖను ఆర్థిక రాజధానిగా చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఆ దిశగా చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారు. కానీ వైసీపీ వచ్చాక.. విశాఖను సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు తప్ప, అభివృద్ధిపై దృష్టి సారించలేదనే ఆరోపణలున్నాయి. ప్రోత్సాహకాలను ఆపేయడంతో అప్పుడప్పుడే రెక్కలు విచ్చుకుంటున్న ఐటీ రంగం కుదేలైపోయింది. విశాఖలో ఐటీ సంస్థలు, స్టార్టప్ యూనిట్లు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పురోగతి మొదలైంది.

మళ్లీ అవే కు..విమర్శలు!

గతంలో హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలకు రాయితీలు ఇచ్చినప్పుడు వచ్చినట్లే... ఇప్పుడు గూగుల్ ఏఐ హబ్‌కు ఇస్తున్న రాయితీలపైనా రాజకీయ కువిమర్శలు మొదలయ్యాయి. 'వేల కోట్ల రాయితీలు ఇచ్చేస్తారా' అంటూ సామాజికవేత్తల ముసుగులో కొందరు రాగాలు తీస్తున్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణ సమయంలో తక్కువ ధరకే భూములు, స్టాంపు డ్యూటీ మినహాయింపు, విద్యుత్, మంచినీటి వసతుల కల్పనను పలు పార్టీలు, సంఘాలు విమర్శించాయి. కానీ ఆ చర్యల కారణంగానే 'సైబరాబాద్' అనే కొత్త నగరం ఆవిష్కృతమైంది. విశాఖలోనూ ఇదే జరగనుందని అధికారులు పేర్కొంటున్నారు. గూగుల్ రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతుండగా... రాష్ట్ర ప్రభుత్వం రూ.22వేల కోట్ల విలువైన రాయితీలు ప్రకటించింది. "ఇతర మెగా పరిశ్రమలకు ఇచ్చినట్లుగానే గూగుల్‌కూ విద్యుత్ రాయితీ ఇచ్చాం. అయినప్పటికీ... గూగుల్ తమ సొంత గ్రీన్ ఎనర్జీని వినియోగించుకుంటుంది. పోలవరం ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గోదావరి జలాలను తరలిస్తున్నాం. గూగుల్‌తోపాటు ఇతర పరిశ్రమలకు ఆ నీటినే అందిస్తాం" అని అధికారులు తెలిపారు.

విశాఖకు మహర్దశ

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంగా, నవ్యాంధ్ర వాణిజ్య రాజధానిగా, ఐటీ కేంద్రంగా, ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా ఉన్న విశాఖకు 'గూగుల్ రాకతో మరింత మహర్దశ పట్టడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌కు 'మైక్రోసాఫ్ట్' రాకతో ఇతర అనేక అనుబంధ, సంబంధిత కంపెనీలు తరలి వచ్చాయి. ఐటీ రంగ వికాసానికి అవసరమైన 'ఎకో సిస్టమ్' అభివృద్ధి చెందింది. విశాఖలోనూ ఇదే జరగనుందని... గూగుల్ ఐఏ హబ్ ఏర్పాటుతో అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకూ వేదికగా మారుతుందని చెబుతున్నారు. మంగళవారం ఢిల్లీలో గూగుల్‌తో ఒప్పందం కుదురుతున్న సమయంలోనే... మరో 4 ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెడతామంటూ ముందుకొచ్చాయని ఒక ముఖ్య అధికారి వెల్లడించారు. మరో 15 ఐటీ సంస్థలు కూడా పెట్టుబడుల ప్రతిపాదనలు అందించినట్లు సమాచారం. వీటిపై మరింత స్పష్టత వచ్చాక... ఎస్ఐపీబీ ఆమోదించేదాకా ఈ వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు చెబుతున్నారు.



విశాఖపట్నం సత్యం జంక్షన్‌లో కేకు కట్ చేసి బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక సునీల్ అగర్వాల్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

కూటమి నేతల సంబరాలు



విశాఖ టీడీపీ కార్యాలయంలో గండి బాబ్జీ ఆధ్వర్యంలో సంబరాలు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో విశాఖ పూర్తిస్థాయిలో డేటా హబ్‌గా రూపాంతరం చెందుతుందని, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయంటూ టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ మంగళవారం ఒప్పందం చేసుకోవడంపై కూటమి నేతలు మంగళవారం విశాఖలో సంబరాలు చేసుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. సత్యం సెంటర్ జంక్షన్‌లో ఉత్తర నియోజకవర్గ బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గూగుల్ వల్ల 1.88 లక్షల మందికి దశల వారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అంత పెద్ద సంస్థను విశాఖకు రప్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మిథున్‌రెడ్డి ఇళ్లలో సిట్ సోదాలు

- హైదరాబాద్, తిరుపతిలోని పీఎల్ఆర్ కార్యాలయాల్లో తనిఖీలు
- తిరుపతిలో మిథున్ తల్లి, పీఎల్ఆర్ డైరెక్టర్లను ప్రశ్నించిన సిట్

అమరావతి, తిరుపతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడుగా ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం సోదాలు చేపట్టింది. మిథున్‌రెడ్డి తల్లి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత, పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్లు శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలను ప్రశ్నించింది. హైదరాబాద్, తిరుపతి, బెంగుళూరుల్లో సోదాలు చేసిన సిట్ అధికారులు మద్యం కేసులో కీలక పాత్ర పోషించిన డికార్ట్ లాజిస్టిక్స్ నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించినట్లు తెలిసింది. తిరుపతి మారుతీ నగర్‌లో ఉన్న మిథున్‌రెడ్డి నివాసంలో ఆయన తల్లి


తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం నుంచి బయటకు వస్తున్న సిట్ అధికారులు

స్వర్ణలత (పీఎల్ఆర్ మాజీ ఎండీ)ను ప్రశ్నించారు. ఆ సమయంలో మిథున్‌రెడ్డి ఇంట్లో లేరని... పెద్దిరెడ్డి మాత్రం ఉన్నారని తెలిసింది. నాడు పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఎండీగా ఉన్న కారణంగా ఆమె నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు సమాచారం. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆమె ఎక్కువగా.. తనకేమీ తెలీదని, కుమారుడే చూసుకుంటారని చెప్పినట్లు సమాచారం. ఆ సమయానికి పెద్దిరెడ్డి ఇంట్లో ఉన్న పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఉద్యోగులను కూడా సిట్ అధికారులు ప్రశ్నించి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఏడు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అవసరమైతే మరోసారి విచారించడానికి వస్తామని సిట్ అధికారులు స్పష్టంచేసి వెనుదిరిగారు. సిట్ అధికారుల్లో ఒక బృందం తిరుపతిలో తనిఖీలు చేపట్టగా.. మరో రెండు బృందాలు హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో ఉంటున్న పీఎల్ఆర్ డైరెక్టర్లు శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిని ప్రశ్నించాయి. పీఎల్ఆర్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి కొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మరో వైపు డికార్ట్ లాజిస్టిక్స్‌లోనూ సోదాలు నిర్వహించిన సిట్ అధికారులు... సిబ్బంది వివరాలు, వ్యాపార లావాదేవీలపై ఆరా తీసి అవసరమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కోర్టులో దాఖలు చేయబోయే నాలుగో చార్జిషీట్‌లో ఈ వివరాలు పొందుపరిచే అవకాశం ఉంది. జగన్ పాలనలో జరిగిన మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఫేస్ ఐడీతో 'లాక్' ఓపెన్!

- వెంకటేశ్ నాయుడి ఫోన్ ఓపెన్ చేసిన అధికారులు
- మద్యం స్కాంలో కీలక సమాచారం వెలుగులోకి?

విజయవాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న చెరుకూరి వెంకటేశ్ నాయుడి ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు ఫేస్ ఐడీ ద్వారా ఓపెన్ చేశారు. ఈ కేసులో నగదు లావాదేవీలు సహా సమాచారానికి సంబంధించిన వ్యవహారాల విషయంలో వెంకటేశ్ నాయుడి ఫోన్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు కీలకంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ ఓపెన్ చేసేందుకు ఏసీబీ కోర్టు నుంచి అనుమతి పొందారు. ఈ క్రమంలో సిట్ అధికారులు విజయవాడ జైల్లో ఉన్న వెంకటేశ్ నాయుడిని మంగళవారం ఏసీబీ కోర్టుకు తీసుకొచ్చారు. ఆయనను ఎఫ్ఎస్ఎల్‌కు తీసుకెళ్తున్నామని న్యాయాధికారి పి. భాస్కరరావుకు ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదులు వివరించారు. అయితే, వెంకటేశ్ తరఫు న్యాయవాదిని కూడా తీసుకెళ్లాలని న్యాయాధికారి ఆదేశించారు. అనంతరం వెంకటేశ్ నాయుడిని అధికారులు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. వెంకటేశ్ నాయుడి ఫేస్ ఐడీ ద్వారా సెల్‌ఫోన్ లాక్‌ను తీశారు. అందులోని గుట్టును బయటకు లాగుతున్నారు. ఫోన్ లాక్ తెరిచాక వెంకటేశ్‌ను తిరిగి జైలుకు తరలించారు.

ప్రజల ప్రాణాలతో జగన్ చెలగాటం

- తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే లిక్కర్ కుట్ర: మంత్రి కొల్లు రవీంద్ర
- విజయవాడలో మద్యం షాపు ఆకస్మిక తనిఖీ
- కొనుగోలుదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన


బెజవాడలో వినియోగదారుడికి ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి వివరిస్తున్న మంత్రి కొల్లు

విజయవాడ(కలెక్టరేట్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర చేసి, ఆ కుట్రలో వైసీపీ నేతలే చిక్కుకున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ శ్రీధర్‌తో కలిసి విజయవాడలో ఓ మద్యం షాపును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా కొన్ని మద్యం బాటిళ్లను స్కాన్ చేసి, వాటి వివరాలు పరిశీలించారు. తాము కొనుగోలు చేసింది అసలైనదో, కల్తీనో ఈ యాప్ ద్వారా ఎలా తెలుసుకోవచ్చో కొనుగోలుదారులకు వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే పారదర్శకమైన మద్యం పాలసీని తీసుకొచ్చిందని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కుట్రలకు తెరలేపారన్నారు. మద్యం కల్తీలో భాగస్వామిగా ఉన్న జనార్దనరావు బయటపెట్టిన వీడియోలో కుట్రకోణం స్పష్టంగా బయటపడిందని తెలిపారు. నెల్లూరులో డీహైడ్రేషన్ కారణంగా, మతిస్థిమితం లేక రోడ్డు పక్కన చనిపోయినవారినీ కల్తీ మద్యం కేసుకు ముడిపెట్టారన్నారు. తాజాగా తిరుపతిలో ఒక వ్యక్తి కళ్లు తిరిగి పడిపోతే చనిపోయాడన్నారని, గుడివాడలో బీరు కొన్న వ్యక్తి గంట తర్వాత వచ్చి గ్యాస్ లేదంటూ హడావిడి చేశారని తెలిపారు. ములకలచెరువులో కల్తీ ఘటన వెలుగులోకి రాగానే ప్రభుత్వం అప్రమత్తమైందని, రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించామని చెప్పారు. కల్తీ మద్యం కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ విచారిస్తామని, తప్పు చేసినవారు ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగిన మద్యం షాపులో మాత్రమే కొనాలని సూచించారు. ఎక్కడైనా అనుమానం కలిగితే తక్షణమే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంలగా ఉన్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మద్యం షాపులో ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించి, ఎక్కువ మందితో డౌన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. బెల్ట్ షాపుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై కమిటీ

- నిబంధనల రూపకల్పనకు 13 మందితో ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో పాటించాల్సిన నిబంధనల రూపకల్పనకు ఉన్నత విద్యాశాఖ కమిటీని నియమించింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో 13 మందితో కమిటీని ఏర్పాటుచేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో జాతీయ మెంటల్ హెల్త్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సైకాలజిస్ట్, సైక్రియాటిస్ట్, ఎన్జీవోలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్, ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉన్నారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో విద్యార్థుల నమోదు, వారి పరిరక్షణ, సమస్యల పరిష్కార వేదిక ఉండాలని సుప్రీంకోర్టు ఈ ఏడాది జూలైలో తీర్పు ఇచ్చింది. అన్ని రాష్ట్రాలు ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై నిబంధనలు రూపొందించాలని, అవి విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని రక్షించేలా ఉండాలని స్పష్టంచేసింది. అందుకు అనుగుణంగా ఇప్పుడు రాష్ట్రంలో నిబంధనల రూపకల్పనకు కమిటీని నియమించారు. పదిహేను రోజుల్లో కమిటీ సిఫారసులతో నివేదికను ప్రభుత్వానికి పంపుతుంది.

జోగి-జనార్దన్ మధ్య లిక్కర్ 'లింకే'!

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబానికి జనార్దన్‌రావు కుటుంబం ఆర్థికంగా సహకారం అందించింది. ఈ వ్యాపారంలో జోగి కుటుంబం బాగా సంపాదించటంతో హోల్‌సేల్ కిరాణా వ్యాపారం నిర్వహించే జనార్దన్‌రావు కుటుంబం కూడా మద్యం వ్యాపారం వైపు అడుగులు వేసింది. కొంతకాలం పరస్పర సహకారాలతో మద్యం వ్యాపారం నిర్వహించారు. వ్యాపార పోటీలో రెండు కుటుంబాల మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. జోగి కుటుంబం రాజకీయంగా ఎదిగే క్రమంలో ఇరు కుటుంబాలు మళ్లీ సన్నిహితమయ్యాయి. రాజకీయంగా, మద్యం వ్యాపారపరంగా పరస్పరం సహకరించుకున్నారు. జోగి రమేశ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వచ్చే సమయానికి వారి మద్యం వ్యాపారం కూడా అద్దేపల్లి జనార్దనరావు కుటుంబానికి విక్రయించారు. ఈ వ్యాపారంలో రెండు చేతులా ఆర్జించిన అద్దేపల్లి ఆ తర్వాత జగ్గయ్యపేటలోని ఓ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. మద్యం వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయి. తర్వాత క్రమంలో నకిలీ మద్యం వ్యాపారం దిశగా అడుగులు వేసిన అద్దేపల్లి పునర్వైభవం సాధించారు. తాజాగా అనేక వైన్ షాపుల్లో స్లీపింగ్ పార్టనర్‌గా ఉంటూ నకిలీ మద్యం ప్లాంట్లు ఏర్పాటు చేసి ఆ వ్యాపారాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికాలోనూ డిస్టిలరీ ప్లాంట్ ఏర్పాటుచేసే స్థాయికి ఎదిగారు. కల్తీ మద్యం తయారీలో పట్టుబడిన జనార్దన్‌రావు.. జోగి రమేశ్ ఆధ్వర్యంలో ఈ పని చేశానని చెప్పటంతో వీరి బంధాలకు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

స్లీపింగ్ పార్టనర్

ప్రస్తుత ప్రభుత్వంలో వైన్ షాపులకు నిర్వహించిన వేలంపాటలలో షాపులు దక్కించుకున్న పలువురితో అద్దేపల్లి ఒప్పందం కుదుర్చుకుని స్లీపింగ్ పార్టనర్‌గా చేరారని తెలిసింది. మరికొన్ని వైన్ షాపులను ప్రత్యక్షంగా దక్కించుకున్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని ఓ వైన్‌షాపు, మైలవరంలోని రెండు వైన్ షాపులలో స్లీపింగ్ పార్టనర్‌గా ఉంటూ, ఇబ్రహీంపట్నంలో ఏఎన్నార్ బార్ అండ్ రెస్టారెంట్‌ను సొంతంగా నిర్వహిస్తున్నారు.

విలాసాలు-వివాదాలు!

అద్దేపల్లి చుట్టూ వివాదాలు, నేరాలు నిత్యం తిరుగుతుంటాయని పలువురు చెబుతున్నారు. అంతే కాదు, జనార్దన్‌రావు మంచి విలాస పురుషుడని అంటున్నారు. ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు కూడా అదే బాటలో పయనించారు. ఇంజనీరింగ్ చదివే రోజుల నుంచే జనార్దన్‌రావు ఆలోచనలు నేరపూరితంగా ఉండేవని ఆయన స్నేహితులు చెబుతున్నారు. అద్దేపల్లి జనార్దన్‌రావు తన తాత అద్దేపల్లి నాగేశ్వరరావు(ఏఎన్ఆర్) పేరుతో బార్‌ను ఏర్పాటు చేశారు. తొలుత జాతీయ రహదారి పక్కన ఈ బార్‌ను నెలకొల్పారు. దీనికి అప్పట్లో టీడీపీకి చెందిన ఓ నేత సహకరించినట్టు స్థానికులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బార్‌ను తొలగించినా ఈ స్థలంలోనే జనార్దన్‌రావు నకలీ మద్యం తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో అంటకాగేవారు. బార్ ముసుగులో ఆయన చేస్తున్న వ్యాపారాలపై నేతలకు సమాచారం ఉన్నా.. వారు నోరెత్తకుండా అద్దేపల్లి అన్ని 'ఏర్పాట్లు' చేసేవారని తెలిసింది.

ఆ నలుగురిని ఒకరోజు కస్టడీకి ఇవ్వండి!

- ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్

విజయవాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక నిందితులుగా ఉన్న నలుగురిని ఒకరోజు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడ జిల్లా జైలులో ఉన్న ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, దూనేటి చాణక్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి పీఏ నవీన్ కృష్ణలను బుధవారం ఒకరోజు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనికి నంబర్లు కేటాయించిన కోర్టు బుధవారం విచారణ జరపనుంది.

పది రోజులు కస్టడీకి ఇవ్వండి

- కోర్టులో ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

నకిలీ మద్యం కేసులో ప్రధాన సూత్రధారి అద్దేపల్లి జనార్దన్‌రావు నుంచి మరిన్ని వివరాలు రాబట్టాలని ఎక్సైజ్ పోలీసులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయనను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. నకిలీ మద్యం వ్యవహారంతో సంబంధం ఉన్న అందరినీ బయటకు లాగడానికి ఆయనను విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కేసులో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసిన నలుగురు నిందితులు ఇక్కడి కేసులోనూ నిందితులుగా ఉన్నారని, వారిపై పీటీ వారెంట్‌ను అనుమతించాలని మరో పిటిషన్ దాఖలు చేశారు.

కల్లు-సారాయితో ఎదిగిన జోగి

జోగి రమేశ్ కుటుంబం పెద్దగా స్థోమత కలిగిన కుటుంబం కాదు. మొదట్లో కల్లు, సంపూర్ణ మద్య నిషేదం అనంతర పరిణామాల్లో సారా అమ్మేవారు. ఈ వ్యాపారం వారికి కలిసొచ్చింది. ఆ తర్వాత తిరిగి మద్యం ప్రవేశపెట్టాక ఆ వ్యాపారం ప్రారంభించారు. జోగి కుటుంబం మద్యం వ్యాపారం చేయటానికి అద్దేపల్లి జనార్దన్‌రావు కుటుంబమే పెట్టుబడి పెట్టింది. జోగి రమేశ్ తమ్ముడు రాము వైన్స్ వ్యాపారం నిర్వహించేవారు. ఇబ్రహీంపట్నంలో బార్ కూడా నడిపారు. కాలక్రమంలో మద్యం వ్యాపారంలో జోగి కుటుంబం లాభాలు గడించటం చూసి.. అద్దేపల్లి కుటుంబం కూడా మద్యం వ్యాపారం వైపు వచ్చింది. ఇక, జోగి రమేశ్ తండ్రి మోహన్‌రావు ఇబ్రహీంపట్నం ఎంపీపీగా చేసిన కాలంలో ఆర్థికంగా అద్దేపల్లి కుటుంబం ఆయనకు సహకరించేది. ప్రతిగా అద్దేపల్లి కుటుంబం మద్యం వ్యాపారానికి ఆయన పరోక్షంగా సహకరించేవారు. జోగి రమేశ్ రాజకీయ అరంగేట్రం చేశాక.. క్రమంగా వారి కుటుంబం మద్యం వ్యాపారం నుంచి దూరమైంది.

కేజీబీవీల్లో శాశ్వత బోధన సిబ్బందిని నియమించరా..?

- ఇలా అయితే నాణ్యమైన విద్యనందించడం సాధ్యమేనా: హైకోర్టు



అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పేద విద్యార్థినుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ)లో శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బంది నియామకానికి విధివిధానాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. శాశ్వత బోధన సిబ్బంది నియామకం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలని పేర్కొంది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. సమగ్ర శిక్ష పథకం కింద నిర్వహించే కేజీబీవీల్లో పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2023లో కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్‌చేస్తూ అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం... కేజీబీవీలు ఏర్పాటు చేసి 21 ఏళ్లు గడుస్తున్నా శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఇలా అయితే.. ఆ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. బోధనా సిబ్బంది నియామకం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడం లేదని పేర్కొంటూ.. దీనిపై వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరు కావాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ అప్పీల్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర పాఠశాల విద్య మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ ఆన్‌లైన్ ద్వారా, రాష్ట్ర పాఠశాల విద్య శాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ నేరుగా ధర్మాసనం ముందు హాజరయ్యారు. విద్యాశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది గుర్రం రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ... సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామన్నారు. ఉత్తర్వులను సవాల్ చేస్తూ వేసిన రిట్ అప్పీల్‌ను ఉపసంహరించుకుంటామన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అప్పీల్ ఉపసంహరణకు అనుమతించలేమని స్పష్టం చేసింది. కేంద్ర పాఠశాల విద్యశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ బదులిస్తూ.. సమగ్ర శిక్ష పథకం 2026 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఆ తర్వాత పథకం కొనసాగింపు కోసం కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి కావాలన్నారు. కోన శశిధర్ బదులిస్తూ... అర్ధంతరంగా పథకం నిలిపివేస్తే శాశ్వత ప్రాతిపదికన నియమించే బోధన సిబ్బందిని సర్దుబాటు చేయడం కష్టమవుతుందన్నారు.

'ఎలీప్'కు 30 ఎకరాలు

- ఎకరం రూ.10 లక్షల చొప్పున కేటాయింపు
- జేఎస్‌డబ్ల్యూ పార్క్‌కు ఆమోదం
- పరిశ్రమల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించింది. వాటికి ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీలను కూడా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం ముసిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి, ఎం.బి.వారా, కిల్తంపాలెం గ్రామాల్లో 1,166.43 ఎకరాల విస్తీర్ణంలో రూ.531.36 కోట్ల పెట్టుబడితో మెగా ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసి, 45వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ యాజమాన్యం ప్రతిపాదనలు సమర్పించింది. ఏపీ ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీ 4.0 కింద జేఎస్‌డబ్ల్యు మెగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అల్యూమినియం రిఫైనరీ కాంప్లెక్స్ నుంచి ఎంఎస్ఎంఈ పార్క్, ఇతర పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన 985.70 ఎకరాల భూమిలోకి కార్యకలాపాలను మార్చడానికి జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది. ఆ కంపెనీ పేరును జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్‌గా మార్చడానికి అంగీకరించింది. ప్రైవేట్ పార్క్స్ పాలసీ మార్గదర్శకాల ప్రకారం ఎకరానికి రూ.3లక్షల మూలధన రాయితీ చెల్లిస్తారు. వీఎంఆర్‌డీఏ ద్వారా లే-అవుట్ అప్రూవల్స్, ల్యాండ్ కన్వర్షన్ చార్జీల పూర్తి మినహాయింపు తదితర ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది.

- విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని గుర్రంపాలెంలో రూ.319.75 కోట్ల పెట్టుబడితో పారిశ్రామిక, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు కోసం అవంతి వేర్‌హౌసింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం.. ఎకరానికి రూ.80 లక్షల రాయితీ ధరతో దశల వారీగా మొత్తం 20 ఎకరాలు కేటాయించడానికి ఆమోదం తెలిపింది.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో మహిళా శక్తి భవన్ స్థాపన, మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) అభివృద్ధి కోసం అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఎలీప్) సంస్థకు ఎకరం రూ.10 లక్షల చొప్పున 30 ఎకరాలు కేటాయించింది. రూ.36.35 కోట్ల పెట్టుబడితో 3వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎలీప్ ప్రతిపాదనలు సమర్పించింది.
- డ్రోన్లు, సెన్సార్లు, ఐవోటీ గేట్‌వేలు, నోడ్‌లు మొదలైన వాటి తయారీ సౌకర్యాలను ఏర్పాటు చేయడం కోసం యాక్సెల్ ఈఎస్‌జీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలో ఎకరం రూ.లక్ష చొప్పున 80 ఎకరాలు కేటాయించింది. దాదాపు రూ.75 కోట్ల పెట్టుబడితో 700 మందికి ఉపాధి కల్పిస్తామని, ఇందుకు గాను సుమారు 200 ఎకరాలు కేటాయించాలని కోరుతూ యాక్సెల్ సంస్థ ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం మొదటి దశలో 80 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

- పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగర్లపాడు, ఇనుపరాజుపల్లె గ్రామాల్లో రూ.2,260 కోట్ల పెట్టుబడితో క్యాపిటివ్ సోలార్ పవర్ ప్లాంట్‌తో సహా ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ ప్రాజెక్టును చేపట్టి 350 మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చిన శ్రీ సిమెంట్ లిమిటెడ్ కంపెనీకి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని ప్రకటించింది. ప్రాజెక్టు స్థిర మూలధన పెట్టుబడిలో 39 శాతం సబ్సిడీని పదేళ్లలో అందించనుంది. ఏడేళ్ల పాటు యూనిట్‌కు రూపాయి చొప్పున మొత్తం రూ.86.55 కోట్ల వరకు విద్యుత్తు సుంకం మినహాయింపు లభిస్తుంది.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ.33.50 కోట్ల పెట్టుబడితో పుట్టగొడుగుల యూనిట్‌ను నెలకొల్పనున్న ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు, కర్నూలు జిల్లాలోనే రూ.758 కోట్ల పెట్టుబడితో ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయనున్న ఆర్‌సీపీఎల్‌కు, చిత్తూరు జిల్లాలో రూ.201.98 కోట్ల పెట్టుబడితో రిఫైన్డ్ ఆయిల్స్, సోయా మిల్క్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్న ఎస్‌వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు, ఏలూరు జిల్లాలో రూ.208.77 కోట్ల పెట్టుబడితో క్రూడ్ పామ్ కర్నెల్ ఆయిల్ రిఫైనరీ యూనిట్‌ను నెలకొల్పనున్న గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థలకు ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించింది.

సరస్వతి పవర్ కేసులో జగన్‌కు ఎదురుదెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

అప్పిలేట్ ట్రిబ్యునల్‌లోని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.శేషసాయి, టెక్నికల్ మెంబర్ జతీంద్రనాథ్ స్వయిన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. తద్వారా ఎన్‌సీఎల్‌టీలో జగన్‌కు ఏకపక్షంగా వచ్చిన ఆదేశాలను కట్టడి చేసినట్లయింది. జగన్ తరఫు న్యాయవాది పీఎస్ రామన్ కూడా.. వాదనలు పూర్తయ్యే వరకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలను అమలు చేయనందుకు ధిక్కార పిటిషన్ వేయబోమని తెలిపారు. సరస్వతి పవర్‌లో జగన్ తనకు, తన భార్య భారతికి చెందిన షేర్లను తన సోదరి వైఎస్ షర్మిలకు గిఫ్ట్ డీడ్ రూపంలో బదిలీ చేశారు. తర్వాత షర్మిల ఆయనతో విభేదించడంతో ఆమెకు ఇచ్చిన షేర్లను వెనక్కి తీసుకునేందుకు జగన్ హైదరాబాద్‌లోని ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. షర్మిలకు షేర్ల బదిలీ అక్రమంగా జరిగిందని, దానిని రద్దు చేయాలని ఎన్‌సీఎల్‌టీని కోరారు. ఈ ఏడాది జూలై 29న ఎన్‌సీఎల్‌టీ జగన్‌కు అనుకూలంగా ఆదేశాలిచ్చింది. షేర్లను బహుమతిగా ఇస్తానని 'మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్' ద్వారా జగన్ అంగీకరించినప్పటికీ.. అసలు షేర్ సర్టిఫికెట్లను అందజేయనందున బదిలీ చట్టబద్ధంగా పూర్తి కాలేదని పేర్కొంది. సరస్వతి పవర్‌లో రిజిస్టర్ ఆఫ్ మెంబర్స్‌ను సవరించి.. జగన్ (29.88శాతం), భారతి (16.30 శాతం), విజయలక్ష్మి(48.99శాతం)ని షేర్ హోల్డర్లుగా చూపాలని.. మిగిలినవి క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినవిగా పేర్కొంటూ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు తెలియజేయాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. ఈ ఆదేశాలనే సరస్వతి పవర్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేసింది.

ఇందిరా టెలివిజన్ కేసులో కౌంటర్ వేయండి

- రాష్ట్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఇందిరా టెలివిజన్(జగన్ టీవీ) ప్రసారాల నిలిపివేత కేసులో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. "కొన్ని ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా తమ టీవీ ప్రసారాలు నిలిపివేశారని ఈ ఏడాది జూలై 19న ఇందిరా టెలివిజన్ వేసిన రిట్ పిటిషన్ మంగళవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం తమ టీవీ ప్రసారాలను పూర్తిగా అడ్డుకుంటోందన్నారు. గతంలోనే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. దీంతో తదుపరి విచారణలోపు కౌంటర్ వేయాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను నవంబరు 25కు వాయిదా వేసింది.

బాణసంచా పేలుడుపై 2 వారాల్లో నివేదిక ఇవ్వండి

- సీఎస్, డీజీపీలకు జాతీయ మానవహక్కుల కమిషన్ నోటీసులు

న్యూఢిల్లీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొమరిపాలెంలోని బాణసంచా తయారీ యూనిట్‌లో జరిగిన పేలుడు ఘటనను జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రమాదంలో ఏడుగురు మరణించినట్టు మీడియాలో వచ్చిన అంశాలు నిజమైతే మానవహక్కుల ఉల్లంఘన అంశాలు తలెత్తుతాయని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఘటనపై పూర్తి నివేదికను రెండు వారాల్లోగా ఇవ్వాలని సీఎస్‌కు నోటీసులు జారీ చేసింది.


జోగి... జగన్ జేబులో మనిషి

- కల్తీ మద్యం కేసులో ఇద్దరినీ అరెస్టు చేయాలి: ఎమ్మెల్యే వసంత



అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జోగి రమేశ్ ఓ అసాంఘిక శక్తి. చంద్రబాబుకు చెడ్డపేరు తెచ్చేందుకు తన చిన్ననాటి స్నేహితుడైన అద్దేపల్లి జనార్దన్‌తో కలిసి కల్తీ మద్యం డ్రామాను నడిపించాడు. సెప్టెంబరు 24న ఆఫ్రికాకు వెళ్లాల్సిన జనార్దన్ రావు 23 సాయంత్రం గంటపాటు జోగి రమేశ్ ఇంటికి వెళ్లి ఏం మాట్లాడారు? జోగి రమేశ్ ఇంటి సీసీ కెమెరాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తే నిజాలు వెలుగు చూస్తాయి. తంబళ్లపల్లి, ములకలచెరువులో కల్తీ మద్యం గురించి జోగి రమేశ్ అనుచరుడు సురేశ్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతా పక్కా ప్లాన్ ప్రకారం చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. జగన్ డైరెక్షన్‌లో జోగి రమేశ్, జనార్దన్‌రావు కల్తీ మద్యం వ్యాపారం చేశారు. జగన్‌ను, జోగి రమేశ్‌ను అరెస్టు చేస్తే ఈ కేసులో వాస్తవాలు వెలుగు చూస్తాయి' అని ఎమ్మెల్యే వసంత అన్నారు.

నెల్లూరు టీడీపీ నేతలపై పల్లా ఆగ్రహం



అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా టీడీపీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తీరుపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు నేతలు తమ మధ్య ఉన్న విభేదాలతో పరస్పరం ఒకరిపై ఒకరు విలేకరుల సమావేశాలు పెట్టుకుంటూ రోడ్డున పడుతుండటంతో పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు పల్లా రంగంలోకి దిగారు. నేతలిద్దరికీ ఫోన్ చేశారు. 'పార్టీ క్రమశిక్షణను కాపాడటం ప్రతి కార్యకర్త, నాయకుడి ప్రాథమిక బాధ్యత. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు. నేతలిద్దరూ తమ వ్యవహార శైలి మార్చుకోవాలి' అని పల్లా సూచించారు.

190 కొత్త 108 వాహనాలను త్వరలో ప్రారంభిస్తాం: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 190 కొత్త 108 వాహనాలను త్వరలో ప్రారంభించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో క్షతగాత్రులను మరింత వేగంగా ఆస్పత్రులకు తరలించేందుకు అవకాశం ఏర్పడుతుందని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో డొక్కు, తుక్కుగా తయారై, తరచూ మరమ్మతులకు గురవుతున్న అంబులెన్స్‌లను తొలగించి, వాటి స్థానంలో కొత్త అంబులెన్స్‌లు నడుపుతామని తెలిపారు. తద్వారా గోల్డెన్ అవర్‌లోనే క్షతగాత్రులు ఆస్పత్రులకు చేరుకుని వైద్యం పొందుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 650 అంబులెన్స్‌లు నడుస్తున్నాయని, పాత వాటిని తొలగిస్తే కొత్త వాటితో కలిపి వాహనాల సంఖ్య 731కు చేరుకుందని వివరించారు. గత ప్రభుత్వంలో నీలం, ఆకుపచ్చ రంగుల్లో అంబులెన్స్‌లు ఉండేవని, కొత్త అంబులెన్స్‌లు జాతీయ అంబులెన్స్ కోడ్ ప్రకారం తెలుగు, ఎరుపు రంగుల్లో ఉంటాయని తెలిపారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో డిజిటల్ తరగతులు

అమరావతి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమశాఖకు చెందిన మూడు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ఉన్న స్టడీ సర్కిళ్లకు ఒక్కో కేంద్రానికి రూ.30 లక్షల చొప్పున పీఎంఅజయ్ పథకం కింద 2023-24 సంవత్సరానికి సంబంధించిన రూ.90 లక్షల నిధులు ఖర్చు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.లని కోరారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.